

# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

18.09.2026
శుక్రవారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 127
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## భారత్‌పై ప్రపంచ దేశాల నమ్మకం పెరుగుతోంది

- సెమీకండక్టర్ రంగంలో భారీ సంస్కరణలు
- సెమీకాన్ ఇండియా 2026 సదస్సు
- ప్రారంభించిన ప్రధాని మోదీ
- చిప్ తయారీ నుంచి ఏఐ టెక్నాలజీ వరకు

2లో..



## పెయింట్ వేసుకునే నువ్వా!

- నీ సంగతి నాకు తెలియదా?
- మాజీ మంత్రి కేటీఆర్ సెటైర్లు
- నేను అమెరికాలో ఉద్యోగం చేసి సంపాదించా
- కొండారెడ్డిపల్లి పోయి అడిగితే..
- మీ బతుకు మొత్తం బయటపడుతుంది
- సీఎం రేవంత్ రెడ్డిపై ఫైర్




హైదరాబాద్, సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్

గోడల మీద పెయింట్ వేసుకునే నీ సంగతి నాకు తెలియదా..కొండారెడ్డిపల్లి పోయి అడిగితే మీ బతుకు మొత్తం బయటపడుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై ఫైర్ అయ్యారు. కేసీఆర్‌కు 1000 ఫాం హౌస్ వద్ద ఎకరాలు ఉందని ఒకసారి, నేడు 67 ఎకరాలని మరోసారి సీఎం చెప్పిన అబద్ధాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రగతి భవన్‌లో 150 బెడ్ రూంలు ఉన్నాయని.. బంగారు బాత్రూంలు ఉన్నాయని చేసిన చిల్లర వ్యాఖ్యల్లో ఎంత నిజం ఉందో.. నిన్న రేవంత్ చేసిన ఆరోపణల్లో కూడా అంతే నిజం ఉందన్నారు.

7లో..

## ఆదిత్య ఠాక్రేకు రూ.500 కోట్ల లీగల్ నోటీసు

- దిశా సాలియాన్ కేసులో ట్విస్ట్
- సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాజీ మేనేజర్ దిశా సాలియన్ మృతి కేసు
- తండ్రి సతీశ్ సాలియాన్ వీడియో

2లో..



## దేశ వ్యవహారాల్లో జోక్యం చేసుకోద్దు

- చేస్తే ఏం జరుగుతుందో మోదీ చూపించారు
- సీఎం చంద్రబాబు నాయుడు
- భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారబోతోంది
- దీన్ని ఎవరూ ఆపలేరని కామెంట్
- వారణాసిలో నిర్వహించిన సేవా సంకల్ప్ అభియాన్
- హాజరై మాట్లాడిన చంద్రబాబు
- 11 కోట్ల మంది పీఎం కిసాన్ ద్వారా లబ్ధి
- మధ్యవర్తులు లేకుండా రైతుల ఖాతాల్లోనే డబ్బులు




వారణాసి, సెప్టెంబర్ 17, అనంతజనశక్తి న్యూస్

భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారబోతోందని.. దీన్ని ఎవరూ ఆపలేరని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. వారణాసిలో నిర్వహించిన సేవా సంకల్ప్ అభియాన్‌లో ఆయన మాట్లాడారు. "దేశంలో 80 కోట్ల మందికి ఉచిత రేషన్ బియ్యం పంపిణీ జరుగుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. ప్రతి పేదవాడికి తాగునీరు అందించాలనేదే ప్రధాని లక్ష్యం. సుమారు 11 కోట్ల మంది పీఎం కిసాన్ ద్వారా లబ్ధి పొందుతున్నారు. మధ్యవర్తులు లేకుండా రైతుల ఖాతాల్లోనే డబ్బులు జమ అవుతున్నాయి.

కొవిడ్ సంక్షోభంలోనూ ప్రధాని మోదీ మంచి పాలన అందించారు. ఆ సమయంలో 140 కోట్ల మందిని ఆయన కాపాడారు. ఉచితంగా దేశ ప్రజలకు కొవిడ్ వ్యాక్సిన్లు వేశారు. ప్రపంచంలోని 101 దేశాలకు కొవిడ్ వ్యాక్సిన్లు పంపారు. గతంలో భారత్ ఆయుధాలను దిగుమతి చేసుకునేది. ప్రస్తుతం దేశంలోనే ఆయుధాల ఉత్పత్తి జరుగుతోంది. టెక్నాలజీని అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని మోదీనే. మహిళలే కేంద్రంగా దేశంలో అభివృద్ధి జరుగుతోంది. బేటీ బచావో.. బేటీ పడావో, ఉజ్వల సహా తదితర పథకాల ద్వారా మహిళా సాధికారత సాధ్యమవుతోంది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు చట్టం చేశారు. భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే ఏం జరుగుతుందో ప్రధాని చూపించారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ సత్తాను ప్రపంచానికి చాటిచెప్పారు. దేశంలో తీవ్రవాదం లేకుండా చర్యలు చేపట్టారు. సుదీర్ఘకాలం నలిగిన అయోధ్య సమస్యను పరిష్కరించారు'' అని చంద్రబాబు కొనియాడారు.

**కాశీ విశ్వనాథుడికి ప్రత్యేక పూజలు**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వారణాసి పర్యటనలో ఉన్నారు.. ఇక, ఆయన శ్రీ కాశీ విశ్వనాథ స్వామివారిని దర్శించుకున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా ఆయన కాశీ విశ్వనాథ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి సీఎం చంద్రబాబు ఆలయానికి వెళ్లారు.

2లో..

## ప్రతీ ఆశీర్వాదం నా సంకల్పాన్ని మరింత బలపరుస్తుంది

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- ప్రజల ఆశీస్సులే తనను దేశసేవ వైపు నడిపిస్తున్నాయి

2లో..



## మెల్‌బోర్న్‌లో రోడ్డు ప్రమాదం

### ఇద్దరు విశాఖ వాసులు మృతి

మెల్‌బోర్న్, సెప్టెంబర్ 17, అనంతజనశక్తి న్యూస్

ఆస్ట్రేలియా(లోని మెల్‌బోర్న్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విశాఖవాసులు మృతి చెందారు. విశాఖ కు చెందిన జీటీ ప్రసాద్ తన భార్యతో కలిసి శుభకార్యంలో పాల్గొనేందుకు ఆస్ట్రేలియా వెళ్లారు. మెల్‌బోర్న్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రసాద్ భార్య, కోడలు మృతి చెందగా.. కారు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

2లో..



## అఫిడవిట్‌లో తప్పులు రాశారా?

- మంత్రి పొంగులేటి
- కేసీఆర్‌కు వందల ఎకరాలుంటే..!
- పదేళ్ల పాలనలో ఉద్యమకారులకు అప్పులే మిగిలాయి

హైదరాబాద్, సెప్టెంబర్ 17, అనంతజనశక్తి న్యూస్

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఉద్యమకారులకు అప్పులే మిగిలాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఉద్యమకారులకు ఆస్తులు తగ్గితే.. కేసీఆర్ కు రూ.లక్షల కోట్లు వచ్చాయని ఆరోపించారు. సీఎం రేవంత్, ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శల నేపథ్యంలో పొంగులేటి స్పందించారు. "2004 వరకు కేసీఆర్‌కు ఒక్క ఎకరా భూమి కూడా లేదు. ఎకరా భూమి కూడా లేదని ఆయన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

2లో..

## మమ్మల్ని బలవంతం చేయకండి

- సహాయ శిబిరాల్లో మరణాలపై..
- మణిపూర్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు వార్నింగ్
- 25 అనుమానాస్పద మరణాలు
- లైంగిక వేధింపుల ఘటనలపై ఆగ్రహం

7లో..

## కొన్ని విభేధాలు కనిపించినా.. వెంటనే సమిసిపోయాయి

- ఎప్పుడూ తేడా కొట్టిందే లేదు: లోకేష్
- టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య సమన్వయం బాగుంది
- సమస్యలు తలెత్తితే చర్చల ద్వారా పరిష్కరించుకుంటాం
- తమ మధ్య ఎలాంటి సందేహాలు లేవు

7లో..



అమరావతి, సెప్టెంబర్ 17, అనంతజనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. కింది స్థాయిలో అక్కడక్కడ కొన్ని విబేధాలు కనిపించినా.. అవి వెంటనే సమసిపోయేలా చర్యలు తీసుకున్నారు.. ఇక, రాష్ట్ర స్థాయిలో అయితే.. ఎప్పుడూ తేడా కొట్టిందే లేదు.. ఈ నేపథ్యంలో.. నెల్లూరు పర్యటనలో మంత్రి నారా లోకేష్ కూటమి పార్టీల మధ్య సమన్వయంపై కీలక వ్యాఖ్యలు చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం బాగుందని, చిన్నచిన్న సమస్యలు తలెత్తితే చర్చల ద్వారా పరిష్కరించుకుంటామని తెలిపారు.

## మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్‌పై హరీశ్ రావు పరువునష్టం దావా

క్షుద్రపూజల ఆరోపణలు.. ఉద్దేశపూర్వకంగానే అసత్య ప్రచారం




2లో..

హైదరాబాద్, సెప్టెంబర్ 17, అనంతజనశక్తి న్యూస్

క్షుద్రపూజలు చేయిస్తున్నారన్న ఆరోపణలపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. తనపై ఉద్దేశపూర్వకంగానే అసత్య ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ నేతలపై మండిపడ్డారు. ఈ నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌కు హరీశ్ రావు ఇప్పటికే లీగల్ నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే/ఎంపీ కోర్టులో పరువు నష్టం దావా వేశారు. దీని దృష్ట్యా హరీశ్ రావు కోర్టులో హాజరై స్టేట్‌మెంట్ ఇవ్వనున్నారు.

## 90 శాతం భూముల్లో సాగు కాలేదు

కృష్ణా డెల్టా పరిస్థితిపై పేర్ని నాని కీలక వ్యాఖ్యలు



2లో..

అమరావతి, సెప్టెంబర్ 17, అనంతజనశక్తి న్యూస్

కృష్ణా డెల్టాలో సాగునీటి సమస్యపై వైసీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని నాని ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌తో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన డెల్టా పరిధిలోని రైతుల పరిస్థితిని వివరించారు.

# మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్‌పై హరీశ్ రావు పరువునష్టం దావా



(మొదటి పేజీ తరువాయి)

కాగా.. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రంలో కరవు కాటకాలు రావాలని, దుర్భిక్షం తాండవం చేయాలని బీఆర్ఎస్ నేత హరీశ్ రావు క్షుద్రపూజలు చేయిస్తున్నారని.. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ రావు చేసిన ఆరోపణలు దుమారం రేపుతున్నాయి. ఈ ఆరోపణలను హరీశ్ రావు కొట్టిపారేశారు. రాజకీయ కక్షసాధింపు చర్యలలో భాగంగా ఈ అసత్య ప్రచారాలు, వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు.

# భారత్‌పై ప్రపంచ దేశాల నమ్మకం పెరుగుతోంది



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సెమీకాన్ ఇండియా 2026ను ప్రారంభించారు. న్యూఢిల్లీలోని యశోభూమిలో సెప్టెంబర్ 17 నుంచి 19 వరకు ఈ గ్లోబల్ ఈవెంట్ జరగనుంది. 52 దేశాలకు చెందిన 600కు పైగా కంపెనీలు, స్టార్టప్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాయి. సెమీకండక్టర్ రంగానికి చెందిన 400 మందికి పైగా ఎగ్జిక్యూటివ్‌లు, స్పీకర్లు, వేలాది మంది సందర్శకులు ఇందులో పాల్గొంటున్నారు. ఈ ఏడాది సెమీకాన్ ఇండియా థీమ్‌గా ను నిర్ణయించారు. సిలికాన్ నుంచి పూర్తిస్థాయి వ్యవస్థల వరకు సెమీకండక్టర్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం.

**భారత్‌పై ప్రపంచ దేశాల నమ్మకం పెరుగుతోంది: మోడీ**

సెమీకాన్ ఇండియా 2026 ప్రారంభోత్సవంలో ప్రధాని మోడీ ప్రసంగించారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ సంస్కృతిలో విశ్వకర్మను సృష్టి, నిర్మాణానికి దేవుడిగా పూజిస్తారని పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధన కోసం దేశ ప్రజలంతా కృషి చేస్తున్నారని మోడీ అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న సమయంలోనే ప్రపంచ దేశాలకు భారత్‌పై నమ్మకం కూడా పెరుగుతోందని చెప్పారు. గత కొన్ని రోజులుగా భారత్‌లో చోటుచేసుకున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రస్తావించారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీ వంటి రంగాల్లో చర్చలు జరుగుతున్నాయని, దేశంలో మౌలిక వసతుల అభివృద్ధి వేగంగా కొనసాగుతోందని తెలిపారు.

**పాలసీల నుంచి కమర్షియల్ చిప్ తయారీ వరకు**

సెమీకాన్ ఇండియా కార్యక్రమం తొలిసారిగా 2021లో ప్రారంభమైంది. అప్పట్లో సెమీకండక్టర్ రంగానికి సంబంధించిన విధానాలపై చర్చలు జరిగాయి. ఆ తర్వాతి సంవత్సరాల్లో ప్రాజెక్టులు, ఒప్పందాలు, శంకుస్థాపనలు, పైలట్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టారు. గత ఏడాది పైలట్ ప్రాజెక్టులు, చిప్ నమూనాలపై చర్చించగా, ఈ ఏడాది కమర్షియల్ చిప్ తయారీపై ప్రధానంగా దృష్టిసారించినట్లు ప్రధాని తెలిపారు. గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన సూచి సెమీకాన్, పంజాబ్‌లోని మొహాలీకి చెందిన CDIL సంస్థలను ప్రధాని అభినందించారు. భారత సెమీకండక్టర్ ఎకోసిస్టమ్ అభివృద్ధికి కృషి చేస్తున్న పరిశ్రమల ప్రతినిధులు, ఇతర భాగస్వాములకు కూడా శుభాకాంక్షలు తెలిపారు.

**సెమీకండక్టర్ మిషన్ 2.0కు భారీ కేటాయింపులు**

భారత్ తన సెమీకండక్టర్ మిషన్ రెండో దశను ప్రారంభించింది. మొదటి దశ పరిమాణం 8 బిలియన్ డాలర్ల వరకు ఉండగా, రెండో దశకు ప్రభుత్వం 13.5 బిలియన్ డాలర్లను నిర్ణయించినట్లు మోడీ చెప్పారు. భారతీయ చిప్ డిజైన్ కంపెనీలు, స్టార్టప్‌లతో పాటు ప్రపంచంలోని ఇతర సంస్థలు కూడా భాగస్వామ్యం చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ప్రాజెక్టుల విజయానికి అవసరమైన విధానాలు, ఫ్రేమ్‌వర్క్‌లు, ఇతర చర్యలను ప్రభుత్వం చేపడుతోందని పేర్కొన్నారు.

**సరఫరా గొలుసు బలోపేతంపై ప్రత్యేక దృష్టి**

సెమీకండక్టర్ పరిశ్రమ అభివృద్ధికి సరఫరా గొలుసు కీలకమని ప్రధాని మోడీ అన్నారు. ఈ రంగంలో సరఫరా గొలుసును బలోపేతం చేసేందుకు భారత్‌లో అనేక సంస్కరణలు చేపట్టినట్లు తెలిపారు. చిప్ తయారీకి అవసరమైన రసాయనాలు, ముడి పదార్థాల కోసం గ్లోబల్ కంపెనీలకు భారత్‌లో అనుకూలమైన ఎకోసిస్టమ్ ఏర్పడుతోందని చెప్పారు. భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా అవసరమైన ప్రణాళికలు కూడా సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. మొదటి దశలో 12 ప్రాజెక్టులకు ఇప్పటికే అనుమతులు లభించాయని, తదుపరి దశలో మరిన్ని ప్రాజెక్టులకు ఆమోదం లభిస్తుందని తెలిపారు. దేశంలో ఇంజినీరింగ్ ప్రతిభకు పెద్ద సంఖ్యలో మానవ వనరులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

**ఏఐ అభివృద్ధితో పెరుగుతున్న చిప్ డిమాండ్**

ప్రపంచవ్యాప్తంగా ఏఐ టెక్నాలజీకి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో సెమీకండక్టర్ రంగం కొత్త సవాళ్లను ఎదుర్కొంటోందని మోడీ తెలిపారు. ట్రాన్సిస్టర్ల పరిమాణం తగ్గుతున్న కొద్దీ టెక్నాలజీ వేగం పెరుగుతోందని అన్నారు. గత రెండేళ్లలో సెమీకండక్టర్ మార్కెట్ వృద్ధి 20 శాతానికి మించి ఉందని పేర్కొన్నారు. ప్రపంచంలోని అనేక కంపెనీలు ఏఐపై దృష్టి సారిస్తున్నాయని, మెమరీ, ప్రాసెసర్ ఇంటిగ్రేషన్‌కు సంబంధించిన సవాళ్లపై పరిశ్రమలు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు.

# ప్రతీ ఆశీర్వాదం నా సంకల్పాన్ని మరింత బలపరుస్తుంది

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17,**

**అనంతజనశక్తి న్యూస్**



దేశవ్యాప్తంగా అందుతున్న విషెస్‌పై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. తన 76వ పుట్టినరోజు సందర్భంగా వెల్లువెత్తుతున్న శుభాకాంక్షలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ చేపట్టిన 'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమంపై ఆయన మాట్లాడుతూ.. ప్రజల ప్రేమాభిమానాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. ప్రజల నుంచి అందుతున్న ఆశీర్వాదాలు దేశసేవ పట్ల తన సంకల్పాన్ని మరింత బలోపేతం చేస్తాయని చెప్పుకొచ్చారు.

మోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని గాయని స్నేహా శంకర్, కళాకారుడు అమన్ పంత్ రూపొందించిన 'ఆశీర్వాద్ కా దియా' ప్రత్యేక గీతాన్ని విడుదల చేశారు. మోదీ జన్మదినంతో పాటు ఆయన 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని గుర్తుచేస్తూ ఈ పాటను అంకితం చేశారు. దీనిపై స్పందించిన ప్రధాని.. తనకు లభిస్తున్న ప్రజల ఆశీర్వాదాలు దేశానికి సేవ చేయాలన్న తన నిబద్ధతను మరింత పెంచుతాయని పేర్కొన్నారు.

కాగా.. మోదీ బర్త్‌డే సందర్భంగా నేడు దేశవ్యాప్తంగా ప్రజలు 'ఆశీర్వాద్ కా దియా (ఆశీర్వాద దీపం)' కార్యక్రమం చేపట్టాలని బీజేపీ పిలుపునిచ్చింది. సాయంత్రం 6 నుంచి 7 గంటల మధ్య ఇళ్లలో దీపాలు వెలిగించి మోదీ ఆయురారోగ్యాలు, విజయాన్ని ఆకాంక్షించాలని పార్టీ జాతీయధ్యక్షుడు నితిన్ నబీన్ విజ్ఞప్తి చేశారు. తానూ ఆశీర్వాద దీపం వెలిగిస్తానన్న ఆయన.. ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజా సేవే దేశ సేవ అన్న సూత్రంతో మోదీ పనిచేస్తున్నారని నితిన్ నబీన్ పేర్కొన్నారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూనే కొత్త విధానాలు, కార్యక్రమాలు, పథకాలను తీసుకొచ్చారన్నారు. ఇక మోదీ పుట్టినరోజు సందర్భంగా 'సేవా సంకల్ప్ అభియాన్' పేరుతో నెల రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని కూడా చేపట్టింది బీజేపీ. నేటి నుంచి అక్టోబరు 17 వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. రక్తదాన శిబిరాలు, పరిశుభ్రత కార్యక్రమాలు, ప్రదర్శనలు, సదస్సులు, ప్రజా సంబంధ కార్యక్రమాలు వంటివి ఇందులో భాగం కానున్నాయి.

# ఆదిత్య ఠాక్రేకు రూ.500 కోట్ల లీగల్ నోటీసు



**హైదరాబాద్, సెప్టెంబర్ 17, అనంతజనశక్తి న్యూస్**

దివంగత బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాజీ మేనేజర్ దిశా సాలియన్ అనుమానాస్పద మృతి కేసు రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. న్యాయం కోసం తానొక తండ్రిగా జరుపుతున్న పోరాటాన్ని రాజకీయ ప్రేరేపితమైనదిగా చిత్రీకరించేందుకు యత్నించారంటూ దిశ తండ్రి సతీశ్ సాలియాన్ సంచలన ఆరోపణలు చేశారు. ఈక్రమంలోనే మహారాష్ట్ర మాజీ మంత్రులు, శివసేన (యూబీటీ) నేత ఆదిత్య ఠాక్రేతో పాటు ఎన్‌సీపీ (ఎస్పీ) నాయకుడు అనిల్ దేశ్‌ముఖ్‌లకు రూ.500 కోట్ల భారీ నష్టపరిహారం కోరుతూ సతీశ్ లీగల్ నోటీసులు జారీ చేశారు.

**క్షమాపణలకు డిమాండ్**

తన కుమార్తెపై సామూహిక అత్యాచారం, హత్య జరిగాయని, దీనిపై చట్టబద్ధమైన సమగ్ర విచారణ జరిపించాలని కోరుతుంటే.. తమ ప్రయోజనాల కోసం తనపై తప్పుడు ఆరోపణలు చేశారని సతీశ్ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సీబీఐ ఇప్పటికే విచారణ పూర్తి చేసి ఆదిత్యకు క్లీన్ చిట్ ఇచ్చిందంటూ తప్పుడు ప్రచారం చేశారని నోటీసులో పేర్కొన్నారు. 2025 మార్చి 23వ తేదీన అనిల్ దేశ్‌ముఖ్ మాట్లాడుతూ.. ఈ కేసుఆదిత్య ఠాక్రేను సతాయించడానికి జరుగుతున్న కుట్ర అని వ్యాఖ్యానించడం ద్వారా బాధితుడిని అగౌరవపరిచారని ఆరోపించారు. ఈ క్రమంలోనే వారిద్దరూ ఎలక్ట్రానిక్, ప్రింట్, డిజిటల్ మీడియాతో పాటు తమ అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో కనీసం 3 నిమిషాల వ్యవధితో కూడిన వీడియో ద్వారా బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

**అసలేం జరిగిందంటే?**

2020 జూన్ 8వ తేదీన ముంబయిలోని ఓ భవనంపై నుంచి పడి 28 ఏళ్ల దిశా సాలియన్ మృతి చెందగా.. తొలుత పోలీసులు దీనిని ప్రమాదవశాత్తు జరిగిన మరణంగా కేసు నమోదు చేశారు. ఆరు రోజుల వ్యవధిలోనే నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ తన ఫ్లాట్‌లో శవమై కనిపించడం తీవ్ర దుమారం రేపింది. ఆ రోజు ఇంట్లో జరిగిన పార్టీకి ఆదిత్య ఠాక్రే, ఆయన బాడీగార్డులతో పాటు నటులు సూరజ్ పంచోలి, డినో మోరియా హాజరయ్యారని, దిశపై సామూహిక అత్యాచారం జరిగిందనడానికి సాక్ష్యాలు ఉన్నాయని మృతురాలి తండ్రి సతీశ్ సాలియన్ బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ పరిణామాల మధ్య ఆరేళ్ల తర్వాత సీబీఐ హత్య, క్రిమినల్ కుట్ర కోణాల్లో ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఆదిత్య ఠాక్రే, రియా చక్రవర్తి, డినో మోరియా, సూరజ్ పంచోలి పాత్రలపై విచారణ ముమ్మరం చేసింది.

**ఆరోపణలను ఖండించిన ఆదిత్య ఠాక్రే**

తనపై వస్తున్న తీవ్ర ఆరోపణలపై ఆదిత్య ఠాక్రే సోషల్ మీడియా ద్వారా స్పందించారు. "నా జీవితంలో దిశా సాలియాన్‌ను నేనెప్పుడూ కలవలేదు. ఆమెతో ఎలాంటి పరిచయం కూడా లేదు. గత ఆరేళ్లుగా ఎలాంటి ఆధారాలు లేకుండా రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాల కోసం నా క్యారెక్టర్ అసస్సినేషన్ చేయడానికి కొందరు యత్నిస్తున్నారు. సీబీఐ అధికారిక పునర్విచారణకు ఎలాంటి రాజకీయ అడ్డంకులు సృష్టించకుండా విచారణ సాగనివ్వాలి" అని ఆయన పేర్కొన్నారు.

# మెల్‌బోర్న్‌లో రోడ్డు ప్రమాదం



(మొదటి పేజీ తరువాయి)

తన కళ్లెదుటే కారు ప్రమాదంలో భార్య, కోడలు నేహా మృతి చెందటంతో ఆయన తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. జీటీ ప్రసాద్ గతంలో వీడీసీఏలో జాయింట్ సెక్రటరీగా పనిచేశారు. దాదాపు పది రోజుల తర్వాత మృతదేహాలు విశాఖకు చేరుకునే అవకాశముందని సమాచారం.

# 90 శాతం భూముల్లో సాగు కాలేదు

(మొదటి పేజీ తరువాయి)

కృష్ణా డెల్టాలో ఆరు లక్షలకు పైగా ఎకరాల ఆయకట్టు ఉన్నప్పటికీ, ఇప్పటికీ దాదాపు 50 నుంచి 55 వేల ఎకరాల్లో సాగు ప్రారంభం కాలేదని తెలిపారు. సాగు సమయం వచ్చినా నీరు అందక రైతులు పంటలు వేసుకోలేక పొలాలను ఖాళీగా ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్ని నాని పేర్కొన్నారు. అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక, తోట్లవల్లూరు, మచిలీపట్నం నార్త్ ప్రాంతాల్లో దాదాపు 90 శాతం వరకు సాగు జరగలేదని తెలిపారు. మచిలీపట్నం సౌత్‌లో కూడా సుమారు 40 శాతం భూములు ఇంకా సాగుకు దూరంగా ఉన్నాయని చెప్పారు.

గూడూరు, పెడన, బంటుమిల్లి, కృతివెన్ను ప్రాంతాల్లో దాదాపు 20 వేల ఎకరాల్లో ఇప్పటికీ సాగు ప్రారంభం కాలేదని పేర్ని నాని వివరించారు. గుడివాడ రూరల్, గుడ్లవల్లేరు ప్రాంతాల్లో కూడా వందల ఎకరాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. మొక్కలు నాటాల్సిన సమయంలో నీరు అందకపోవడంతో రైతులు పంటలు వేయలేకపోతున్నారని అన్నారు. సాగు ఆలస్యం కావడం వల్ల రైతుల పెట్టుబడులు పెరగడంతో పాటు దిగుబడులపైనా తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని పేర్ని నాని పేర్కొన్నారు. పంటలు వేసిన రైతుల్లో కూడా ఆందోళన కొనసాగుతోందన్నారు. పంటకు అవసరమైన కీలక సమయంలో నీరు అందకపోతే పంటలు ఎండిపోయి, రైతులు పెట్టిన మొత్తం పెట్టుబడి నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు.

పులిచింతలలో నీటి నిల్వలు ఉన్నప్పటికీ కృష్ణా డెల్టాకు సాగునీరు అందడం లేదని పేర్ని నాని అన్నారు. నీరు ఎప్పుడు వస్తుందనే దానిపై స్పష్టత లేక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని చెప్పారు. నీరు అందుబాటులో ఉన్నప్పటికీ రైతులకు చేరకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కృష్ణా డెల్టాలో రైతుల సాగునీటి సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని పేర్ని నాని డిమాండ్ చేశారు. ఎక్కడెక్కడ సాగు జరగలేదో క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన నీటిని విడుదల చేసి రైతులు పంటలు వేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక, సాగునీటి సమస్య ప్రభావం రైతులకే పరిమితం కాదని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ కూలీలు, విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలపై ఆధారపడే గ్రామీణ కుటుంబాల ఉపాధిపైనా దీని ప్రభావం పడుతుందని తెలిపారు. అందువల్ల ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని కృష్ణా డెల్టాలో సాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు మాజీ మంత్రి పేర్ని నాని..




# అఫిడవిట్‌లో తప్పులు రాశారా?



(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్‌కు ఇప్పుడు వేల కోట్ల ఆస్తులు ఉన్నాయి. ఎన్నికల అఫిడవిట్ ద్వారా కల్వకుంట్ల ముఠా అడ్డంగా దొరికింది. పుట్టుకతోనే కేసీఆర్‌కు వందల ఎకరాలు ఉన్నాయని కేటీఆర్ అంటున్నారు. అలాంటప్పుడు అఫిడవిట్‌లో తప్పులు రాశారా? లేకుంటే ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారా? ఉద్యమకారుల త్యాగాల పునాదులపై రూ.లక్షల కోట్ల ఆస్తులు సంపాదించారు'' అని పొంగులేటి ప్రశ్నించారు.



(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా శ్రీ కాశీ విశ్వనాథుడికి పవిత్ర జలాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

ఇక, పూజల అనంతరం ఆలయ పండితులు సీఎం చంద్రబాబుకు ఆశీర్వచనం అందించారు. అర్చకులు ఆయనకు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, చిరాగ్ పాశ్వాన్, యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి చంద్రబాబు భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ప్రధాని మోడీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పురస్కరించుకుని 'సేవా సంకల్ప అభియాన్'లో భాగంగా వారణాసి నుంచి వాద్‌నగర్ వరకు సేవా యాత్ర నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాశీ విశ్వనాథ ఆలయంలో జలాభిషేకం నిర్వహించడం ప్రధాన కార్యక్రమాల్లో ఒకటిగా ఉంది. వారణాసి-వాద్‌నగర్ మధ్య నిర్వహిస్తున్న సేవా సంకల్ప బైక్ యాత్రలో భాగంగా పవిత్ర జలాలను తీసుకెళ్లే కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు.

19న ఇళ్ల పట్టాలు పంపిణీ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేదలందరికీ సొంత ఇంటిని కల్పించాలనే లక్ష్యంతో ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఈ నెల 19వ తేదీన విశాఖపట్నంలో భారీఎత్తున ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా తన చేతుల

# దేశ వ్యవహారాల్లో జోక్యం చేసుకోద్దు

మీదుగా అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేయనున్నారు. ఈ విడతలో విశాఖ నగర పరిధిలోని సుమారు 25,880 పేద కుటుంబాలకు శాశ్వత ప్రాతిపదికన ఇళ్ల స్థలాలు అందనున్నాయి. దీనికి సంబంధించిన ఏర్పాట్లను అధికార యంత్రాంగం ఇప్పటికే పూర్తి చేసింది. ఈ సంక్షేమ కార్యక్రమం విశాఖకే పరిమితం కాకుండా రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాలకు కూడా విస్తరించనుంది. త్వరలోనే విజయవాడ నగరంలోనూ మరో 24 వేల పేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిర్ణయం తీసుకుంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శక పద్ధతిలో ఇళ్ల స్థలాలు దక్కేలా అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు, ఇళ్ల స్థలాలకు సంబంధించి ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న వివిధ సమస్యలను ప్రభుత్వం వేగంగా పరిష్కరిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే సుమారు 12 వేల ఇళ్ల స్థలాలను విజయవంతంగా క్రమబద్ధీకరించినట్లు రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు.

పేద ప్రజల సొంతింటి కల సాకారం చేయడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాల పేరుతో జరిగిన నాన్చివేత ధోరణులకు స్వస్తి పలికి, అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పట్టాలు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా రాష్ట్రంలోని వేలాది నిరుపేద కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని, ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చొరవపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విశాఖలో జరగనున్న ఈ కార్యక్రమానికి స్థానిక అధికార వర్గాలు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాయి.

# చెన్నైలోని నటి శ్రీదేవి ఆస్తి వివాదం.. సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలు



దివంగత నటి శ్రీదేవికి చెన్నైలోని ఈస్ట్ కోస్ట్ రోడ్డులో 2.7 ఎకరాల స్థలం ఉంది. అయితే, ఇందులో తమకూ వాటా ఉందంటూ శివకామి అనే మహిళ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అయితే, ఇది విచారణకు అర్హత లేదని మద్రాసు హైకోర్టు కొట్టివేసింది. దీంతో పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం తాజాగా కీలక ఉత్తర్వులు వెలువరించింది. ఈ కేసు యథాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశించింది. అలాగే, శ్రీదేవి భర్త బోనీ కపూర్, వారి ఇద్దరు కూమార్తెలకు నోటీసులు జారీచేసింది.

అతిలోక సుందరి, దివంగత నటి శ్రీదేవి కుటుంబానికి చెందిన చెన్నై ఈస్ట్ కోస్ట్ రోడ్‌లోని 2.7 ఎకరాల స్థలం వివాదం మళ్లీ సుప్రీంకోర్టుకు చేరింది. 1988లో శ్రీదేవి కుటుంబం కొనుగోలు చేసిన ఈ ఆస్తిలో తమకు వాటా ఉందంటూ ఒక మహిళ, ఆమె సోదరుడు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం.. తదుపరి విచారణ వరకు సదరు ఆస్తిపై 'యథాతథ స్థితి' పాటించాలని ఆదేశించింది. అనంతరం శ్రీదేవి భర్త బోనీ కపూర్, కుమార్తెలు జాన్వీ కపూర్, ఖుషీ కపూర్‌లకు నోటీసులు జారీ చేసింది. మద్రాస్ హైకోర్టు ఈ కేసును కొట్టివేయడంతో, పిటిషనర్ ఎంసీ శివకామి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ కే.వి. విశ్వనాథన్, జస్టిస్ అరుణ్ పల్లిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది.

**వాదనలు - పరిణామాలు**

ఎం.సి. చంద్రశేఖరన్ ఆస్తిలో తమకు హక్కు ఉందంటూ పిటిషనర్లు పేర్కొన్నారు. ట్రయల్ కోర్టు ఈ కేసును విచారణకు స్వీకరించినప్పటికీ, మద్రాస్ హైకోర్టు ప్రాథమిక దశలోనే తీవ్రమైన విచారణ జరిపి కేసును కొట్టివేసిందని పిటిషనర్ తరఫు లాయర్లు వాదించారు. బోనీ కపూర్ తరఫున సీనియర్ అడ్వకేట్ అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపిస్తూ.. ఈ ఆస్తి రిజిస్ట్రేషన్ 1988 ఏప్రిల్ 19న జరిగిందని తెలిపారు. 2023లో మ్యూటేషన్ అప్లై చేశాక దాదాపు మూడు దశాబ్దాల క్రితం నాటి లావాదేవీని సవాలు చేస్తూ 2025లో ఈ దావా వేశారని, కాలపరిమితి దాటిపోయినందున ఈ కేసు నిలబడదని వాదించారు. విచారణ సందర్భంగా ఆస్తిని విక్రయించిన ఎం.సి. చంద్రశేఖరన్‌కు అందులో ఐదో వంతు వాటా ఉందా? అని ధర్మాసనం ప్రశ్నించింది. పిటిషనర్లు చంద్రశేఖరన్ పిల్లలు అనే వాదనపై ఏమైనా వివాదం ఉందా? అని కూడా ధర్మాసనం అడిగింది. ఐదో వంతు వాటా మొదటి భార్యకు చెందుతుందని, ఇతర హక్కుదారులు కేవలం వారి వారి వాటాలను మాత్రమే క్లెయిమ్ చేసుకోగలరని సింఘ్వి వివరించారు.

**మధ్యవర్తిత్వానికి సుప్రీం సూచన**

వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకునేందుకు మధ్యవర్తిత్వం సరైన మార్గమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. దీనికోసం రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తిని మధ్యవర్తిగా నియమిస్తామని, ఇరు వర్గాలు ఆయన సమక్షంలో చర్చలు జరపాలని సూచించింది. మధ్యవర్తిత్వంలో పురోగతిని సమీక్షించేందుకు ఈ కేసు విచారణను సుప్రీంకోర్టు డిసెంబర్ 18కి వాయిదా వేసింది.

# డ్యూటీ చేయకుండానే నెలకు రూ.70 వేల జీతం ఖాతాలోకి..: కర్ణాటక ఎమ్మెల్యే మేనకోడలి 'నమ్మ క్లినిక్' స్కామ్

కర్ణాటకలోని బాగల్‌కోట్ నమ్మ క్లినిక్లో పని చేస్తున్న ఓ మెడికల్ ఆఫీసర్ తీవ్ర అవినీతి, అక్రమాల ఆరోపణల్లో చిక్కుకున్నారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యను అభ్యసిస్తూనే.. మరోవైపు ప్రభుత్వ నమ్మ క్లినిక్ నుంచి నెలకు రూ. 70,000 పైగా వేతనాన్ని తీసుకుంటున్నట్లు ఆధారాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా సదరు వైద్యురాలు బాగల్‌కోట్ ఎమ్మెల్యే ఉమేష్ మేటి మేనకోడలు డాక్టర్ అంకిత యార్గల్ అని తెలియడంతో ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. విధుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహించడం, ఒకే సమయంలో రెండింటి ద్వారా ప్రయోజనం పొందుతున్నారన్న ఆరోపణలపై ప్రస్తుతం అధికార యంత్రాంగం విచారణ ప్రారంభించింది.

**విధులకు హాజరుకాకుండానే నెల నెలా రూ.70 వేల జీతం!**

డాక్టర్ అంకిత యార్గల్ బాగల్‌కోట్ వాంబే కాలనీలోని నమ్మ క్లినిక్‌లో పని చేస్తున్నారు. ఇందుకోసం ఆమెకు నెలకు రూ.70 వేలకు పైగా జీతం అందుతోంది. అయితే పేరుకే ఆమె అక్కడ పని చేస్తుండగా.. ఒక్కరోజు కూడా ఆమె అక్కడకు వచ్చి విధులు నిర్వహించిన పాపాన పోలేదు. ముఖ్యంగా ఈ ఏడాది మార్చి 3వ తేదీ నుంచి సెప్టెంబర్ వరకు ఆమె ఒక్క రోజు కూడా క్లినిక్‌కు హాజరు కాలేదని అధికారులు జారీ చేసిన నోటీసు ద్వారా తెలుస్తోంది. ఒక మెడికల్ ఆఫీసర్ లేకుండానే క్లినిక్ కొనసాగడం వల్ల స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. అయినప్పటికీ.. ఎస్ఎన్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ నుంచి అనుమతి పొంది ఒక ప్రైవేట్ కాలేజీలో పీజీ చదువుకుంటూనే, క్లినిక్ నుంచి రెగ్యులర్ జీతం పొందుతున్నారని అధికారులు వెల్లడించారు.



**విచారణకు గైర్హాజరు.. సీఈవో తీవ్ర ఆగ్రహం!**

ఈ అక్రమాలపై విచారణ చేపట్టేందుకు బాగల్‌కోట్ జిల్లా పంచాయతీ సీఈవో గజానన్ బలే ఆదేశాలు జారీ చేశారు. అయితే సీఈవో ఎదుట హాజరు కావాల్సిన విచారణకు డాక్టర్ అంకిత డుమ్మా కొట్టారు. దీనిపై తీవ్రంగా స్పందించిన జిల్లా పంచాయతీ సీఈవో.. సెప్టెంబర్ 18వ తేదీన ఉదయం 10 గంటలకు జిల్లా పంచాయతీ కార్యాలయంలోని రూమ్ నంబర్ 11లో జరగబోయే విచారణకు తప్పకుండా హాజరు కావాలని ఆదేశిస్తూ మరో నోటీసు జారీ చేశారు. ఈసారి కూడా విచారణకు రాకపోతే ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంటామని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు.

**కర్ణాటక మెడికల్ కౌన్సిల్ ఫిర్యాదుకు ఆదేశాలు.. రికవరీకి చర్యలు!**

కర్ణాటక ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో పనిచేసే రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ల నిబంధనలకు ఇది తీవ్ర విరుద్ధమని అధికారులు తెలిపారు. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎమ్‌సీ) ప్రొఫెషనల్ ఎథికల్ కోడ్‌ను ఉల్లంఘించినందున ఆమెపై తీవ్ర క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి. వృత్తిపరమైన దుష్ప్రవర్తన కింద ఈ విషయాన్ని 'కర్ణాటక మెడికల్ కౌన్సిల్'
(కేఎమ్‌సీ), ఎన్ఎమ్సికి సిఫార్సు చేస్తామని సీఈవో హెచ్చరించారు. అంతేకాకుండా విధులకు హాజరు కాకుండా అక్రమంగా
పొందిన మొత్తం వేతనాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం రికవరీ చేస్తామని పేర్కొన్నారు. ఈ వివాదం సంచలనం సృష్టించడంతో జిల్లా వైద్యాధికారి (డీహెచ్‌ఓ) రాజ్‌కుమార్ యార్గల్ ఆమెను తక్షణమే విధుల నుంచి తొలగించారు.

# గంగమ్మ లాక్కెళితే.. శివయ్య కాపాడాడు..

## గంగా నదిలో కొట్టుకుపోయి.. 15 రోజుల తర్వాత ప్రాణాలతో బయటపడ్డ మహిళ..

బిహార్‌లోని బక్సర్ జిల్లా కపూర్‌పట్టి గ్రామానికి చెందిన సునయన దేవి (55) అనే మహిళ ఆగస్టు 30న గంగా నదిలో స్నానానికి వెళ్లింది. అయితే ప్రవాహ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఆమె నదిలో కొట్టుకొని పోయింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం ఆ రోజంతా నది పరిసర ప్రాంతాల్లో గాలించారు. కానీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో మరుసటి రోజు ఆమె కుమారుడు గోవింద గోండ్ ఇటార్హి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కుటుంబ సభ్యులు ఆమెపై ఆశలు వదులుకున్నారు. అయితే వారు ఊహించని రీతిలో అద్భుతం చోటు చేసుకుంది. గంగా నదిలో కొట్టుకుపోయినప్పటికీ.. సునయన దేవికి ఈత రావడంతో ఆమె మునిగిపోలేదు. భారీ వరద కారణంగా నదిలో ప్రవాహం ఎక్కువగా ఉండటంతో.. ఆమె 50 కిలో మీటర్ల దిగువకు కొట్టుకొని వెళ్లారు. ఈత కొడుతూ.. నీళ్లలో మునిగిపోకుండా ప్రాణాలు కాపాడుకున్న దేవి.. ఎట్టకేలకు నీళ్ల మధ్యలో ఉన్న పొలంలోని ఓ గుడిసెలో ఆమె తలదాచుకున్నారు. అయితే చుట్టూ వరద నీరు ఉండటంతో ఆ ప్రాంతం దీవిని తలపించింది. అక్కడి నుంచి బయటకు రావడం ఆమెకు సాధ్యపడలేదు. గంగా నదిలోని నీళ్లను తాగుతూ ప్రాణాలు కాపాడుకున్న ఆమె.. రోజుల తరబడి ఎదురు చూసినప్పటికీ వరద తగ్గుముఖం పట్టకపోవడం.. అటుగా ఎవరూ రాకపోవడంతో.. సోమవారం ధైర్యం చేసి ఈదుకుంటూ అక్కడి నుంచి ఒడ్డుకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. కొంత దూరం వెళ్లిన తర్వాత ప్రవాహ తీవ్రత ఎక్కువగా ఉండటం, రోజుల తరబడి ఆహారం తీసుకోకపోవడంతో ఈదడం ఆమెకు సాధ్యపడలేదు. దీంతో శివ గురు... శివ గురు అంటూ గట్టిగా కేకలు వేయసాగింది.

దేవి కేకలు విన్న మత్స్యకారులు.. ఎంతో కష్టపడి ఆమెను కాపాడి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. తర్వాత ఆమెను హల్దీ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. దేవి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్న పోలీసులు.. ఆమె 15 రోజులపాటు ఆహారం తీసుకోకుండా.. కేవలం గంగా నది నీళ్లు తాగి బతికిందని తెలిసి ఆశ్చర్యపోయారు. ఆమె తినడానికి ఆహారం అందించిన పోలీసులు.. ఆ అర్వాత బక్సర్‌లోని ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

గంగా నదిలో దేవి కొట్టుకుపోయి అప్పటికే రెండు వారాలు దాటడంతో కుటుంబ సభ్యులు ఆమెపై ఆశలు వదిలేసుకున్నారు. అయితే దేవి బతికే ఉందని ఆమె సురక్షితంగానే ఉందని పోలీసులు సమాచారం ఇవ్వడంతో వారి ఆనందానికి హద్దే లేకుండా పోయింది. భర్త ఆమెను హత్తుకొని కంటతడి పెట్టాడు. దేవి ఇక తిరిగి రాదేమో అనుకున్నాం.. కానీ తను బతికే ఉంటుందని మనసులో ఏదో మూలన ఆశ ఉందని ఆయన చెప్పుకొచ్చాడు. కుటుంబ సభ్యులు సంతోషంతో ఆమెను ఇంటికి తీసుకెళ్లారు. 55 ఏళ్ల మహిళ.. గంగా నదిలో వరదలో 50 కిలో మీటర్లు కొట్టుకుపోయినా.. రెండు వారాలపాటు ఒంటరిగా ఓ గుడిసె ఉండాల్సి వచ్చినా.. ఆహారం లేకపోయినా.. వరద నీళ్లను తాగుతూ తన ప్రాణాలను కాపాడుకున్న తీరు నిజంగా అద్భుతం కదూ. బతకాలన్న సంకల్పం, దైవ భక్తి ఆమెను నడిపించాయి. గంగమ్మ ఆమెను లాక్కొని వెళ్తే.. శివుడి పట్ల ఉన్న అపార నమ్మకంతో ఆమె మరణం అంచుల్లో నుంచి తిరిగొచ్చింది.



**హైదరాబాద్‌లోనూ ఇలాంటి ఘటన..**

ఇలాంటి ఘటనే కొద్ది నెలల క్రితం హైదరాబాద్‌లోనూ చోటు చేసుకుంది. ఇందిర అనే 49 ఏళ్ల మహిళ మే 8వ తేదీ రాత్రి గోల్నాక వద్ద మూసీ నదిలోకి జారి పడిపోయింది. బయటకు వచ్చే అవకాశం లేకపోవడంతో రాత్రంతా చెట్ల కొమ్మలను పట్టుకొని ఉండిపోయింది. తెల్లవారాక స్థానికులు ఆమెను గుర్తించి కాపాడే ప్రయత్నం చేశారు. కానీ సాధ్యం కాకపోవడంతో హైడ్రాకు సమాచారం ఇచ్చారు. దీంతో నిమిషాల వ్యవధిలోనే అక్కడికి చేరుకున్న హైడ్రా సిబ్బంది నిచ్చెన సాయంతో ఆమెను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.

# యూపీఐ ఛార్జీలపై రగడ

యూపీఐ ఛార్జీలపై దుమారం రేగుతోంది. అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గే కేంద్ర ప్రభుత్వం డిజిటల్ లావాదేవీలపై ఎండీఆర్‌ను (మర్చంట్ డిస్కౌంట్ రేటు) ప్రవేశపెట్టిందని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇది ప్రజా వ్యతిరేక చర్యని, వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండు చేశాయి. ట్రంప్‌ను బుజ్జగించడానికి.. అమెరికా కంపెనీల జేబులు నింపడానికే ఎండీఆర్ పేరుతో ఛార్జీలను వసూలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ విమర్శించారు. అయితే ఈ విమర్శలను కేంద్ర ఆర్థిక శాఖ తోసిపుచ్చింది. ఈ విషయంలో ఎటువంటి విదేశీ ఒత్తిళ్లు లేవని, స్వతంత్రంగా తీసుకున్న నిర్ణయమని స్పష్టం చేసింది. ఎండీఆర్‌పై వెనక్కి తగ్గేది లేదని తేల్చి చెప్పింది.

ఎండీఆర్‌పై 18% వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వర్తిస్తుంది. ఈ పన్నును లావాదేవీ మొత్తంపై కాకుండా, కేవలం వ్యాపారి చెల్లించే ఎండీఆర్ రుసుముపైనే లెక్కిస్తారు. జీఎస్టీ పరిధిలో నమోదైన వ్యాపార సంస్థలకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) లభిస్తుంది. దానివల్ల జీఎస్టీ నమోదిత వర్తకులకు పన్ను భారం దాదాపు సున్నా అవుతుందని అధికారులు తెలిపారు. పన్ను మినహాయింపు పొందే వస్తువులను విక్రయించే చిన్న వర్తకులు ఈ రుసుమును భరించాల్సి ఉంటుందని వెల్లడించారు.

ఆర్థిక వ్యవహారాల స్టాండింగ్ కమిటీ సమావేశంలో కొందరు ప్రతిపక్ష ఎంపీలు ఈ ఛార్జీలను వ్యతిరేకించారని ఛైర్మన్ భర్తృహరి మెహతాబ్ తెలిపారు. బుధవారం నాటి సమావేశంలో యూపీఐ అంశం లేకపోయినా కొందరు ఎంపీలు ప్రస్తావించారని తెలిపారు. మరో నెలలో కొత్త కమిటీ ఏర్పడుతుందని, అప్పుడు ఈ అంశంపై చర్చిస్తారని ఆయన పేర్కొన్నారు.

**వినియోగదారులపై భారం పడదు: కేంద్రం**

యూపీఐ ద్వారా జరిపే చెల్లింపులకు ప్రజలు ఎటువంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ స్పష్టం చేసింది. "ఎండీఆర్ అనేది వ్యాపారుల చెల్లింపుల వ్యవస్థకు సంబంధించినది. అది వినియోగదారులపై భారం మోపదు. వ్యక్తులు అపరిమిత లావాదేవీలను ఉచితంగా నిర్వహించుకోవచ్చు. వారికి నెలవారీ కోటా లేదు'' అని వివరించింది. నెట్‌వర్క్ భద్రత, ఆధునిక సాంకేతిక మౌలిక వసతుల కల్పన, సైబర్ రక్షణ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు యూపీఐ వ్యవస్థను ఆర్థికంగా స్వయం సమృద్ధిగా మార్చే లక్ష్యంతోనే.. వాణిజ్య లావాదేవీలపైనే రుసుములు ఖరారు చేసినట్లు ఆర్థిక మంత్రిత్వశాఖ తెలిపింది.




ఎండీఆర్‌పై కాంగ్రెస్ ఫేక్ న్యూస్‌ను ప్రచారం చేస్తోందని, దానివల్ల వినియోగదారులపై ఎటువంటి భారం పడదని భాజపా స్పష్టం చేసింది.

# ఆస్తులు అమ్ముకున్నారు.. అనాథలకు నాన్నయ్యారు!



చెరకు తోటలో ఎవరో విసిరేసిన పసికందును చూసి చలించిపోయారు సంజీవ్ కుమార్ సిన్హా. ఆ పాపని గుండెలకు హత్తుకొని ఇంటికి తీసుకెళ్లారు. భార్య అనురితా కుమారితో కలిసి పాపను కంటికిరెప్పలా కాపాడారు. ఆకాంక్ష అని పేరు పెట్టారు. ఇప్పుడా చిన్నారి మూడో తరగతి చదువుతోంది. బిహార్‌లోని పరవల్పూర్ బ్లాక్ కార్యాలయంలో అంజు కుమారి అనే ఎనిమిదేళ్ల దివ్యాంగ బాలికను కన్నవాళ్లు వదిలేస్తే.. ఇంటికి తీసుకొచ్చి కూతురిలా పెంచి ఇంటర్ వరకు చదివించారు. పెళ్లికి రూ.3 లక్షలు ఖర్చు చేశారు. పక్కింటి బాలుడు అభిషేక్ చిన్నతనంలో తీవ్రమైన న్యుమోనియాతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్నప్పుడు కూడా సంజీవ్ కుటుంబం ఆదుకుంది. ఇలాంటి పనుల కోసం తమ పిల్లల కోసం దాచిన పొదుపు మొత్తాలను ఖర్చు చేయడమే కాకుండా రాజ్‌గిర్‌లోని సుమారు రూ.40 లక్షల విలువైన ఆస్తిని సైతం అమ్మేశారు సిన్హా. ఇంత చేసి కూడా ఉద్యోగ విరమణ తర్వాత వచ్చే డబ్బుతో అనాథాశ్రమం, వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలని సంజీవ్ భావిస్తున్నారు.

# అవయవాలు.. ప్రాప్తిరస్తు..!



ముంబయిలోని ప్రసిద్ధ లాల్‌బాగ్‌చా రాజా వినాయక మండపంలో ఏటా విభిన్న సామాజిక అంశాలతో ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈసారి గ్లెనెగల్స్ ఆసుపత్రి, లాల్‌బాగ్‌చా రాజా సార్వజనిక్ గణేశోత్సవ్ మండల్ సంయుక్తంగా ఆశల అవయవాలు (ఆర్గాన్స్ ఆఫ్ హోప్) అనే ఇతివృత్తంతో అవగాహన ప్రచారాన్ని చేపట్టాయి. మండపంలో సుమారు 30 అడుగుల ఫైబర్‌గ్లాస్ మానవ అవయవాల శిల్పాన్ని ఏర్పాటుచేశాయి. మరణానంతర అవయవదానంపై ప్రజల్లో అపోహలను తొలగించటమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు స్పష్టం చేశారు. ఈ భారీ ఫైబర్‌గ్లాస్ శిల్పానికి 'అతిపెద్ద మానవ అవయవాల ఫైబర్‌గ్లాస్ నిర్మాణం'గా గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లభించిందని తెలిపారు.

# మహువా మొయిత్రాపై కోడిగుడ్లతో దాడి



**సమరయోధురాలిలా ఎదుర్కొన్నానన్న ఎంపీ**

పశ్చిమబెంగాల్‌లోని నాదియా జిల్లాలో పోలీసుల సమక్షంలోనే భాజపా కార్యకర్తలు తనపై కోడిగుడ్లతో దాడిచేశారని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా ఆరోపించారు. బుధవారం తాను పాల్గొన్న కార్యక్రమం వద్దకు పదిమంది భాజపా కార్యకర్తలు వచ్చి గుడ్లు విసరడం మొదలుపెట్టారని తెలిపారు. తనపై ఇలాంటి దాడి జరగవచ్చని ఇటీవల సుప్రీంకోర్టులో ఆందోళన వ్యక్తంచేసినప్పుడు ధర్మాసనం చేసిన వ్యాఖ్యల్ని ప్రస్తావిస్తూ 'జస్టిస్ దీపాంకర్ దత్తా! మైలార్డ్.. నేనొక సమావేశం కోసం నా నియోజకవర్గానికి వచ్చాను. పోలీసులకు సమాచారం ఇచ్చాను. వాళ్ల సాయంతో భాజపా కార్యకర్తలు నాపై గుడ్లు విసిరారు. మీరు చెప్పిన సలహాను పాటించాను. స్వాతంత్ర్య సమరయోధులు తూటాలను ఎలా ఎదుర్కొన్నారో నేను ఈ గుడ్లను అలా భరించాను. పోలీసుల సమక్షంలోనే నాపై ఇలా గుడ్లు విసరడం కోర్టు ధిక్కరణ చర్య' అని ఎక్స్‌లో పోస్టు చేసిన వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఆ వీడియోలో ఆమె ముఖంపై గుడ్డు పెంకులు కనిపించాయి.

# దిల్లీలో పోలీసుల దమనకాండపై కమిటీని మార్చేది లేదు : సుప్రీం

దేశ రాజధానిలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసనలు చేపట్టినప్పుడు పోలీసులు దమనకాండ సాగించారన్న ఆరోపణలపై విచారణకు ఏర్పాటైన ఐదుగురు సభ్యుల ఉన్నతస్థాయి కమిటీలో మార్పులు చేసేది లేదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. కమిటీపై చేస్తున్న ఆరోపణలన్నీ ఊహాజనితమని, ముందే ఒక అభిప్రాయానికి వచ్చి.. వాటిని ఆపాదిస్తున్నారని వ్యాఖ్యానించింది. నిష్పాక్షికంగా, పారదర్శకంగా, న్యాయమైన రీతిలో అత్యుత్తమ ప్రమాణాలతో పనిచేసి.. విచారణలో తమకు సహకరించేందుకు కమిటీని ఏర్పాటు చేశామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనల ధర్మాసనం స్పష్టంచేసింది. ఇంకా విచారణ మొదలుపెట్టకముందే కమిటీపై ముద్ర వేయాలనుకుంటున్నారని, తామైతే ఎలాంటి మార్పు చేయడం లేదని ఈ నెల 10న ఇచ్చిన తీర్పులో తెలిపింది. దీనిని మంగళవారం ఆన్‌లైన్‌లో చేర్చారు. పెల్లెట్ గన్‌ల వాడకం, కొందరిని లక్ష్యంగా చేసుకుని హింసకు పాల్పడటం, విద్యార్థినుల్ని వేధించడం, ఇరువైపులా ఆస్తుల విధ్వంసం వంటి అంశాలపై కమిటీ తన విచారణను చేపట్టవచ్చని పచ్చజెండా చూపింది. సున్నితమైన సాక్షులకు తగిన రక్షణ కల్పించాలని, వారి వివరాలు బహిర్గతం చేయవద్దని తెలిపింది. పిటిషనర్లలో ఒకరి తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ విచారణను ఎదుర్కొనే అవకాశం ఉన్న ఒక ఉన్నతస్థాయి వ్యక్తికి కమిటీలో ఒకరు సన్నిహిత మిత్రుడని, అందువల్ల దానిని మార్చాలని కోరారు.




# జీడీపీ వృద్ధికి జీఎస్టీయే ప్రామాణికమా?

భారతదేశ ఆర్థిక వృద్ధిపై మరోసారి చర్చ మొదలైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో వాస్తవ స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) వృద్ధి 7.8 శాతంగా నమోదైంది. ప్రపంచంలోని ఇతర ప్రధాన ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే ఇది గణనీయమైన పురోగతే. అయితే, దేశంలోని వాస్తవ ఆర్థిక కార్యకలాపాలను ఈ వృద్ధిరేటు ప్రతిబింబిస్తోందా? లేదంటే జీడీపీ సిరీస్, ధరలు, గతేడాది గణాంక సవరణలు కలిసి దీన్ని ఎక్కువగా చూపిస్తున్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జీఎస్టీ వసూళ్లను ప్రమాణంగా తీసుకోవడంపైనా భిన్న వాదనలు వినిపిస్తున్నాయి.

గతనెల స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.1.99లక్షల కోట్లుగా నమోదయ్యాయి. నిరుడు ఆగస్టుతో పోలిస్తే ఇవి 14.8శాతం అధికం. ఈ ఏడాది ఏప్రిల్-ఆగస్టు కాలంలో మొత్తం జీఎస్టీ వసూళ్లు సుమారు రూ.10.43 లక్షల కోట్లు, అంటే దాదాపు 11శాతం వృద్ధి సాధించాయి. రిఫండ్లను మినహాయించిన నికర జీఎస్టీ వసూళ్లు కూడా ఆగస్టులో 8.3శాతం, ఏప్రిల్-ఆగస్టు మధ్య 9శాతం పెరిగాయి. ఈ గణాంకాలన్నీ ఆర్థిక వ్యవస్థలో పన్ను చెల్లింపులు, అధికారిక లావాదేవీలు, వ్యాపార కార్యకలాపాలు బలంగా ఉన్నాయని సూచిస్తున్నాయి. ఈ-వే బిల్లులూ ఇదే చెబుతున్నాయి. కేంద్ర ఆర్థికశాఖ మాజీ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ మాత్రం- ఆర్థిక వృద్ధిని 7.8శాతంగా నిర్ధారించడానికి జీఎస్టీ వృద్ధి రేటును చూపడం సరికాదంటున్నారు. గతంలో వసూలైన జీఎస్టీ పరిహార సెస్ ప్రస్తుతం కొనసాగడం లేదు. కాబట్టి, నిరుటి వసూళ్లలో ఉన్న ఆ మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుత జీఎస్టీ వృద్ధిరేటు అధికారికంగా ప్రకటించిన దానికంటే తక్కువగా ఉంటుందన్నది ఆయన అభిప్రాయం. ఆ ప్రకారమైతే, ఏప్రిల్-ఆగస్టు స్థూల జీఎస్టీ వసూళ్లలో వృద్ధి 11శాతం కాకుండా సుమారు 4.08 శాతానికి, నికర వృద్ధి 1.30శాతానికి పడిపోతుంది. ఆగస్టులో 14.8 శాతంగా ఉన్న అధికారిక వృద్ధి సుమారు 7.5శాతానికి తగ్గుతుంది. ఇక్కడ గార్గ్ లేవనెత్తిన అంశం పూర్తిగా విస్మరించదగినదేమీ కాదు. ఏ వృద్ధిరేటునైనా లెక్కించేటప్పుడు గత, ప్రస్తుత సంవత్సర గణాంకాలు ఒకే ప్రాతిపదికపై ఉండాలి. పన్ను వ్యవస్థలో మార్పు వచ్చినప్పుడు దాని ప్రభావాన్ని స్పష్టంగా చూపించాలి.

**కొట్టిపారేయాల్సిన పనిలేదు...**

ఎస్‌బీఐ గ్రూప్ చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ సౌమ్య కాంతి ఘోష్ మాత్రం పరిహార సెస్‌ను గతేడాది జీఎస్టీ బేస్‌లో కలపడం సరి కాదంటున్నారు. అది తాత్కాలిక పన్ను విధానంలో భాగమనీ, ఇప్పుడది కొనసాగడంలేదు గనుక... ప్రస్తుత జీఎస్టీ వ్యవస్థను అంచనా వేయాలంటే ప్రస్తుత సీజీఎస్టీ, ఎస్‌జీఎస్టీ, ఐజీఎస్టీలను గత ఏడాదితో పోల్చడమే సరైన విధానమన్నది ఘోష్ అభిప్రాయం. నిరుడు మేలో టెలికాం స్పెక్ట్రమ్ లావాదేవీకి సంబంధించిన సుమారు రూ.10వేల కోట్ల జీఎస్టీ చెల్లింపు జరిగింది. అటువంటి అసాధారణ సందర్భాలతో కూడిన అధిక బేస్‌తో ఈ ఏడాది మేను పోల్చడం వల్ల ప్రస్తుత వృద్ధిరేటు సహజంగానే తక్కువగా కనిపిస్తుందన్నది ఘోష్ వాదన.

జీఎస్టీ వసూళ్లు దండిగా ఉండటమన్నది ఆర్థిక కార్యకలాపాలు బలంగా ఉన్నాయనేందుకు ఒక సంకేతమే కానీ, జీడీపీ వృద్ధినైతే అది నిరూపించదు. జీఎస్టీ వసూళ్లపై పన్ను, దిగుమతులు, పన్నురేట్లలో మార్పులు, కొత్త రిజిస్ట్రేషన్లు, ద్రవ్యోల్బణం, ఆర్థిక కార్యకలాపాల నిర్మాణం వంటి అనేక అంశాలు కూడా కీలకమైనవే. నిజానికి మొదటి త్రైమాసికంలో నమోదైన 7.8శాతం జీడీపీ వృద్ధిని కొట్టిపారేయాల్సిన పనిలేదు; అలాగని దాన్ని కేవలం ఒక్క ఆధారంతోనే నిర్ధారించుకోవడమూ సరికాదు. కొత్త జీడీపీ సిరీస్‌లో 2022-23ను బేస్ ఇయర్‌గా తీసుకోవడం, మెరుగైన డేటాను ఉపయోగించడం, ధరల కొలతల్లో మార్పులు చేయడం వంటి కారణాలవల్ల లెక్కల్లో మార్పులు వచ్చాయని ప్రభుత్వం, గణాంక సంస్థలు చెబుతున్నాయి. గార్గ్ మాత్రం నిరుడు జీడీపీ స్థాయిలో వచ్చిన సవరణలు ప్రస్తుత వృద్ధిరేటును యాంత్రికంగా పెంచే అవకాశముందని అంటున్నారు. ఈ రెండు వాదనల్లోనూ ఉన్న ముఖ్యాంశం- 'జీడీపీ వృద్ధిరేటు వెనుకనున్న డేటా, ధరల సూచీ, ఉత్పత్తి అంచనాలు, బేస్ ఇయర్, రంగాలవారీ పనితీరు అన్నింటినీ పరిశీలించాలి' అని!

**అదొక్కటే గీటురాయి కాదు...**

ఏతావాతా దేశార్థికం 7.8శాతం వేగంతో వృద్ధి చెందుతోందని చెప్పాలంటే, జీఎస్టీతో పాటు మరికొన్ని సూచికలనూ పరిశీలించాలి. పారిశ్రామిక ఉత్పత్తి ఎలా ఉంది? తయారీ రంగం ఎంత వేగంగా విస్తరిస్తోంది? ప్రైవేటు పెట్టుబడులు పెరుగుతున్నాయా? ఉపాధి అవకాశాలు ఎలా ఉన్నాయి? వాస్తవ వేతనాలు పెరుగుతున్నాయా? కుటుంబాల వినియోగ వ్యయం బలంగానే ఉందా? ఎగుమతులు, ఉత్పాదకత ఎలా ఉన్నాయి? బ్యాంకు రుణాలు, వాహన విక్రయాలు, విద్యుత్ వినియోగం వంటి సూచికలు ఏం చెబుతున్నాయి? అనే ప్రశ్నలు కూడా ముఖ్యమైనవే. వీటికి సానుకూల సమాధానాలు లభిస్తే 7.8శాతం జీడీపీ వృద్ధిపై విశ్వాసం మరింత పెరుగుతుంది. గార్గ్ లేవనెత్తిన అంశాలు గణాంకాల పారదర్శకతకు ఉపయోగపడతాయి. ఘోష్ ప్రస్తావించిన పన్ను వ్యవస్థ మార్పు, బేస్ ప్రభావాలు సైతం గమనార్హమైనవే. భారతదేశ జీడీపీ వృద్ధి ఎంత బలంగా ఉందో నిర్ణయించడానికి జీఎస్టీ ఒక్కటే తుది ప్రమాణం కాదు. వాస్తవ వృద్ధిని అనేక త్రైమాసికాల్లోని ఉత్పత్తి, పెట్టుబడి, ఎగుమతులు, ఉపాధి, వేతనాలు, వినియోగం తదితర సూచికల ద్వారా నిర్ధారించాల్సి ఉంది. ఏదిఏమైనా దేశార్థిక వ్యవస్థ చైతన్యవంతంగా ఉందని జీఎస్టీ వసూళ్లు నిరూపిస్తున్నాయి. అయితే, జీడీపీ గణాంకాలపై విశ్వాసం మరింత పెరగాలంటే- అధికారిక జీఎస్టీ వృద్ధి లెక్కలతో పాటు సవరణలు, రిఫండ్ల తరవాత నికర వృద్ధి ఎంతనేది కూడా ప్రభుత్వం వెల్లడించాల్సి ఉంది.




# ఇజ్రాయెల్ చరిత్ర... హిందూత్వ మూలాలు!

నేడు 'హిందుత్వ'గా పిలుస్తున్న భావజాలానికి మూలాలు నిజానికి ఆధునిక పరిణామాల్లోనే ఉన్నాయి. బ్రిటిష్ వలస పాలనలోకి మారిన భారత ఉపఖండ చరిత్ర, సంస్కృతులు పాశ్చాత్య వలసవాదం వల్ల తీవ్రంగా ప్రభావితమయ్యాయి. పాశ్చాత్య సామ్రాజ్యవాద చరిత్రలో ఇజ్రాయెల్ ఏర్పాటు అత్యంత కీలకమైన ఘట్టం. మొదట బ్రిటిష్‌వారు, ఆ తర్వాత అమెరికా అండదండలతోనే ఇజ్రాయెల్ రూపుదిద్దుకుంది.ఇజ్రాయెల్ ఆవిర్భావం గురించి చర్చలు, సంవాదాలు భారత ఉపఖండంలోనూ విస్తృతంగా జరిగాయి. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ వంటి జాతీయవాదులు... మొదటి నుంచీ ఒక భూభాగంలో నివసిస్తున్న స్థానిక ప్రజలను నిర్వాసితులను చేస్తూ ప్రత్యేక ఇజ్రాయెల్ ఏర్పడటాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. 1938 నవంబరు 26న గాంధీజీ 'హరిజన్' పత్రికలో 'The Jews' పేరుతో రాసిన వ్యాసంలో నాజీల హింస పట్ల సానుభూతి చూపుతూనే, సైనిక బలంతో పాలస్తీనాను ఆక్రమించడాన్ని ఖండించారు. నాజీల నియంతృత్వానికి ఎదురొడ్డి జర్మన్ యూదులు అహింసాత్మక సత్యాగ్రహం చేపట్టాలని, తద్వారా నాజీల మనసు మార్చవచ్చని గాంధీ సలహా ఇచ్చారు. అయితే గాంధీ వైఖరిని యూదు మేధావులు తీవ్రంగా విమర్శించారు. యూదులు తమ మనుగడ కోసం 'పాత నిబంధన'లోని భౌగోళిక–రాజకీయ ఆక్రమణ సూత్రాలను ఆశ్రయిస్తుంటే, గాంధీజీ మాత్రం వాటిని కొత్త నిబంధనలోని శాంతియుత క్రైస్తవ/అహింసా మార్గంలో



పరిష్కరించుకొమ్మని కోరారు. భవిష్యత్తులో నాజీల వల్ల పీడితులైన యూదులు నాజీలలాగే మారే ప్రమాదాన్ని గుర్తించి ముందుగానే గాంధీ హెచ్చరించారు.

మార్టిన్ బూబర్, హయీమ్ గ్రీన్‌బర్గ్, హెన్రీ పోలక్, హెర్మాన్ కల్లెన్‌బాక్ వంటి యూదు మేధావులు గాంధీజీ అహింసా వాదాన్ని విమర్శించారు. నాజీలు వ్యవస్థీకృతంగా ఒక జాతి నిర్మూలనకు పాల్పడుతున్నప్పుడు అహింసాత్మక నిరసనలు, ఆత్మబలిదానాలు పనిచేయవని, హిట్లర్ లాంటి క్రూరుడికి మనస్సాక్షి ఉండదని మార్టిన్ బూబర్ అన్నారు. అలాగే, ఐరోపాలో తమ 'గెట్టో' స్థితిని భారతదేశపు అస్పృశ్యతతో పోలుస్తూ, దళితుల ఆత్మగౌరవ పోరాటాన్ని గుర్తించిన గాంధీ, యూదుల స్వయం నిర్ణయాధికారాన్ని, పురాతన పితృభూమిపై ఉన్న దైవిక–చారిత్రక హక్కును నిరాకరించడాన్ని గ్రీన్‌బర్గ్ ప్రశ్నించారు. గాంధీజీ భారతీయ హిందూ–ముస్లిం ఐక్యత అనే స్వప్రయోజనం కోసమే జియోనిజాన్ని వ్యతిరేకించారని హెన్రీ పోలక్ విశ్లేషించారు. ఈ సందర్భంలో గాంధీ చేసే అహింసాత్మక వ్యాఖ్యానానికి భిన్నంగా, భగవద్గీత లాంటి హిందూ గ్రంథాలు కూడా హింసను సమర్థిస్తాయి అని యూదు మేధావులు కూడా వాదించడం విశేషం. ఇది నేటి హిందూవాదులు చేసే 'ధర్మహింసా తథైవచ' అనే వాదానికి సరిపోలుతుంది.

ప్రసిద్ధ శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ కూడా ఇజ్రాయెల్ ఆవిర్భావానికి మద్దతు ఇవ్వాలని నెహ్రూను కోరారు. రాజ్యాంగంలో అస్పృశ్యతను నిషేధిస్తున్న భారత ప్రభుత్వం, ఐరోపాలో తీవ్ర వివక్షకు గురవుతున్న యూదులకు ఒక ప్రత్యేక దేశం ఏర్పాటు చేయడంలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అయితే నెహ్రూ కానీ, భారత ప్రభుత్వం కానీ దానికి సుముఖంగా లేవు. మధ్యప్రాచ్యంలో ఇటువంటి దేశ ఏర్పాటు అక్కడ నివసిస్తున్న అరబ్బుల ప్రాథమిక హక్కులకు ముప్పుగా పరిణమిస్తుందని నెహ్రూ స్పష్టం చేశారు. మరొకవైపు, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ 'జ్యూయిష్ అడ్వకేట్' అనే పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇజ్రాయెల్ ఏర్పాటును సమర్థించారు. ఆయన సంకలిత రచనలలో ఐరోపాలోని యూదుల 'గెట్టో' స్థితిగతులు, మోజెస్ నాయకత్వంలో.. పీడితులైన యూదులు 'వాగ్దానం చేసిన భూమి'ని చేరుకోవడం వంటి అంశాలను దళితుల విముక్తి పోరాట పోలికలుగా ప్రస్తావించారు. ఇటీవల ఇజ్రాయెల్ దురాక్రమణను దళిత మేధావులు, క్రైస్తవ దళితులు సమర్థించారు. ఈ వైఖరికి పాశ్చాత్య వలసవాద ప్రభావాలు కారణం.

అయితే, వినాయక్ దామోదర్ సావర్కర్ ఇజ్రాయెల్‌ను, యూదు జాతీయవాదాన్ని హిందూత్వతో నేరుగా ముడిపెట్టారు. 1923లో రాసిన గ్రంథంలో సావర్కర్: ''యూదులకు పాలస్తీనా, ముస్లింలకు అరేబియా లాగే... హిందువులకు భరతఖండం పితృభూమి, పుణ్యభూమి'' అని రాశారు. యూదులు పాలస్తీనాపై చూపిన హక్కును, హిందూవాదులు భరతఖండాన్ని తమ సాంస్కృతిక -రాజకీయ భూమిగా క్లెయిమ్ చేసుకోవడానికి నమూనాగా ఉపయోగించారు. 1948లో ఇజ్రాయెల్ ఏర్పడినప్పుడు సావర్కర్ తక్షణ దౌత్య గుర్తింపు ఇవ్వాలని కోరారు. 1954లో 'కేసరి' పత్రికలో- శత్రు దేశాల నడుమ ఉన్నప్పటికీ స్వయం రక్షణ, సైనిక శిక్షణలో ఇజ్రాయెల్ చూపిన ధైర్యాన్ని భారతదేశం ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

ఆరెస్సెస్ అధికారిక వారపత్రిక 'ఆర్గనైజర్' దశాబ్దాలుగా ఇజ్రాయెల్ విదేశాంగ విధానాన్ని సమర్థిస్తూ వ్యాసాలు ప్రచురించింది. 'పితృభూమి', 'పుణ్యభూమి' సూత్రాలతో ఇజ్రాయెల్ దేశభక్తిని పెంపొందించుకున్నట్లే, భారతదేశం కూడా హిందూ రాష్ట్ర భావన ద్వారా సైనిక, సాంస్కృతిక బలాన్ని పునర్నిర్మించుకోవాలని వాదించింది. డా. సుబ్రహ్మణ్యస్వామి వంటి నాయకులు కూడా ఇరు దేశాల మధ్య బలమైన సైనిక, నిఘా కూటమి ఏర్పడాలని పదే పదే ప్రతిపాదించారు. ఒకప్పుడు నాజీయిజాన్ని సమర్థించిన హిందూవాదులు తర్వాత యూదు ఆధిపత్యాన్ని కూడా సమర్థించారు. ఈ విరుద్ధ దృక్పథాలలో ఉన్న సారూప్యత ఒక్కటే- అది నియంతృత్వం పట్ల ఆరాధనా భావం.

పాశ్చాత్య నమూనాకు 'హిందూత్వ' ప్రతిబింబం మాత్రమే అనేందుకు వీలుగా, ఇజ్రాయెల్‌కు, ఆధునిక హిందూత్వానికి సైద్ధాంతికంగా స్పష్టమైన పోలికలు కనిపిస్తాయి: 1) ఇజ్రాయెల్ యూదులకు దేవుడు వాగ్దానం చేసిన భూమి; భరతఖండం హిందువులకు పితృభూమి/ పుణ్యభూమి. 2) యూదులకు/ పాశ్చాత్యులకు, భారతీయ హిందూత్వవాదులకు ఉమ్మడి శత్రు రూపకల్పన జరగడం. వారే ముస్లింలు. 3) అలాగే జరూసలేంలో సలోమాన్ దేవాలయాన్ని అబ్దుల్ మాలిక్, ముస్లింలు ధ్వంసం చేయడం, తిరిగి ఆలయ నిర్మాణం డిమాండు- బాబర్ రామాలయ విధ్వంస వివాదం, రామాలయం. 4) అఖండ ఇజ్రాయెల్- అఖండ భారత్. బైబిల్ 'పాత నిబంధన'లోని 'దేశం-రక్తం-భూమి' కేంద్రక భావనలతోను, పాశ్చాత్య జాతీయవాద నమూనాలతోను హిందూత్వానికి ఎక్కువ దగ్గరి పోలికలు ఉన్నాయి.

# ఎన్నో నామాలు... ఎన్నెన్నో మర్మాలు!

'గణం' అంటే- బృందం. సమూహం. మొత్తం దేవగణాలకు అధినేత- గణపతి! ఆ ఆధిపత్యాన్ని ఆయన బుద్ధిబలంతో సాధించుకున్నాడు. నెమలి వాహనం మీద రివ్వున ఎగిరి ముల్లోకాలను చుట్టివచ్చిన కుమారస్వామిని- అదే పోటీలో ఓడించాడంటుంది వినాయక వ్రత కథ. 'ఎలుక గుర్రము మీద నీరేడు భువనాలు పరుగెత్తి వచ్చిన పందెకాడు' అన్న కరుణశ్రీ వర్ణనలోని లోగుట్టు అదే! (జీవిత)చదరంగంలో పావులను పడగొట్టాల్సింది- బుద్ధిబలంతోనేకానీ, భుజబలంతో కాదన్నది ఈ కథలో పాఠం! అమ్మానాన్నల చుట్టూ భక్తితో ప్రదక్షిణం చేస్తే ముల్లోకాలనూ (త్రిగుణాలనూ) జయించగలమన్నది- అందులో సూచన. నారములంటే నీళ్లు. నారములయందుండేవాడు నారాయణుడు. నారాయణ నామం జపిస్తూ ప్రదక్షిణాలు చేశాడు కాబట్టే- స్నానంకోసం కుమారస్వామి ఏ నదికి పోయినా వినాయకుడు ఆయనకు ఎదురొచ్చాడు. ఉపద్రవాలో, ఉత్పాతాలో ఎదురైనప్పుడు ఉపాయాలు వెతకాలే తప్ప- బెంబేలు పడరాదన్నది ఇందులోని నీతి. అలాగే, మంత్రశాస్త్రంలోని మొత్తం 32 గణపతుల విభిన్న రూపురేఖలు, గణేశ పురాణంలోని 92 అధ్యాయాల ఉపాసనాఖండం, 155 అధ్యాయాల క్రీడాఖండాలు చెబుతున్నదల్లా- అంతరార్థాలను, తత్త్వాన్ని గుర్తించమనే!

అమ్మ పసుపుబొమ్మను చేసింది. అయ్య ఏనుగు తలను పెట్టాడు. 'తొండమును ఏకదంతమును తోరపుబొజ్జ'తో కనపడే ఆ గజముఖుడే పురాణగణపతి. 'త్వం మూలాధార స్థితోసి నిత్యమ్' అంటూ అధర్వశీర్షం కీర్తించింది వేదగణపతిని! ఆయన గజముఖుడు కాదు. 'కవిం కవీనాం ఉపమశ్రవ స్తవం...' అంటూ గణపతిని 'విద్యాధిదేవత'గా స్తుతించింది వేదం. రుద్రుడి దగ్గరుండే హేరంబగణపతిని 'విశిష్ట మంత్రమూర్తి' అన్నాయి మంత్రశాస్త్రాలు. 'త్రికోణ మధ్యగతుడు' అంటాయి తంత్రశాస్త్రాలు. సృష్టిలో ప్రతిదానికీ పుట్టుక, మనుగడ, మరణం సర్వసహజం. ఆ మూడూ ఉన్నదాన్ని 'జగత్తు' అనీ, లేనిదాన్ని 'బ్రహ్మము' అనీ చెబుతాయి ఉపనిషత్తులు. ఓంకారం పరబ్రహ్మస్వరూపం. గణపతిని ఓంకారాత్మకుడిగా సంభావించారు శంకర భగవత్పాదులు. 'వాతాపి గణపతిం భజే' ప్రసిద్ధకృతిలో 'ప్రణవ స్వరూప వక్రతుండం' అని ముత్తుస్వామి దీక్షితర్ చెప్పిన ప్రణవమంటే ఓంకారమే! కాబట్టి వినాయకుడు 'శబ్ద బ్రహ్మస్వరూపుడు' అనేది పెద్దల తీర్మానం. గణపతి తత్త్వాన్ని అర్థం చేసుకోవాలనుకుంటే ఈ భేదాలను జాగ్రత్తగా అధ్యయనం చేయాలి. పరబ్రహ్మతత్త్వాన్ని పట్టుకోవడమే గణపతి ఆరాధనల పరమ లక్ష్యం!

లోకకల్యాణం కోసం అవతారాలను, స్త్రీరూపాలను ధరించడం దేవుళ్లకు ఆనవాయితీ. వినాయకి, గజానని, విఘ్నేశ్వరి, గణేశ్వరి, ప్రజాదేవి... వంటివి వినాయకుడి స్త్రీరూపాలు. సప్తమాతృకల గురించి తెలిసిందే. తోడుగా మహాలక్ష్మిని ఎనిమిదిగా, 'వినాయకి'ని తొమ్మిదో మాతృకగా ఆరాధించడం ఆచారం. విఘ్ననాయకుని శక్తిరూపమే 'వినాయకి' అంటుంది దేవీపురాణం. ఆమెనే 'ప్రజాదేవి'గా పిలిచింది ముద్గలపురాణం. కాశీని రక్షించేందుకు శివుడు నియమించిన శక్తుల్లో విఘ్నేశ్వరి ఒకరని స్కాందపురాణం చెబుతోంది. తమిళనాడులోని మధురమీనాక్షి ఆలయంలో ఆమెను దర్శించవచ్చు. శుచీంద్రంలో పూజలందుకొనేది 'గణేశ్వరి'. మనుచరిత్రలో పెద్దన 'అంకము చేరి శైలతనయా స్తనదుగ్ధములు ఆనువేళ' పద్యంలో ఇమిడ్చిన అర్ధనారీశ్వర తత్త్వం అర్థమైతే దానిలోంచే ఆవిర్భవించిన గణపతికి చెందిన స్త్రీతత్త్వం కూడా తేలిగ్గా బోధపడుతుంది. గాజులు, నగలు, వంకీలు, వడ్డాణాలూ... విడివిడిగా ఉన్నప్పుడే ఆ పేర్లు. అన్నింటినీ కలిపి కరిగించేస్తే, అది బంగారపు ముద్ద! విడిగా పూజించేందుకే వినాయకుడికి ఆ పేర్లు. అవన్నీ కలిసిపోతే, ఆ ముద్ద గణేశతత్త్వం! 'శివశివమూరితివి' అంటే వేదగణపతి. 'శివుని కుమారుడవు' అన్నప్పుడు పురాణగణపతి! వడ్లగింజలో బియ్యపు గింజ! చదవాల్సింది వ్రతకథను. చూడాల్సింది దేవుణ్ని. చేదుకోవాల్సింది ఆ లోపలి తత్త్వాన్ని!

# ఆగని యుద్ధం... తీరని నష్టం!

మహోద్ధృతంగా వినిపిస్తున్న యుద్ధభేరీ నాదాల నడుమ పేదసాదల ఆకలి కేకలు అరణ్య రోదనమవుతున్నాయి. పశ్చిమాసియాలో రాజుకున్న ప్రాంతీయ ఉద్రిక్తతలు అంతర్జాతీయ సంక్షోభ జ్వాలలై దేశదేశాల సౌభాగ్యాన్ని హరిస్తున్నాయి. కొవిడ్ కవుకుదెబ్బల నుంచి ప్రపంచం కోలుకుంటున్న దశలో పులి మీద పుట్రలా ఉక్రెయిన్ యుద్ధం దాపురించింది. అమెరికా, ఇజ్రాయెల్ ఏకమై ఇరాన్‌పై దండెత్తడం నష్టతీవ్రతను ఇంకా పెంచేసింది. ఈ యుద్ధం మూలంగా 2026లో ప్రపంచార్థిక వృద్ధిరేటు 2.6శాతానికి పరిమితమవుతుందని, ద్రవ్యోల్బణం 4శాతానికి పెరుగుతుందని వరల్డ్ బ్యాంక్ ఇటీవల అంచనా వేసింది. ఇంధన సరఫరాల్లో అవాంతరాలు అధికమైతే వృద్ధిరేటు 1.3శాతానికి పడిపోతుందనీ, ధరోల్బణం 4.4శాతానికి చేరుతుందనీ ఆ సంస్థ హెచ్చరించింది. ఆయిల్ ధరలు అదుపు తప్పితే ద్రవ్యోల్బణం 5.4శాతానికి పెరగవచ్చునని ఐఎంఎఫ్ లెక్కగట్టింది. సౌదీపై హూతీల ఎడతెగని దాడుల కారణంగా హర్మూజ్ జలసంధికి ప్రత్యామ్నాయ మార్గాల్లోనూ ప్రస్తుతం చమురు రవాణాకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌లు ఊహించిన ప్రమాదాలను అవి కళ్లముందు నిలుపుతున్నాయి!

ఇరాన్‌పై కయ్యానికి కాలుదువ్వినప్పటి నుంచి మొన్న జులై వరకు అమెరికా దాదాపు 3750కోట్ల డాలర్లు ఖర్చు చేయాల్సి వచ్చింది. తమకు అదో పెద్ద లెక్క కానేకాదంటూ కొద్దిరోజుల క్రితం డంబాలు



పలికిన డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై దండయాత్ర అనేది అసలు యుద్ధమే కాదన్నట్లు మాట్లాడటం అందరినీ విస్మయపరచింది. అమెరికా యుద్ధోన్మాదానికి బదులు చెప్పడానికంటూ హర్మూజ్ జలసంధిని భౌగోళిక ఆయుధంగా మార్చుకున్న ఇరాన్ అగ్రరాజ్య సైనిక స్థావరాలకు ఆతిథ్యమిస్తున్న ఇరుగుపొరుగు గల్ఫ్ దేశాలను లక్ష్యంగా చేసుకుంటోంది. అదే సమయంలో తాము సౌదీపై యుద్ధం చేయట్లేదని, హూతీలకు వాళ్ల ఆశయాలేవో వాళ్లకు ఉన్నాయని నమ్మబలుకుతోంది. మూడున్నర లక్షలకు పైగా ప్రాణాలను బలితీసుకుని, 45లక్షల మందిని శరణార్థులుగా మార్చిన యెమెన్ అంతర్యుద్ధంలో రియాద్ జోక్యంపై హూతీలు మండిపడుతున్న మాట వాస్తవమే. వాళ్లపై చేసిన దాడుల్లో సౌదీ ఇంతవరకు నెగ్గుకురాలేని సంగతీ నిజమే. కానీ, టెహ్రాన్ దన్నుతోనే బలం పెంచుకున్న హూతీలు అన్ని నిర్ణయాలూ తమకుతామే తీసుకుంటారనుకుంటే పొరపాటే!

ఎర్రసముద్ర తీరంలోని యాన్బు రేవుకు చమురును పైప్‌లైన్‌లో తరలించి, అక్కడి నుంచి బాబ్‌ఎల్ మండేబ్ జలసంధి ద్వారా విదేశాలకు రవాణా చేయడానికి సౌదీ లోగడే ఏర్పాట్లు చేసుకుంది. హర్మూజ్‌లో నౌకల రాకపోకలు స్తంభించిన దరిమిలా కొద్ది నెలలుగా రోజుకు 4050లక్షల బ్యారెళ్ల చమురును సౌదీ ఇలాగే ఇండియాతో పాటు పలు దేశాలకు బట్వాడా చేస్తోంది. దాడుల మూలంగా ప్రస్తుతం ఆ పైప్‌లైన్ మూతపడింది. బాబ్‌ఎల్ మండేబ్‌పై హూతీలు పూర్తిగా పట్టుబిగిస్తే అంతర్జాతీయ సరకు రవాణాకు కీలకమైన మరో సముద్ర మార్గం పరోక్షంగా ఇరాన్ చెప్పుచేతల్లోకి వెళ్లిపోతుంది. మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సౌదీ తరఫున నేరుగా రంగంలోకి దిగి, హూతీలను నిలువరించడానికి ట్రంప్ అంగీకరించట్లేదు. రియాద్‌తో మక్కా రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నప్పటికీ టెహ్రాన్‌తో సమస్యలు ఎదురవుతాయనే భయంతో ఇస్లామాబాద్ సైతం సైనిక జోక్యానికి ఇష్టపడట్లేదు. ఇలా ఎవరికి వారు స్వీయ ప్రయోజనాలే పరమావధిగా పావులు కదుపుతుండటంతో గల్ఫ్ నుంచి చమురు రవాణా సందిగ్ధంలో పడుతోంది. అది ధరల మోతకు దారితీస్తోంది. పరిస్థితులు ఇంకా దిగజారిపోకూడదంటే పరస్పరం కత్తులు దూసుకుంటున్న దేశాలు తక్షణం శాంతి చర్చలకు కూర్చోవాలి. కానీ, అవి అంతటి విజ్ఞత కనబరుస్తాయా అన్నదే ప్రశ్నార్థకం!

అనంత
జనశక్తి
జనం కోసమే మా అక్షరం
శుక్రవారం ⁞ అనంతపురం ⁞ 18.09.2026 ⁞ 01



# అయోధ్యకు 200 మంది యాత్ర

**ధర్మవరం సెప్టెంబర్ 17 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణంలోని 13వ వార్డు యాదవ వీధికి చెందిన సుమారు 200 మంది భక్తులు గురువారం కాశీ-అయోధ్య యాత్రకు బయలుదేరారు. జనసేన పార్టీ నాయకుడు రాజు ఆధ్వర్యంలో 'అయోధ్య ఉచిత సేవా యాత్ర' పేరుతో ఈ యాత్రను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా భక్తులు కాశీ, అయోధ్యలోని పుణ్యక్షేత్రాలను దర్శించుకోనున్నారు. ఈ సందర్భంగా ధర్మవరం రైల్వే స్టేషన్‌లో బీజేపీ నేత హరీష్ బాబు యాత్రికులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. భక్తిశ్రద్ధలతో పుణ్యక్షేత్రాలను దర్శించుకుని, యాత్రను విజయవంతంగా పూర్తి చేసి క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రయాణంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# వైసీపీ నాయకులు ఎన్ని విమర్శలు చేసినా బెదిరేది లేదు..

- పది రెట్లు ఎక్కువ పనిచేస్తా: మంత్రి నారాయణ
- నెల్లూరులో ఏ అభివృద్ధి పని చేసినా వైసీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా కామెంట్లు చేస్తున్నారు: మంత్రి నారాయణ
- నన్ను డీమోరల్ చేయడం ఎవరి తరం కాదు..
- విమర్శలు చేయడం కాదు.. చేతనైతే అభివృద్ధి చేసి చూపించండి
- నెల్లూరులో వక్ఫ్ బోర్డు స్థలంలో నిర్మిస్తున్న 'అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్' పనులను పరిశీలించిన మంత్రి నారాయణ
- నెల్లూరులో పేద పిల్లల కోసం 17 ప్రభుత్వ పాఠశాలలను ఇంటర్నేషనల్ స్థాయిలో ఆధునీకరిస్తున్నాం: మంత్రి నారాయణ
- జూన్ 12 నాటికి అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ అందుబాటులోకి వస్తుంది



**నెల్లూరు సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**

నెల్లూరు నగరంలో విపక్ష వైసీపీ నాయకులు తమపై ఎంతగా అనవసర విమర్శలు చేసినా, అభివృద్ధి పనులను అడ్డుకుంటూ తమను డీమోరల్ చేయడానికి ఎంత ప్రయత్నించినా భయపడేది లేదని, వారి విమర్శలకు పది రెట్లు ఎక్కువ పనిచేసి ప్రజలకు మరింత సేవ చేస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఘాటుగా హెచ్చరించారు. నెల్లూరు పరమేశ్వర నగర్ లోని వక్ఫ్ బోర్డ్‌కు చెందిన 5.5 ఎకరాల స్థలంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ స్థాయి అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తమ ప్రభుత్వం చేపడుతున్న మంచి పనులపై కూడా వైసీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేయడం శోచనీయమన్నారు.గతంలో తాము మోడల్‌గా అభివృద్ధి చేసిన విఆర్ హైస్కూల్ గురించి రాష్ట్రంలోనే కాకుండా అమెరికా, రష్యా, సింగపూర్ వంటి దేశాల్లో ఉన్న తెలుగు వారందరూ ఎంతో గొప్పగా ప్రశంసించారని గుర్తుచేశారు. కానీ ఇక్కడి లోకల్ వైసీపీ నాయకులు మాత్రం ప్రతి విషయాన్నీ రాజకీయం చేస్తూ కామెంట్లు చేస్తున్నారని, విపక్షాల విమర్శలను ఏమాత్రం పట్టించుకోకుండా, నగరంలోని పేద విద్యార్థులందరికీ అంతర్జాతీయ స్థాయి నాణ్యమైన విద్యను ఉచితంగా అందించడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నామని వెల్లడించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆశయాలకు అనుగుణంగా నగరంలో గతంలో అనుకున్న 15 పాఠశాలలతో పాటు మరో 2 ప్రైమరీ స్కూళ్లను చేర్చి మొత్తం 17 ప్రభుత్వ పాఠశాలలను ఇంటర్నేషనల్ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఎంపీ సీఎం రమేష్ బ్రదర్స్ కంపెనీ సీఎస్ఆర్ సహాయంతో వేగంగా రూపుదిద్దుకుంటున్న ఈ అబ్దుల్ కలాం స్కూల్‌ను రాబోయే జూన్ 12న స్కూళ్లు పునఃప్రారంభమయ్యే నాటికి అందుబాటులోకి తెస్తామని, ఇందులో విద్యార్థుల కోసమే కాకుండా పాఠశాల వేళల తర్వాత స్థానిక ప్రజల వినియోగానికి ఉపయోగపడేలా అన్ని రకాల క్రీడా సౌకర్యాలతో కూడిన స్పోర్ట్స్ కాంప్లెక్స్ తో పాటు ప్రత్యేకంగా స్విమ్మింగ్ పూల్ కూడా నిర్మాణం చేస్తున్నామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు... ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ కుమార్ యాదవ్, వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి,నాయకులు ఇంతియాజ్, మైనుద్దీన్, కాలేష,హాజీ,జమీర్ స్థానిక టిడిపి ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పుట్టపర్తి కలెక్టరేట్‌లో ఘనంగా భగవాన్ విశ్వకర్మ జయంతి



– జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

**పుట్టపర్తి,సెప్టెంబర్,17:అనంత జనశక్తి న్యూస్**

శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్ లో భగవాన్ విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ భగవాన్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... భగవాన్ విశ్వకర్మ విశ్వానికి మొదటి ఆర్కిటెక్ట్ అని, దేవతలకు అవసరమైన దివ్య ఆయుధాలను సమకూర్చిన మహనీయుడని కొనియాడారు. నేటి ఆర్కిటెక్ట్ లు, చేతివృత్తుల వారందరికీ ఆయన ఆదర్శమూర్తి అని పేర్కొన్నారు. 'పీఎం విశ్వకర్మ' పథకానికి సంబంధించి అర్హులైన వారు సరైన విధానంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లోపాలు ఏవైనా ఉంటే సరిచేసి లబ్ధి చేకూరేలా చూసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.కంసాలి తదితర విశ్వకర్మ వృత్తుల వారు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విశేష సేవలందిస్తూ సమాజానికి వెన్నెముకగా నిలుస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వ పథకాల్లోని దరఖాస్తు ప్రక్రియపై అవగాహన పెంచుకుని, అర్హులందరూ లబ్ధి పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ ,బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజేంద్ర కుమార్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ హరికృష్ణ,స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ పర్వీన్ భాను,శ్రీ కాళహస్తి దేవస్థానం బోర్డు మెంబర్ శ్రీనివాసులువివిధ వర్గాల కమ్యూనిటీ నాయకులు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు

- విశ్వకర్మ విశ్వాన్ని సృష్టించిన దేశ శిల్పిగా ప్రసిద్ధి....
- విశ్వకర్మను ఆదర్శంగా తీసుకోవాలి...
- జిల్లా రెవెన్యూ అధికారి
- ఎ. మాలోల

**అనంతపురం ,సెప్టెంబర్17:అనంత జనశక్తి న్యూస్**

విశ్వకర్మ విశ్వాన్ని సృష్టించిన దేశ శిల్పిగా ప్రసిద్ధి అని, రకరకాల వృత్తులకు ఆద్యుడై నా దైవిక వాస్తు శిల్పి విశ్వకర్మను ఆదర్శంగా తీసుకొని చేతి, కులవృత్తుల వారు తమలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎ .మాలోల తెలిపారు.గురువారం ఉదయం ప్రపంచ తొలి వాస్తు శిల్పి సృష్టికర్తగా పేరొందిన శ్రీ విరాట్ విశ్వకర్మ భగవానుని జయంతి వేడుకలు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జయంతి వేడుకలు స్థానిక అనంతపురం నగరం గుత్తి రోడ్డు లోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఆర్ఓ మాలోల , జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఇన్చార్జ్ అధికారి గంగాధర్, బీసీ కార్పొరేషన్ ఈ.డీ. సుబ్రహ్మణ్యం,విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంగాచారి, ప్రముఖ న్యాయవాది గురు ప్రసాద్ ఆలయ చైర్మన్ మౌళి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా తొలుత జ్యోతి ప్రజలను చేసి విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథులు ప్రజలందరికీ విశ్వకర్మ జయంతి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డిఆర్ఓ మాలోల మాట్లాడుతూ దేవ శిల్పి అయిన విశ్వకర్మ ఎంతో గొప్ప సెల్ఫీ అని సకల సృష్టికి మూల కారణమైన దేవశిల్పి మరియు శిల్పశాస్త్ర ఇంజనీరింగ్ నిర్మాణ రంగాలకు విశ్వకర్మ ప్రేరణ అవుతున్నట్లు పేర్కొన్నారు.విశ్వకర్మ భగవానుని జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకబడిన తరగతుల సంక్షేమ అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్న నేపథ్యంలో వాటిని చేసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా తెలుగుజాతి సంస్కృతిలో విశ్వకర్మ కు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. వేద, పురాణ, శిల్పశాస్త్ర ,గ్రంధాలలో విశ్వకర్మ ఉల్లేఖనాలు ఆయన యొక్క విశ్వ జననీ ప్రాధాన్యతను చాటి చెబుతున్నట్లు పేర్కొన్నారు. విశ్వకర్మ చేసిన పనులు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయి అన్నారు.దేవతల మందిరాలు యజ్ఞ వేదికలు వ్రతాలు మండపాల నిర్మాణాలు లాంటి అనేక పనులు చేసి విశ్వకర్మ భావితరాలకు ఆదర్శంగా నిలిచారని సాంకేతిక పరిజ్ఞానం శిల్పకళ వృత్తిపరమైన నైపుణ్యాలకు విశ్వకర్మ ఆరాధన ఎంతో ప్రేరణ నిస్తుందని ఈరోజు సమాజంలోనే వృత్తి నిపుణులు శిల్పులు కార్మికులు అందరికీ గౌరవప్రదమైన స్థానం కలిగించే విశిష్ట దినంగా డిఆర్ఓ అభివర్ణించారు.విశ్వకర్మను స్ఫూర్తిగా తీసుకొని ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని మానసిక ప్రశాంతతతో ప్రజలు తమ జీవితాల్లో వెలుగు నింపుకోవాలని డిఆర్ఓ మాలోల తెలిపారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఇంచార్జ్ అధికారి గంగాద్రి మాట్లాడుతూ విశ్వకర్మ వల్లే చేతివృత్తులు అభివృద్ధి చెందాయని ఎన్నో దేవతల విగ్రహాలకు రూపాన్ని ప్రపంచాన్ని విశ్వకర్మ ఇచ్చారన్నారు నేడు ఆయన జయంతి ఉత్సవాలను ప్రతి ఏటా సెప్టెంబర్ 17న రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ద్వారాఅత్యంత ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతున్నట్లు తెలిపారు.



ముఖ్యంగా శిల్పకళా కారులను, కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమాజానికి విశ్వకర్మలు వారసత్వ సంపద అని విశ్వకర్మ సంఘం భారతదేశంలోని ఒక గొప్ప సామాజిక సమూహం అని ఇందులో ఉపసమొహాలైన కమ్మరి వడ్రంగి కమ్మరలు శిల్పులు మరియు స్వర్ణకారులు విశ్వకర్మ వారసులని పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంగాచారి మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్ముడు పరిపాలించిన పవిత్రమైన ద్వారక నగరాన్ని అలాగే పాండవుల కోసం ఇంద్రప్రస్థ రాజభవనాన్ని నిర్వహించడంతోపాటు వివిధ దేవతలకు అనేక అద్భుతమైన ఆయుధాలను తయారు చేసిన గొప్ప మహనీయుడు విశ్వకర్మ అని తెలిపారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో విశ్వకర్మ జయంతి వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. బీసీ సంక్షేమ అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ డిడి రవీంద్ర మాట్లాడుతూ ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకమును అవగాహన చేసుకొని అర్హులు లబ్ధిపొందాలని సూచించారు. విశ్వకర్మ సమాజానికి అవసరమైన వస్తువులను తయారు చేసే విధంగా స్ఫూర్తిదాయకులయ్యారన్నారు. విశ్వకర్మ జయంతి వేడుకలు ఎంతో ప్రాముఖ్యత కలిగినదని ప్రభుత్వ ప్రోత్సాహకాలను విశ్వబ్రాహ్మణులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.కార్యక్రమం ముగింపు భాగంగా ముఖ్య అతిథులకు ఆత్మీయ సత్కారం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్. ఆర్. నాగభూషణం , అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ మస్తాన్ భాస్కర్ బాబు, చంద్రశేఖర్ ఆచారి డి.వి. ఆచారి, బాలాచారి, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పలువురు బీసీ సంఘాలు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఓజోన్ పొర పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



- ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం

**ఉరవకొండ సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మానవ తప్పిదాల కారణంగా ఓజోన్ పొర దెబ్బతింటోందని, ఫలితంగా భూతాపం పెరిగి వాతావరణంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు.భావితరాలకు సురక్షితమైన పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పర్యావరణహిత ఉత్పత్తులను ప్రోత్సహించాలని సూచించారు. మాంట్రియల్, కిగాలి ఒప్పందాల లక్ష్యాలను సాధించేందుకు విద్యార్థులు చురుకైన పాత్ర పోషించాలని కోరారు. కళాశాల ఎకో క్లబ్ సమన్వయకర్త విష్ణుప్రియ మాట్లాడుతూ విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడమే ఎకో క్లబ్ ప్రధాన ఉద్దేశమన్నారు. ఓజోన్ పొర పరిరక్షణలో భాగంగా ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని సూచించారు.జంతు శాస్త్ర విభాగ అధ్యాపకురాలు జమీల బీబి ఓజోన్ పొర ప్రాముఖ్యతను వివరించారు. రసాయన శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పి. రమేష్ బాబు మాట్లాడుతూ ఓజోన్ పొరను రక్షించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చన్నారు.విద్యార్థులు ఓజోన్ పరిరక్షణ దినోత్సవ ప్రాముఖ్యతను వివరిస్తూ వివిధ చార్టులను ప్రదర్శించారు. కళాశాల ఉపాధ్యక్షులు పి. సోమశేఖర్ విద్యార్థులకు పలు సూచనలు చేస్తూ ఓజోన్ పొరను పరిరక్షించాల్సిన ఆవశ్యకతను వివరించారు.కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

# విశ్వకర్మ స్ఫూర్తితో కూటమి పాలన

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

**పెనుకొండ సెప్టెంబర్ 17,అనంత జనశక్తి న్యూస్**



సువర్ణ లంకా నగరం, ద్వారక, ఇంద్రప్రస్థం వంటి అద్భుత నగరాలను నిర్మించిన విరాట్ విశ్వకర్మ స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. చేతి వృత్తుదారులకు ఆర్థిక మేలు కలిగేలా పథకాలు రూపొందిస్తూ, అభినవ విశ్వకర్మగా రాజధాని అమరావతితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టులను సీఎం చంద్రబాబునాయుడు నిర్మిస్తున్నారన్నారు. విరాట్ విశ్వకర్మ జయంతి సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన చిత్రపటానికి మంత్రి సవిత పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శిల్పులు, వృత్తి నిపుణులు, కార్మికులకు ఆద్యుడు విశ్వకర్మ భగవానుడు అని అన్నారు. హిందూ పురాణాల ప్రకారం సత్యయుగంలో దేవతల నివాసానికి స్వర్గలోకం, త్రేతాయుగంలో సువర్ణ లంకను, ద్వాపర యుగంలో ద్వారక నగరాన్ని, కలియుగంలో హస్తినాపురం, ఇంద్రప్రస్థం, పాండవులు నివసించిన మయసభను విశ్వకర్మ నిర్మించారన్నారు. విశ్వకర్మ స్ఫూర్తితో సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. చేతి వృత్తుదారులకు సీఎం చంద్రబాబు అండగా ఉంటూ, గీత, వడ్డెర, చేనేత, ఇతర వృత్తులకు ఆర్థిక మేలు చేకూరేలా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. త్వరలో రూ.1000 కోట్లతో ఆదరణ 3.0 పథకానికి శ్రీకారం చుట్టనున్నారన్నారు. అభినవ విశ్వకర్మ సీఎం చంద్రబాబు అని కొనియారు. తెలంగాణాలోని సైబరాబాద్ నగరం నిర్మించడమే కాకుండా రాజధాని అమరావతి పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ నీరందించేలా పోలవరం సహా పలు సాగునీటి ప్రాజెక్టులను సీఎం చంద్రబాబు నాయుడు నిర్మిస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. బీసీల ఆత్మ గౌరవం నిలిపేలా ఆయా సామాజిక వర్గాలకు చెందిన మహనీయుల జయంతులను రాష్ట్ర పండగలుగా నిర్వహిస్తున్నారు. విశ్వకర్మ జయంతిని కూడా రాష్ట్ర పండగగా నిర్వహిస్తున్నామన్నారు. విజయవాడలో రాష్ట్ర స్థాయి జయంతిని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వినాయకుని లడ్డూ వేలంలో లేని మత సామరస్యం .

- రూ.3.05 లక్షలకు దక్కించుకున్న హుస్సేన్ .....

**పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 17 అనంత జన శక్తి న్యూస్.**

పుట్టపర్తిలోని శ్రీ పర్తి వినాయక యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయకుడి లడ్డూ వేలం పాట గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ వేలంలో లడ్డూను రూ.3,05,000లకు సాయి గణేష్ హోటల్ యజమాని నడిపి హుస్సేన్ దక్కించుకున్నట్లు నిర్వాహకుడు సాయి శ్రీకాంత్ తెలిపారు. లడ్డూను దక్కించుకోవడానికి యువత పెద్ద సంఖ్యలో పోటీపడ్డారు. చివరకు లడ్డూను అత్యధిక ధరకు హుస్సేన్ దక్కించుకోవడం ద్వారా మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారని స్థానికులు అతనిని అభినందించారు. పర్తి వినాయక యూత్ కమిటీ ఆధ్వర్యంలో అతనినీ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో షామీర్, కిషోర్, చిన్న, రమణ, సాయి తేజ, లోకేష్, శశి, శశాంక్, విష్ణు, మారుతి తదితరులు పాల్గొన్నారు.



# పెడపల్లిలో ఘనంగా వినాయక నిమజ్జనం.

**పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 17 అనంత జన శక్తి న్యూస్.**

పుట్టపర్తి మండల పరిధిలోని పెడపల్లి గ్రామంలో వినాయక నిమజ్జనా లు గురువారం ఘనంగా నిర్వహించారు. పెడపల్లి పెద్ద తండాలో ఏర్పాటుచేసిన ఘననాథుని ఊరేగింపు కనుల పండువాగా నిర్వహించారు. తాండ మహిళలు, యువకులు రంగులు చల్లుకొని నృత్యాలు చేశారు. పెడపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఆరు వినాయకుని విగ్రహాలను ఏర్పాటు చేసిన వినాయకుల ఊరేగింపులో యువకులు మహిళలు,పెద్ద సంఖ్యలో, నృత్యాలు చేస్తూ ఊరేగింపులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పుట్టపర్తి రూరల్ పోలీసులు గట్టి భద్రత ఏర్పాట్లను నిర్వహించారు.



# 2029 ఎన్నికల్లో బహుజన రాజకీయ శక్తులు ఏకం కావాలి



**- కుల, దోపిడీ రాజకీయాలకు చరమగీతం పాడాలి: డాక్టర్ పోతుల నాగరాజు**

**అనంతపురం సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్రంలో సామాజిక న్యాయం, రాజ్యాధికారం సాధన లక్ష్యంగా బహుజన రాజకీయ శక్తులన్నీ ఏక తాటిపైకి రావాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి నాయకుడు డాక్టర్ పోతుల నాగరాజు పిలుపునిచ్చారు.2014లో రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో బహుజన ప్రజల పరిస్థితి దయనీయంగా మారిందని ఆయన పేర్కొన్నారు. బహుజన ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన రాజకీయ పార్టీలు తిరిగి వారి హక్కులను అణచివేస్తున్నాయని ఆరోపించారు. ఆధిపత్య రాజకీయాలతో బహుజన వర్గాల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని విమర్శించారు.జనాభాలో స్వల్ప శాతం ఉన్న కొన్ని సామాజిక వర్గాలు అధికారం, ఆర్థిక వనరులు, ప్రకృతి సంపదపై ఆధిపత్యం చెలాయిస్తున్నాయని నాగరాజు అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు అధికారంలో తగిన వాటా, పరిశ్రమలు, కార్పొరేట్ రంగం, మీడియా, ఇతర రంగాల్లో సముచిత ప్రాతినిధ్యం లభించడం లేదని పేర్కొన్నారు. బహుజన ప్రజలకు రాజ్యాంగం కల్పించిన విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి హక్కులు పూర్తిస్థాయిలో అందేలా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక న్యాయం, రాజ్యాధికారం కోసం పనిచేస్తున్న ప్రజా సంఘాలు, కుల సంఘాలు, రాజకీయ పార్టీలు, సామాజిక మాధ్యమ ప్రతినిధులు, విద్యావంతులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, మహిళా నాయకులను ఒకే వేదికపైకి తీసుకురావడానికి డిసెంబర్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బహుజన ప్రజల ఆత్మగౌరవం, రాజ్యాధికార సాధన లక్ష్యంగా ఐక్య కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా బహుజన సమాజాన్ని ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని డాక్టర్ పోతుల నాగరాజు తెలిపారు.

# వినాయక చవితి వేడుకల్లో పాల్గొన్న పరిటాల శ్రీరామ్

**ధర్మవరం సెప్టెంబర్ 17**
**అనంత జనశక్తి న్యూస్ :**



ధర్మవరం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహిస్తున్న వినాయక చవితి వేడుకల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు వినాయక మండపాలను సందర్శించిన ఆయన.. విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.

అనంతరం ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ధర్మవరం నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని గణనాథుడిని ప్రార్థించారు. ఆయా మండపాల నిర్వాహకులు, స్థానికులతో పరిటాల శ్రీరామ్ ఆత్మీయంగా ముచ్చటించారు. వినాయక చవితి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

# వీ ఆర్ ఏ ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

**పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 17 అనంత జన శక్తి న్యూస్.**

రాష్ట్రంలోని వీ ఆర్ ఏ ల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని వీ ఆర్ ఏ ల సంఘం ఆధ్వర్యంలో గురువారం పుట్టపర్తి తాసిల్దార్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తాసిల్దార్ కార్యాలయం వద్ద శిబిరంలో ఉదయం నుండి సాయంత్రం వరకు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని వీ ఆర్ ఏ ల ప్రధాన సమస్యలైన పే స్కేలు అమలు, నామినీలుగా పనిచేస్తున్న వారందరినీ వీ ఆర్ ఏ లుగా నియమించడం, అర్హులందరికీ ప్రమోషన్లు ఇవ్వడం, చనిపోయిన వీఆర్ఏ కుటుంబాల్లో అర్హత, వయసుతో నిమిత్తం లేకుండా కారుణ్య నియామకాల కింద ఉద్యోగం ఇవ్వాలని గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ నేటికీ పరిష్కారం కాలేదని వారు తెలిపారు. ఆగస్టు 19న ఏపీ వీఆర్ఏల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చలో సీ సీ ఎల్ ఏ ఆఫీస్ (మంగళగిరి) కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా తమ సమస్యలు పరిష్కారం కాకపోతే సెప్టెంబర్ 16వ తేదీ నుండి సహాయ నిరాకరణ కార్యక్రమం చేపడతామని సీసీఎల్ఏ ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు పేర్కొన్నారు.

అందులో భాగంగా సెప్టెంబర్ 16వ తేదీ నుండి రాష్ట్రంలోని ప్రతి ఎంఆర్వో ఆఫీస్ వద్ద దీక్షా శిబిరాలు నిర్వహించాలని ఏపీ వీఆర్ఏల జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయించిందని తెలిపారు. తమ ప్రధాన సమస్యల పరిష్కారానికి తక్షణం ప్రభుత్వం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం నాయకులు, చంద్రమోహన్, చిన్న ఓబులప్ప, నరసింహులు, పుట్టపర్తి గంగాద్రి, పోతులయ్య, మహేష్, పాల్గొన్నారు.



# నగరంలో 'స్వచ్ఛతా హి సేవా' ర్యాలీ

**- ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ**
**- ప్లాస్టిక్ రహిత, పరిశుభ్రమైన నగరమే మా లక్ష్యం.. ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ భారత్ సాధ్యం.. : ఎమ్మెల్యే దగ్గుపాటి**
**- స్వచ్ఛతా హి సేవాలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి.. ఎంపీ అంబికా**

**అనంతపురం, సెప్టెంబర్ 17 : అనంత జనశక్తి న్యూస్**




ప్లాస్టిక్ రహిత, పరిశుభ్రమైన నగరమే మా లక్ష్యమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా గురువారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వచ్ఛతా హి సేవా' ర్యాలీలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి పాల్గొన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్, అధికారులు, సిబ్బంది స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులతో కలిసి ఈ ర్యాలీలో పాల్గొన్నారు. పరిశుభ్రతపై టవర్ క్లాక్ వద్ద ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్, వికసిత భారత్ లక్ష్యంగా పెట్టుకున్న ప్రధానమంత్రి మోదీ జన్మదినం సందర్భంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 30రోజులపాటు వివిధ కార్యక్రమాలు ఉంటాయని.. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర లక్ష్యానికి అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి 3వ శనివారం విభిన్నమైన కార్యక్రమాలు చేపట్టేలా చూస్తున్నారన్నారు. ఒక్కో శనివారం ఒక్కో థీమ్ తో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో కోటి 85లక్షల టన్నుల చెత్త పెట్టి పోతే దాన్ని తీసివేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుందన్నారు. అనంతపురం నగరంలోని డంపింగ్ యార్డ్ లో 3లక్షల టన్నుల ఉండిపోయిందని.. దీనిని పూర్తిగా తొలగిస్తున్నామన్నారు. ఇప్పటికే 2లక్షల టన్నుల చెత్త తీసివేశామని.. త్వరలోనే మిగిలింది కూడా తీసి వేసి ఇక్కడ ఫ్రెష్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే మిగిలిన స్థలంలో పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ పరంగా అన్ని కార్యక్రమాలు చేస్తున్నా.. ప్రజల్లో చైతన్యం రావాలన్నారు. నా ఇల్లు, నా వీధి, నా నగరం, నా రాష్ట్రం, నా దేశం పరిశుభ్రంగా ఉండాలనేది ప్రతి ఒక్కరిలో ఉంటేనే స్వచ్ఛ భారత్ సాధ్యమని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు.ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రధాని మోదీ లక్ష్యానికి అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పని చేస్తున్నారని అన్నారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం అని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, పరిశుభ్రత ప్రాముఖ్యతను తమ పిల్లలకు కూడా నేర్పించాలన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు గ్రామస్థాయి నుంచి జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంత్, ఎంహెచ్ వో రాజా రవీంద్ర, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# వీఆర్సీ గ్రౌండ్‌కు మహర్దశ



**- వాకర్స్ కోరికలు నెరవేర్చేందుకు మంత్రి నారాయణ హామీ**

**నెల్లూరు సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**

నెల్లూరు సిటీ లోని వీఆర్సీ హైస్కూల్ గ్రౌండ్‌ను క్రీడలు, వాకింగ్‌కు అనుకూలంగా మరింత అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. గురువారం వీఆర్సీ గ్రౌండ్‌లో వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో మంత్రి మాటామంతి నిర్వహించారు.గ్రౌండ్‌లో ఇండోర్, అవుట్ డోర్ జిమ్‌లు, వాకింగ్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్, షెల్టర్, టాయిలెట్లు ఏర్పాటు చేయాలని వాకర్స్ మంత్రిని కోరారు. వారి విజ్ఞప్తిపై మంత్రి నారాయణ అక్కడికక్కడే స్పందించి, అవసరమైన పనులను ప్రారంభించాలని మున్సిపల్ కమిషనర్ నందన్‌ను ఆదేశించారు.ఆరు నెలల్లో వాకర్స్ కోరుతున్న సౌకర్యాలను ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు.గ్రౌండ్‌లో ఫ్లడ్‌లైట్లు కూడా ఏర్పాటు చేసి రాత్రివేళల్లోనూ క్రీడలు, వాకింగ్‌కు అనుకూలంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. అడిగిన వెంటనే స్పందించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్న మంత్రికి వాకర్స్ కృతజ్ఞతలు తెలిపారు.

**చిన్నారులతో మంత్రి సందడి**

వీఆర్సీ గ్రౌండ్‌లో చిన్నారులు బాస్కెట్‌బాల్ ఆడుతుండటాన్ని చూసిన మంత్రి నారాయణ వారితో కలిసి కాసేపు సరదాగా బాస్కెట్‌బాల్ ఆడారు. స్వయంగా గోల్ వేసి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. మంత్రితో కలిసి ఆడటంతో చిన్నారులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతా రెడ్డి, టీడీపీ నాయకులు డాక్టర్ పోకల రవి, ఏడుకొండలు, దర్శి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకర్మ భగవానుడు ఈ సృష్టికి మూలం..

**- ఎమ్మెల్యే దగ్గుపాటి**
**- నగరంలో ఘనంగా విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు**
**- బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబికా**
**- మానవ నాగరికతలో విశ్వబ్రాహ్మణుల పాత్ర కీలకమన్న దగ్గుపాటి**
**- విశ్వకర్మ పేరుతో చేతివృత్తుల వారిని ప్రోత్సహిస్తున్నారన్న ఎంపీ**
**- విశ్వకర్మ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని కోరిన విశ్వబ్రాహ్మణులు**

**అనంతపురం సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**



విశ్వకర్మ భగవానుడు ఈ సృష్టికి మూలమని.. మనిషి నాగరికతలో విశ్వబ్రాహ్మణుల పాత్ర ఎంతో ఉందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురం నగరంలో శ్రీ విరాట్ విశ్వకర్మ జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. నగరంలోని పాతూరులో వెలసిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమానికి అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా నగరంలోని విశ్వబ్రాహ్మణులు భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబికా స్వయంగా బైక్‌లు నడుపుతూ విశ్వబ్రాహ్మణుల్లో ఉత్సాహాన్ని నింపారు. "జై విశ్వకర్మ", "విశ్వకర్మ భగవాన్ కీ జై" అంటూ విశ్వబ్రాహ్మణులు చేసిన నినాదాలతో నగర వీధులన్నీ మారుమ్రోగాయి. ర్యాలీ అనంతరం జగద్గురు విరాట్ విశ్వకర్మ భగవానుడి విగ్రహానికి ఘనంగా పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, శిల్ప, కళా రంగాల్లో రాణిస్తున్న విశ్వబ్రాహ్మణులకు భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని వారు ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ, విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను శాలువాలు,పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది గురు ప్రసాద్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంగాచారి, స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ విశ్వకర్మ భగవానుడు ఈ సృష్టికి మూలమన్నారు. ఆయన ఐదుగురు సంతానమైన మను, మయ, త్వష్ట, శిల్పి, విశ్వజ్ఞుల ద్వారానే ఈ సమాజానికి అవసరమైన ఇనుము, కలప, రాగి, శిల, బంగారం వంటి పంచ వృత్తులు లభించాయన్నారు. మానవ నాగరికత నిర్మాణంలో విశ్వబ్రాహ్మణుల పాత్ర ఎంతో ఉందన్నారు. వారు లేకపోతే సమాజ గమనం లేదు, దేశ ప్రగతి లేదన్నారు. ప్రధాన మంత్రి జన్మదినం కూడా ఈ రోజు కావడం విశేషమన్నారు. విశ్వబ్రాహ్మణులకు ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన తెలిపారు.

మరోవైపు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విశ్వకర్మ సృష్టికి మూలమని..అందుకే దీనిని గుర్తించిన ప్రధాన మంత్రి మోదీ ఒక పండుగగా జయంతి వేడుకలను నిర్వహిస్తున్నారన్నారు. శ్రమించే కార్మికుల కోసం, చేతి వృత్తుల వారి కోసం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పేరుతో సహకారం అందిస్తున్నారన్నారు.విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి, వారి కళలను, వృత్తులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం తరపున అన్ని విధాలా కృషి చేస్తామని ఎంపీ చెప్పారు. మరోవైపు లాయర్ గురుప్రసాద్, రంగాచారి మాట్లాడుతూ విశ్వకర్మ జయంతిని బీజేపీ పాలిత ప్రాంతాల్లో సెలవు దినంగా ప్రకటించారని.. ఇక్కడ కూడా ఎన్డీఏ ప్రభుత్వం ఉంది కాబట్టి.. సెలవు దినంగా ఇవ్వాలని కోరారు. అలాగే ఇటీవల స్వర్ణకారులు, కంసలి, కమ్మరి, వడ్రంగి వారు కష్టాల్లో ఉన్నారని.. వారికి చేయూతనివ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

# ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను గడువులోపు పూర్తి చేస్తాం

**- జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్**
**- ఏపీ సీఈఓ వివేక్ యాదవ్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్పీ**

**అనంతపురం,సెప్టెంబర్17: అనంత జనశక్తి న్యూస్**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎం.వివేక్ యాదవ్ అమరావతి నుంచి గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో అనంతపురం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి. జగదీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న ఎన్నికల సన్నద్ధత, ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్ SIR) ప్రక్రియ పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం మరియు ఎన్నికల హింస కేసుల విచారణ పురోగతిని సీఈఓకి జిల్లా కలెక్టర్, ఎస్పీ వివరించారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా & పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం సంబంధించి హియరింగ్ కొరకు పెండింగ్ దరఖాస్తులు జిల్లాలో ప్రస్తుతం 23,904 దరఖాస్తులు (దాదాపు 6.24 శాతం) పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని రాబోయే 5 రోజుల్లోగా పూర్తిగా పరిష్కరిస్తామని తెలిపారు. స్పష్టంగా లేని ఫోటోల స్థానంలో స్పష్టమైన ఫోటోలు అప్లోడ్ చేసే ప్రక్రియ BLO (బూత్ స్థాయి అధికారులు) మరియు ERO (ఎన్నికల నమోదు అధికారులు)ల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను రోజువారీగా సమీక్షిస్తున్నట్లు తెలిపారు. బీఎల్వోల వద్ద సుమారు 21.77 శాతం పెండింగ్ ఉందని, వీటిని క్షేత్రస్థాయిలో వేగవంతం చేసేందుకు ప్రతిరోజూ దాదాపు 1 నుండి 1.5 లక్షల ఎంట్రీలను పరిశీలిస్తూ త్వరితగతిన ముగింపునకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఫారమ్ 6 (కొత్త ఓటరు నమోదు), ఫారమ్ 7 (తొలగింపులు), ఫారమ్ 8 (సవరణలు) కలిపి మొత్తం 19,000 వరకు దరఖాస్తులు వచ్చాయని, రోజువారీగా దాదాపు 3,000 కొత్త చేరికలు నమోదవుతున్నాయని తెలిపారు. రాబోయే 4 నుండి 5 రోజుల్లో ఈ ప్రక్రియ కూడా పూర్తవుతుందని వివరించారు. జిల్లాలోని ఏ నియోజకవర్గంలోనూ అసాధారణంగా అత్యధిక చేరికలు లేదా తిరస్కరణలు నమోదు కాలేదని, అంతా రాష్ట్ర సగటు పరిధిలోనే ఉందని స్పష్టం చేశారు. ఏదైనా నిర్దిష్ట బూత్‌లో అత్యధిక తిరస్కరణలు కనిపిస్తే వాటిని స్వయంగా క్షేత్ర స్థాయిలో రీవెరిఫై చేస్తామని చెప్పారు.ఎన్నికల హింసాత్మక కేసులు న్యాయ విచారణ కేసుల వివరాలకు సంబంధించి జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ వివరిస్తూ 2024 సాధారణ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ మరియు పోలింగ్ అనంతర హింసాత్మక ఘటనలకు సంబంధించి జిల్లాలో మొత్తం 7 కేసులు నమోదయ్యాయని, మొత్తం 7 కేసులలో 6 కేసులపై దర్యాప్తు పూర్తి చేసి చార్జ్‌షీట్ దాఖలు చేయడం జరిగిందన్నారు. ఇవి ప్రస్తుతం గౌరవ న్యాయస్థానంలో విచారణ (Trial stage) దశలో ఉన్నాయి. ఈ కేసుల విచారణను పోలీసులు ఎప్పటికప్పుడు ఫాలోఅప్ చేస్తూ ముగింపునకు తీసుకువస్తున్నారనీ, మిగిలిన 1 కేసు పోలీసు విచారణలో తప్పుడు (False/Mistake of Fact) కేసుగా తేలిందని, రద్దు నిమిత్తం కోర్టుకు నివేదించినట్లు తెలిపారు.ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా జిల్లాలోని అన్ని ప్రక్రియలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా, పూర్తి పారదర్శకతతో పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి జిల్లా కలెక్టర్ వివరించారు.

శుక్రవారం | అనంతపురం
18.09.2026

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం



# విద్యుత్ షాక్ తో మరణించిన కుటుంబానికి ఆర్థిక సాయం

- ఎమ్మెల్యే పరిటాల సునీత చొరవతో రూ.1.50లక్షల సాయం
- నీట్ లో ర్యాంక్ సాధించిన విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే సునీత

**అనంతపురం సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**



నాలుగేళ్ల క్రితం విద్యుత్ షాక్ తో మరణించిన వ్యక్తి కుటుంబానికి ఎమ్మెల్యే పరిటాల సునీత చొరవతో ఆర్థిక సాయం అందింది. రామగిరి మండలం కుంటిమద్ది గ్రామానికి చెందిన కురుబ ఓబులపతి 4సంవత్సరాల క్రితం విద్యుత్ షాక్ తో మరణించారు. ఈ విషయాన్ని తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ గారి దృష్టికి ఎమ్మెల్యే సునీత తీసుకెళ్లారు. అయన తక్షణమే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 1లక్ష 50వేల రూపాయలను మంజూరు చేశారు. ఎమ్మెల్యే సునీత అనంతపురం క్యాంపు కార్యాలయంలో ఓబులపతి భార్య కురుబ లక్ష్మీదేవికి చెక్కును అందజేశారు. చెక్కును అందుకున్న లక్ష్మీదేవి ఇతర కుటుంబసభ్యులు ఎమ్మెల్యే సునీతకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎవరైనా కష్టాల్లో ఉన్నారంటే సాయం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఎప్పుడూ ముందుంటారని ఎమ్మెల్యే సునీత అన్నారు. ఈ రెండేళ్లలో ఎంతో మంది టీడీపీ కార్యకర్తల కుటుంబాలతో పాటు సామాన్య ప్రజల్ని ఆదుకున్నారన్నారు. మరోవైపు నీట్ లో ర్యాంక్ సాధించిన విద్యార్థిని ఎమ్మెల్యే సునీత అభినందించారు. రాప్తాడు మండల కేంద్రానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు పంపు ఇంద్రశేఖర్ కుమారుడు పంపు మనుకృష్ణ నీట్ పరీక్ష నందు 3196వ ర్యాంక్ సాధించాడు. నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల నందు వైద్య విద్యను అభ్యసించడానికి అనుమతి పొందాడు. మనుకృష్ణ ఎమ్మెల్యే సునీతతో అనంతపురం క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలవగా.. ఆమె అతన్ని ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్ లో వైద్య విద్యలో రాణించి ప్రజలకు సేవలందించాలని సూచించారు...

# కింది స్థాయి కార్యకర్త నుంచి మా వరకు పార్టీలో అంతా సమానమే



- అంతా కలిసి మంత్రి నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేద్దాం
- ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్ఛార్జి పరిటాల శ్రీరామ్ పిలుపు
- రాప్తాడు, చెన్నేకొత్తపల్లిలో పార్టీ కార్యకర్తల సమావేశం
- రాప్తాడులో లోకేష్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన శ్రీరామ్
- అన్న క్యాంటీన్ ను సందర్శించిన ఎమ్మెల్యే సునీత

**రాప్తాడు సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**

కింది స్థాయి కార్యకర్త నుండి మా వరకు పార్టీలో అంతా ఒక్కటేనని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ముందు అత్యంత ప్రతిష్టాత్మకంగా మారిన ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పర్యటనకు సంబంధించి వారు పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముందుగా రాప్తాడు టీడీపీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్ల గురించి చర్చించారు. అనంతరం చెన్నేకొత్తపల్లిలో కూడా పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మంత్రి నారా లోకేష్ ఈనెల 22వ తేదీన రాప్తాడుకు రానున్నారని.. టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్, అలాగే మాజీ మంత్రి పరిటాల రవీంద్ర విగ్రహాలను మంత్రి లోకేష్ ఆవిష్కరించనున్నారని ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ చెప్పారు. విగ్రహాల ఆవిష్కరణ అనంతరం బహిరంగ సభ, కార్యకర్తల సమావేశం జరగనుందన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ కార్యక్రమం మనకు అత్యంత ప్రతిష్టాత్మకంగా ఉంటుందన్నారు. రాప్తాడులో లోకేష్ పర్యటనకు ముందు ర్యాలీ ఉంటుందన్నారు. చెన్నేకొత్తపల్లిలో జరిగిన సమావేశంలో కూడా లోకేష్ పర్యటనగురించి చర్చించారు. చెన్నేకొత్తపల్లిలో నూతనంగా నిర్మించిన కస్తూరిబా పాఠశాల అదనపు భవనాలను పరిశీలించిన ఎమ్మెల్యే పరిటాల సునీత గారు ఈ నెల 22వ తేదీన నారా లోకేష్ గారు ఈ భవనాలను ప్రారంభిస్తారన్నారు. అనంతరం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కిందిస్థాయి కార్యకర్త నుండి మా వరకు అందరూ ఒకటే.. అందరం సమానమేనని. పార్టీ కార్యక్రమం అనేది ప్రతి ఒక్కరి సొంత కార్యక్రమం అన్నారు. నాయకులు, క్రియాశీలక కార్యకర్తలు ప్రత్యేక చొరవ తీసుకొని, గ్రామాలలోని ప్రతి ఒక్క కిందిస్థాయి కార్యకర్తలను, అభిమానులను ఈ విగ్రహాల ఆవిష్కరణ మహోత్సవంలో భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. సమావేశం అనంతరం పరిటాల శ్రీరామ్ క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. మంత్రి లోకేష్ పర్యటన సందర్భంగా నిర్వహించబోయే ర్యాలీ రూట్ మ్యాప్, సభాస్థలి, భోజన, విగ్రహాల ఏర్పాటు ప్రాంతాన్ని ఆయన క్షుణ్ణంగా చూశారు. సభకు వచ్చే వేలాది మంది ప్రజలు, కార్యకర్తలకు ఇబ్బంది కలగకుండా భోజన వసతులు, తాగునీరు మరియు వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపై నాయకులకు, కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. మరోవైపు ఎమ్మెల్యే పరిటాల సునీత రాప్తాడు మండల కేంద్రానికి చెందిన చెడిపోతుల వెంకటేష్ గత వారంలో అనారోగ్యానికి గురై మరణించగా వారి కుటుంబ సభ్యుల్ని పరామర్శించి 20వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం రాప్తాడులోని 'అన్న క్యాంటీన్'ను సందర్శించారు. ఇక్కడ భోజన నాణ్యతపై ఆరా తీశారు. ఈ క్యాంటీన్ ఏర్పాటు వలన ఎంత వరకు ప్రయోజనం ఉందన్నది తెలుసుకున్నారు. భోజనం నాణ్యతలో ఎక్కడా రాజీ పడవద్దని ఎమ్మెల్యే సునీత ఆదేశించారు...





# ప్రధాన రహదారి పక్కనే చెత్త పోస్తున్న మున్సిపల్ కార్మికులు

- దుర్వాసనతో ప్రయాణికుల అవస్థలు..
- గాలికి ఎగిరిపడుతున్న ప్లాస్టిక్, కాగితాలు
- డంపింగ్ యార్డు ఉన్నా రోడ్డుపైనే చెత్త వేయడంపై విమర్శలు

పట్టించుకోని అధికారులు.. చర్యలు తీసుకోవాలని ప్రయాణికుల డిమాండ్

**కళ్యాణదుర్గం: సెప్టెంబర్ 17 అనంతజనశక్తి న్యూస్**

పట్టణంలో పారిశుధ్య నిర్వహణ కోసం ప్రభుత్వ నిధులతో డంపింగ్ యార్డును ఏర్పాటు చేసినప్పటికీ.. మున్సిపల్ కార్మికులు ప్రధాన రహదారి పక్కనే చెత్త వేస్తుండటంపై ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీ పరిధిలో సేకరించే చెత్తాచెదారాన్ని ఒకచోట చేర్చి, యంత్రాల ద్వారా తడి, పొడి చెత్తను వేరు చేసి నిర్వహించేందుకు డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రహదారి పక్కనే చెత్తను గుట్టలుగా వేస్తుండటంతో పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వ్యాపిస్తోంది. మరోవైపు గాలికి ప్లాస్టిక్ కవర్లు, న్యూస్‌పేపర్లు, ఇతర వ్యర్థాలు రోడ్డుపైకి ఎగిరివస్తున్నాయి. దీంతో వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు చెత్త కారణంగా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డు ఉన్నప్పటికీ రహదారి పక్కనే చెత్త వేయాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడిందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, రహదారి పక్కన చెత్త వేయకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ఇప్పటికే పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు. ఈ సమస్యపై మున్సిపల్ కమిషనర్, ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించి ప్రజలకు, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# దివ్యాంగుడైన విద్యార్థికి ట్రై సైకిల్ అందజేసిన మంత్రి కందుల దుర్గేష్



**పుట్టినరోజున ఆపన్నహస్తం**

**రాజమహేంద్రవరం సెప్టెంబర్ 17,అనంత జనశక్తి న్యూస్**

పుట్టినరోజు వేడుకలంటే సాధారణంగా ఆర్భాటాలు, వేడుకలే కనిపిస్తాయి. కానీ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ తన పుట్టినరోజును సార్థకం చేసుకుంటూ మరోసారి తనలోని సహృదయతను, మానవత్వాన్ని చాటుకున్నారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న పీయూష్ అనే దివ్యాంగ విద్యార్థి పడుతున్న ఆవేదనను, నిత్యం ఎదుర్కొంటున్న శ్రమను గుర్తించిన మంత్రి దుర్గేష్ తన మిత్రుని సహకారంతో ఆ విద్యార్థికి ఒక ట్రై సైకిల్‌ను మంజూరు చేసి స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడూ... "శారీరక వైకల్యం అనేది విద్యార్థి ఆశయాలకు ఏమాత్రం అడ్డంకి కాకూడదు. ఈ వాహనం పీయూష్‌కి కేవలం ప్రయాణ సాధనం మాత్రమే కాదు... అతని ఆత్మవిశ్వాసానికి, నిత్య జీవిత చక్రానికి కొండంత ధైర్యం. పీయూష్ మరింత కష్టపడి చదివి సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి"అని ఆకాంక్షించారు.మంత్రి దుర్గేష్ చేతుల మీదుగా ట్రై సైకిల్ అందుకున్న విద్యార్థి పీయూష్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. నిత్యం కాలేజీకి వెళ్లడానికి, రోజువారీ పనులకు పడుతున్న అవస్థలను గుర్తుచేసుకుంటూ"నా కష్టాన్ని గుర్తించి, నా చదువుకు కొత్త ఊపిరి పోసిన మంత్రి దుర్గేష్ రుణం తీర్చుకోలేను. ఈ రోజు నా జీవితంలో మరచిపోలేని రోజు" అని భావోద్వేగంతో కృతజ్ఞతలు తెలియజేశారు.సమాజంలో కష్టాల్లో ఉన్నవారికి చేయూతనందించడమే నిజమైన పుట్టినరోజు పండుగ అని నిరూపించిన మంత్రి దుర్గేష్ ను, ఈ సత్కార్యానికి సహకరించిన వారిని పలువురు నెటిజన్లు, స్థానికులు హృదయపూర్వకంగా అభినందిస్తున్నారు.

# నిమజ్జనానికి తరలిన వినాయకులు



- నాలుగో రోజు ఘనంగా నిమజ్జన వేడుకలు.....

**ధర్మవరం సెప్టెంబర్ 17 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణంలో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం నాలుగో రోజు పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గణనాథులను అలంకరించి ఊరేగింపుగా తీసుకెళ్లారు. నిమజ్జన ఊరేగింపులో యువతీయువకులు పాల్గొని ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. డప్పులు, పాటల మధ్య 'గణపతి బప్పా మోరియా' అంటూ నినాదాలు చేస్తూ గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. భక్తుల నినాదాలతో పట్టణంలోని ప్రధాన వీధులు మార్మోగాయి. అనంతరం నిమజ్జన ప్రదేశానికి చేరుకున్న భక్తులు గణపతికి తుది పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేశారు. వినాయక నిమజ్జన కార్యక్రమాలతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది.

# భగవాన్ విశ్వకర్మ విశ్వానికిమొదటి ఆర్కిటిక్..

- ఆర్డీవో రామ భూపాల్ రెడ్డి.

**ధర్మవరం సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్:**

భగవాన్ విశ్వకర్మ విశ్వానికి మొదట ఆర్కిటిక్ అని, దేవతలకు అవసరమైన దివ్య ఆయుధాలను సమకూర్చిన మహనీయుడు అని ఆర్డిఓ రామా భూపాల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవో కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు భగవాన్ విశ్వకర్మ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి ఆడిబోతోపాటు కార్యాలయ అధికారులు, సిబ్బంది పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ..... నేటి నేటి ఆర్కిటికులు చేతివృత్తుల వారందరికీ ఆయన ఆదర్శమూర్తి అని పేర్కొన్నారు. కంసలి తదితర విశ్వకర్మ వృత్తుల వారు గ్రామీణ పట్టణ ప్రాంతాలలో విశేష సేవలు అందిస్తూ సమాజానికి వెన్నెముక నిలుస్తున్నారని వారు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఏవో ఖతిజూన్ కుప్రా, నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# మైనారిటీ విద్యార్థులు ఉన్నత విద్యతో దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలి

- విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం: మహమ్మద్ నసీర్ అహ్మద్
- మైనారిటీ విద్యార్థుల విద్యా, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక దృష్టి
- విద్య ద్వారానే వ్యక్తిగత, కుటుంబ, ప్రాంతీయ అభివృద్ధి సాధ్యం: కమిటీ సభ్యులు
- విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చర్యలు
- ప్రత్యేక వసతి గృహాలు, ఉపకార వేతనాలు, విద్యా సౌకర్యాలపై కమిటీకి వినతులు

**అనంతపురం, సెప్టెంబర్ 17: అనంత జనశక్తి న్యూస్**



మైనారిటీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ మైనారిటీల సంక్షేమ కమిటీ ఛైర్మన్ మహమ్మద్ నసీర్ అహ్మద్ పిలుపునిచ్చారు. మైనారిటీ విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గురువారం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం సెనెట్ హాల్‌లో మైనారిటీ విద్యార్థినీ విద్యార్థులతో శాసనసభ మైనారిటీల సంక్షేమ కమిటీ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన కమిటీ సభ్యులు వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు.మహమ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ సమాజంలో, రాష్ట్రంలో, దేశంలో మార్పు తీసుకురావడానికి విద్యే ప్రధాన సాధనమన్నారు. విద్యార్థులు కేవలం మార్కులు, డిగ్రీలకే పరిమితం కాకుండా సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.మైనారిటీ వర్గాలకు విద్య, ఉపాధి, ఆర్థిక రంగాల్లో తగిన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. మైనారిటీ యువతకు అమలవుతున్న నాలుగు శాతం బీసీఈ రిజర్వేషన్, విద్యా సౌకర్యాలు, ఇతర అవకాశాలను పరిశీలించి మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. స్వర్ణాంధ్ర2047 లక్ష్య సాధనలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కమిటీ సభ్యుడు, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో మైనారిటీలకు విద్యా, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మైనారిటీ విద్యార్థుల కోసం ప్రత్యేక కళాశాలలు, వసతి గృహాల ఏర్పాటు అంశాలను అసెంబ్లీ కమిటీలో చర్చించి ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించే దిశగా వృత్తి విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అనంతపురం ప్రాంతంలో పరిశ్రమలు, ఉద్యాన పంటలు, ఆహార శుద్ధి రంగాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు.కమిటీ సభ్యుడు ఇసాక్ బాషా మాట్లాడుతూ మైనారిటీలకు అందుతున్న సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లు, వసతి, విద్యా సౌకర్యాల అమలును పరిశీలించేందుకే పర్యటన చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థుల నుంచి వచ్చిన సమస్యలపై సమగ్ర నివేదిక రూపొందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.మరో కమిటీ సభ్యుడు సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తెలియజేసిన ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఎం.వి.ఆర్. జ్యోతి కుమార్ మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న తీరును వివరించారు.ఈ సందర్భంగా విద్యార్థులు బీఈడీ ప్రాంగణంలో మరుగుదొడ్ల సౌకర్యం లేదని, 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఉపకార వేతనాలు అందలేదని తెలిపారు. మహిళా మైనారిటీ విద్యార్థుల కోసం ప్రత్యేక వసతి గృహం ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులు ప్రస్తావించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని కమిటీ ఛైర్మన్ హామీ ఇచ్చారు.కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఈ. రమేష్ బాబు, ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ బి. సత్యనారాయణ, కమిటీ సభ్యులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధికారులు, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి జి. రామసుబ్బారెడ్డి, మైనారిటీ విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పుట్టపర్తి అభివృద్ధికి నిత్య శ్రామికుడు పల్లె రఘునాథ్ రెడ్డి

- ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే సేవకుడు
- జన్మదిన వేడుకల్లో టీడీపీ శ్రేణుల సందడి

పుట్టపర్తి, సెప్టెంబర్ 17:అనంత జనశక్తి న్యూస్

పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి జన్మదిన వేడుకలను టీడీపీ శ్రేణులు గురువారం ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. పుట్టపర్తి టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఏ ఆపద వచ్చినా వెంటనే స్పందించి అండగా నిలవడం పల్లె రఘునాథ్ రెడ్డి సేవా తత్వానికి నిదర్శనమన్నారు. ప్రమాదాల్లో గాయపడినవారు, మృతి చెందిన కుటుంబాలు, అగ్నిప్రమాద బాధితులు తదితరులకు తనవంతు సహాయం అందిస్తూ కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. గత 28 ఏళ్ల రాజకీయ, సామాజిక ప్రస్థానంలో పేదల వివాహాలు, విద్యార్థుల విద్య, అనారోగ్యం, ప్రమాదాలు, ఇతర ఆపదల సమయంలో అనేక కుటుంబాలకు సహాయం అందించినట్లు టీడీపీ శ్రేణులు తెలిపారు. నియోజకవర్గంలో సుమారు 75 వేల మందికి పైగా పేదలకు రూ.8 కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందించినట్లు పేర్కొన్నారు.



**విద్యారంగంలోనూ సేవలు**

రాజకీయాల్లోకి రాకముందు నుంచే విద్యారంగంతో అనుబంధం ఉన్న పల్లె రఘునాథ్ రెడ్డి, వెనుకబడిన ప్రాంతాల యువతకు విద్యావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో శ్రీ బాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా పలు విద్యాసంస్థల ఏర్పాటుకు కృషి చేశారు. సంస్థ వివరాల ప్రకారం 1991లో ప్రారంభమైన ఈ సంస్థ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలలు, డిగ్రీ, పీజీ, ఫార్మసీ, ఇంజినీరింగ్ తదితర విద్యాసంస్థలు కొనసాగుతున్నాయి. విద్యారంగంలో ఆయన సేవలకు పలు పురస్కారాలు లభించినట్లు విద్యాసంస్థల వివరాలు పేర్కొంటున్నాయి.

**కొనసాగుతున్న పల్లె కుటుంబ ప్రజాసేవ**

పల్లె రఘునాథ్ రెడ్డి ప్రజాసేవా ప్రస్థానాన్ని కొనసాగిస్తూ 2024లో ఆయన కోడలు పల్లె సింధూర రెడ్డి పుట్టపర్తి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. పల్లె కుటుంబం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని టీడీపీ నాయకులు తెలిపారు.జన్మదినం సందర్భంగా పల్లె రఘునాథ్ రెడ్డికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో మరిన్ని సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.

### రాజకీయ ప్రస్థానంలో కీలక బాధ్యతలు

**పల్లె రఘునాథ్ రెడ్డి 1999లో నల్లమాడ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ చీఫ్ విప్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2007లో శాసనమండలి సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2009లో పుట్టపర్తి నియోజకవర్గం ఏర్పడిన అనంతరం జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో మరోసారి పుట్టపర్తి నుంచి ఎన్నికై చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో ఐటీ, సమాచార-ప్రజా సంబంధాలు, తెలుగు భాషా-సంస్కృతి, ఎన్ఆర్ఐ సాధికారత-సంబంధాలు, మైనారిటీ సంక్షేమం తదితర శాఖలను నిర్వహించారు.**







## అన్నా క్యాంటీన్ ను తనిఖీ



- మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య.

ధర్మవరం సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్:

పట్టణంలోని సిద్దయ్యగుట్ట, ఎంపీడీవో కార్యాలయం ముందు ఉన్న అన్న క్యాంటీన్ ను మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టిఫెన్ పదార్థాలను వారు రుచి చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆకలి కొన్న వారికి తప్పకుండా ఐదు రూపాయలకే టిఫిన్ కూడా అందించాలని తెలిపారు. ఈ అన్న క్యాంటీన్లు పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పేద ప్రజలు కూడా ఉదయము టిఫిన్, మధ్యాహ్నము రాత్రి భోజనము కేవలం ఐదు రూపాయలు కే లభిస్తుందని తెలిపారు.

## పోషణ మాసోత్సవంలో అవగాహన కార్యక్రమం



రాప్తాడు, సెప్టెంబర్ 17 అనంత జనశక్తి న్యూస్

మండలంలోని రాప్తాడు-5 అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిడిపిఓ శ్రీమతి ఉమాశంకరమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం, సమతుల్య ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు, గర్భిణీలు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు సమతుల్య ఆహారం ఎంతో ముఖ్యమని సిడిపిఓ ఉమాశంకరమ్మ వివరించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే బియ్యం, పప్పు, నూనె తదితర పోషకాహార పదార్థాలను ప్రభుత్వం సూచించిన మోతాదులో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాలామృతం, పాలు, గుడ్లు వంటి పోషకాహార పదార్థాలను క్రమం తప్పకుండా తీసుకోవాలని, రోజువారీ ఆహారంలో అన్ని రకాల పోషక విలువలు ఉండేలా మీల్ ప్లేట్ విధానాన్ని పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గర్భవతి ఆహ్వానం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే వివిధ సేవలు, పోషకాహార పదార్థాల ప్రయోజనాలు, పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలలో అంగన్వాడీ కేంద్రాల ప్రాముఖ్యతపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శ్రీమతి లీలావతి, అంగన్వాడీ కార్యకర్తలు, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, ఇతర లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే ప్రజా దర్బార్

రాయదుర్గం, సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్ :

నేడు రాయదుర్గం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ విప్, శాసనసభ్యులు కాలువ శ్రీనివాసులు ప్రజా దర్బార్ నిర్వహించనున్నారు. మండల ప్రజలు తమ సమస్యలను పరిధిలో రూపంలో విన్నవించుకుని పరిష్కారం చేసుకోవలసినదిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి కొండన్న ఓ ప్రకటన ద్వారా తెలిపారు.

# గణేష్ నిమజ్జనానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- నిర్దేశిత మార్గాల్లోనే శోభాయాత్ర.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు
- ప్రజలు, ఉత్సవ కమిటీలు పోలీసులకు సహకరించాలి: ఎస్పీ జగదీష్

అనంతపురం, సెప్టెంబర్ 17:అనంత జనశక్తి న్యూస్

అనంతపురం నగరంలో శుక్రవారం (18వ తేదీ) నిర్వహించనున్న గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ పి. జగదీష్ తెలిపారు. ప్రజలు, ఉత్సవ కమిటీలు, ముఖ్యంగా యువత పోలీసులకు సహకరించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా శోభాయాత్ర, నిమజ్జనం కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు.నిమజ్జన కార్యక్రమంలో భాగంగా పోలీసు సిబ్బందితో పాటు అత్యాధునిక సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిరంతరం నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. విగ్రహాల నిమజ్జన ప్రక్రియ క్రమపద్ధతిలో, సకాలంలో పూర్తయ్యేలా ఉత్సవ కమిటీలు తమ తరఫున స్వచ్ఛంద సేవకులను నిమజ్జన ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.శోభాయాత్ర ప్రారంభం నుంచే నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఇతరులకు ఇబ్బంది కలగకుండా పోలీసులు సూచించిన మార్గాల్లోనే ఊరేగింపు కొనసాగించాలని స్పష్టం చేశారు. బాణసంచా కాల్చరాదని, అధిక శబ్దం కలిగించే డీజేలను ఉపయోగించరాదని హెచ్చరించారు. మద్యం సేవించి వేడుకల్లో పాల్గొనవద్దని సూచించారు.అసాంఘిక శక్తులు, అల్లరిమూకలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా, మతసామరస్యానికి విఘాతం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసినా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.మహిళలు, చిన్నారులు, వృద్ధులు అధిక సంఖ్యలో పాల్గొనే ప్రాంతాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో పోలీసులతో పాటు ఈతగాళ్లు, రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపక సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.

**శోభాయాత్రకు నిర్దేశించిన మార్గాలు**

మొదటి మార్గం: తాడిపత్రి బస్టాండ్-బసవన్నకట్ట-సూర్యనగర్ సర్కిల్-సప్తగిరి సర్కిల్ మీదుగా శోభాయాత్ర కొనసాగుతుంది. జేఎన్‌టీయూ, కలెక్టరేట్ వైపు నుంచి వచ్చే విగ్రహాలు సంఘమేష్ సర్కిల్ మీదుగా సూర్యనగర్ సర్కిల్ వద్ద మొదటి మార్గంలో కలుస్తాయి. హౌసింగ్ బోర్డు, విద్యుత్‌నగర్ సర్కిల్, నాయక్‌నగర్, ఆదర్శనగర్ ప్రాంతాల నుంచి వచ్చే విగ్రహాలు అశోక్‌నగర్, సాయినగర్ మీదుగా సప్తగిరి సర్కిల్ వద్ద చేరుతాయి.రెండో మార్గం: మొదటి రోడ్డు నుంచి ఆరవ రోడ్డు వరకు, రామచంద్రనగర్ వైపు నుంచి వచ్చే విగ్రహాలు సైఫుల్లా పైవంతెన మీదుగా శ్రీకంఠం సర్కిల్‌కు చేరుకుని, అక్కడి నుంచి ఎన్టీఆర్ సర్కిల్, టవర్ క్లాక్, పీటీసీ పైవంతెన మీదుగా నడిమివంకకు చేరుకుంటాయి.మూడో మార్గం: రుద్రంపేట, రామ్‌నగర్, లక్ష్మీనగర్, శ్రీనగర్ కాలనీల నుంచి వచ్చే విగ్రహాలు రామ్‌నగర్ పైవంతెన మీదుగా ప్రభుత్వ ఆసుపత్రి సర్కిల్, తెలుగుతల్లి సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా సప్తగిరి సర్కిల్ వద్ద కలుస్తాయి.

**మూడు ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లు**

1. పంపనూరు హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ: నాలుగు అడుగుల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలు.
2. రాచానపల్లి అక్కమ్మగార్ల గుడి సమీపంలోని చెక్‌డ్యామ్: నాలుగు అడుగుల లోపు విగ్రహాలు.
3. రాచానపల్లి కొత్త పైవంతెన సమీపం: నాలుగు అడుగుల లోపు విగ్రహాలు.

**నగరంలో 24 గంటల పాటు ట్రాఫిక్ మళ్లింపు**

గణేష్ నిమజ్జనం సందర్భంగా సెప్టెంబర్ 18 ఉదయం 6 గంటల నుంచి సెప్టెంబర్ 19 ఉదయం 6 గంటల వరకు అనంతపురం నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు అమల్లో ఉంటాయని పోలీసులు తెలిపారు.గుత్తి వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు మిర్చి యార్డు మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వైపు వెళ్లాలి.తాడిపత్రి వైపు నుంచి వచ్చే వాహనాలు ఎన్టీఆర్ మార్గం మీదుగా వెళ్లాలి.కళ్యాణదుర్గం, బళ్లారి, రుద్రంపేట వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు తపోవనం మీదుగా తాడికలేరు, గుత్తి రోడ్డు, మిర్చి యార్డు మార్గంలో వెళ్లాలని పోలీసులు సూచించారు.వాహనదారులు ట్రాఫిక్ మళ్లింపులను గమనించి పోలీసులకు సహకరించాలని ఎస్పీ పి. జగదీష్ విజ్ఞప్తి చేశారు.




# అంగరంగ వైభవంగా మంత్రి కందుల దుర్గేష్ జన్మదిన వేడుకలు





- ప్రధాని నరేంద్ర మోదీ, మంత్రి దుర్గేష్ బర్త్‌డే వేడుకలతో నిడదవోలులో పండగ వాతావరణం
- *విజ్జేశ్వరం నుంచి నిడదవోలు వరకు అభిమానుల భారీ బైక్ ర్యాలీ, గజమాలతో మంత్రి దుర్గేష్ కు ఘన స్వాగతం
- స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనకు కృషి చేస్తాం: మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ జన్మదిన వేడుకలు నిడదవోలు పట్టణంలోని లయన్స్ క్లబ్‌లో అభిమానులు, కార్యకర్తల భారీ జనసందోహం నడుమ అంగరంగ వైభవంగా జరిగాయి. సర్వమత ప్రార్థనలతో ప్రారంభమైన ఈ వేడుకల్లో నియోజకవర్గ నలుమూలల నుంచి విచ్చేసిన అభిమానుల కోలాహలంతో పండగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. ఇదే రోజు దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం కూడా కావడంతో ప్రధానికి ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ మరొక కేక్‌ను కట్ చేశారు.

**ప్రధాని ఆయురారోగ్యాలతో ఉండాలి**

వేడుకల్లో భాగంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... "దేశాన్ని అభివృద్ధి పథంలో ముందంజలో నిలుపుతున్న ఉక్కు మనిషి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి 'ఆయుష్మాన్ భవ' అని ప్రతి ఒక్కరూ ఆశీస్సులు అందజేయాలి. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, మరో 25 ఏళ్ల పాటు దేశాన్ని ఆయనే పరిపాలించాలని కోరుకుంటున్నాను.ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని (ముఖ్యమంత్రిగా, ప్రధానిగా) పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు జరిగే సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమం జరుగుతోంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు, పరిశుభ్రత కార్యక్రమాలు, మొక్కలు నాటే కార్యక్రమాలు తదితర పలు సేవా కార్యక్రమాలను చేపట్టనుంది" అని తెలిపారు.. ప్రజానీకం అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులు అవ్వాలని పిలుపునిచ్చారు.

**స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనే ధ్యేయం**

దేశ ప్రధాని ఆకాంక్షించిన 'వికసిత్ భారత్ 2047', ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించిన 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యాలను సాధించడమే మన అందరి ప్రధాన ధ్యేయమని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. తనకు మంత్రి పదవిని కల్పించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు, తనను విశ్వసించి గెలిపించిన నిడదవోలు నియోజకవర్గ ప్రజలకు, అలాగే ఈ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించిన అభిమానులు, జనసేనకూటమి కార్యకర్తలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**భారీ బైక్ ర్యాలీ – నీరాజనాలు పట్టిన ప్రజలు**

అంతకుముందు విజ్జేశ్వరం నుండి నిడదవోలు వరకు వేలాది మంది అభిమానులతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. తీవ్రమైన ఎండను సైతం లెక్కచేయకుండా కారు పై నిలబడి దాదాపు 10 కిలోమీటర్ల మేర ప్రజలకు అభివాదం చేస్తూ మంత్రి దుర్గేష్ నిడదవోలు పట్టణంలోకి ప్రవేశించారు. మార్గమధ్యంలో అభిమానులు, ప్రజలు గజమాలలతో ఆయనకు ఘన స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

# ప్రతిభ ఉన్న క్రికెటర్లను గుర్తిస్తాం

- పెనుకొండలో క్రీడా సంస్కృతికి సుదీర్ఘ చరిత్ర ఉంది
- మచ్చా రామలింగారెడ్డి చైర్మన్, క్రికెట్ అభివృద్ధి కమిటీ, ఆర్డిటి

అనంతపురం, సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న యువ క్రికెటర్లను గుర్తించి ప్రోత్సహించడమే లక్ష్యంగా క్రికెట్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఆర్డిటి రూరల్ గ్రామీణ హంట్ పేరుతో కార్యక్రమం నిర్వహించడం జరుగుతున్నదని అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని మచ్చా రామలింగారెడ్డి చైర్మన్ క్రికెట్ డెవలప్మెంట్ కమిటీ ఆర్డిటి పిలుపునిచ్చారు.గ్రామీణ ప్రాంతాల్లోని క్రికెట్ ప్రతిభావంతులను గుర్తించి, వారిని తీర్చిదిద్ది, వారికి మద్దతునిచ్చే లక్ష్యంతో 'రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్' చేపట్టిన 'రూరల్ క్రికెట్ టాలెంట్ హంట్' కార్యక్రమం, అనంతపురం మరియు శ్రీ సత్యసాయి జిల్లాల్లో సెప్టెంబర్ 16, 2026న ప్రారంభమైంది. ఈ ఎంపిక కార్యక్రమంలో RDT క్రికెట్ అభివృద్ధి కమిటీ చైర్మన్ మచ్చ రామలింగ రెడ్డి, పెనుకొండ ఎంఈఓ మరియు ప్రధానోపాధ్యాయులు రాఘవయ్య, పెనుకొండ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు ఎస్ ఎల్ ఎన్ ప్రసాద్, సెలెక్టర్లు సి. వెంకటేష్, యోగానంద మరియు విజయ్ రాజు, ఆర్డిటి కోఆర్డినేటర్ ప్రవీణ్, కోచ్ ముద్దాసిర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మచ్చా రామలింగారెడ్డిమాట్లాడుతూ, మొత్తం 83 మంది క్రీడాకారులు ఎంపిక ప్రక్రియకు హాజరయ్యారని తెలిపారు. అనంతపురంలో శిక్షణా శిబిరాలు మరియు మ్యాచ్‌లను నిర్వహించడం ద్వారా గ్రామీణ ప్రతిభను వెలికితీసి, వారి నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఆర్డిటి కట్టుబడి ఉందని, క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పెనుకొండలో క్రీడలకు ఎప్పటి నుంచో మంచి సంస్కృతి ఉందని, ప్రస్తుతం క్రీడాకారులు హైస్కూల్ వద్ద ఉన్న సదుపాయాలను వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు. అనంతపురంలో క్రీడల అభివృద్ధికి ఆర్ డి టి ఎంతో కృషి చేస్తోందని పెనుకొండ ఎంఈఓ రాఘవయ్య అన్నారు. క్రీడల పట్ల ఎంతో ఆసక్తి ఉన్న మోంచో ఫెర్రర్, అనంతపురం మరియు సత్యసాయి జిల్లాల్లో అద్భుతమైన సేవలు అందిస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల్లోని దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ 'టాలెంట్ హంట్' ఒక గొప్ప కార్యక్రమమని ఆయన కొనియాడారు. ఎంపిక ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది.



# ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో టీఐజీఎస్ బృందం పర్యటన

- వివిధ ప్రకృతి వ్యవసాయ నమూనాల పరిశీలన.. రైతులతో ముఖాముఖి చర్చ

**రాప్తాడు, సెప్టెంబర్ 17 (అనంత జనశక్తి న్యూస్):**



రాప్తాడు మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు చేపడుతున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను టాటా ఇన్‌స్టిట్యూట్ ఫర్ జెనెటిక్స్ అండ్ సొసైటీ (టీఐజీఎస్) డైరెక్టర్ డా. రాకేష్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని బృందం గురువారం పరిశీలించింది. సీటీ అండ్ ఐఓ డీపీఎం లక్ష్మా నాయక్ ఆధ్వర్యంలో ఈ పర్యటన జరిగింది.ఈ సందర్భంగా టీఐజీఎస్ బృందం రైతులతో నేరుగా మాట్లాడి ప్రకృతి వ్యవసాయంలో వారు అనుసరిస్తున్న పద్ధతులు, పంటల నిర్వహణ, క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలు, సాగులో ఎదురైన అనుభవాలను తెలుసుకుంది.రాప్తాడు గ్రామంలో రైతు శంకరయ్య సాగు చేస్తున్న మూడు ఎకరాల వేరుశనగ ఏగ్రేడ్ నమూనాతో పాటు 20 సెంట్ల ఏటీఎం నమూనాను బృందం పరిశీలించింది. పంట సాగు విధానం, క్షేత్ర నిర్వహణ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతుతో వివరంగా చర్చించింది.అనంతరం హంపాపురం గ్రామంలో రైతు లక్ష్మీదేవి సాగు చేస్తున్న ఎకరం మిరప ఏగ్రేడ్ నమూనాను పరిశీలించి పంట నిర్వహణ విధానాలను తెలుసుకున్నారు. గొల్లపల్లి గ్రామంలో రైతు లక్ష్మీనారాయణమ్మ సాగు చేస్తున్న అర ఎకరం కూరగాయల ఏగ్రేడ్ నమూనా, అర ఎకరం టమాటా ఏగ్రేడ్ నమూనాలను కూడా బృందం సందర్శించింది.

**ప్రకృతి వ్యవసాయ ద్రావణాల తయారీపై ప్రదర్శన**

పర్యటనలో భాగంగా బీజామృతం, ఘనజీవామృతం, ద్రవజీవామృతం వంటి ప్రకృతి వ్యవసాయానికి ఉపయోగించే పదార్థాల తయారీ విధానాలను క్షేత్రస్థాయిలో ప్రదర్శించారు. ముఖ్యంగా విత్తన గుళికల తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా చూపించి, విత్తనాలను సిద్ధం చేసే పద్ధతి, వాటి ప్రయోజనాలను వివరించారు.క్షేత్రాల్లో రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు అనుసరిస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను టీఐజీఎస్ బృందం పరిశీలించి, వారి అనుభవాలను ఆసక్తిగా తెలుసుకుంది.

**ఆరోగ్యం, పోషకాహారంపై చర్చ**

అనంతరం ఆరోగ్యం, పోషకాహారానికి సంబంధించిన ఐసీఆర్పీలతో టీఐజీఎస్ బృందం సమావేశమై చర్చించింది. ఆరోగ్యం, పోషకాహారం, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం, కుటుంబాల పోషకాహార భద్రత తదితర అంశాలపై చర్చించారు. గ్రామ స్థాయిలో ఐసీఆర్పీలు నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ప్రజల్లో ఆరోగ్యకరమైన ఆహారంపై అవగాహన కల్పిస్తున్న విధానాలను బృందం తెలుసుకుంది.ఈ కార్యక్రమంలో రాప్తాడు మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# పలు చోట్ల వేలం పాట



- కలశం శెట్టును దక్కించుకోన్న నంద్యాల రంగస్వామి

**యాడికి, సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్ :**

మండల కేంద్రంలో ఆంత్రాల వీధి లోను, ఆస్పత్రి కాలనీలో ను ,రాముని దేవాలయం వెనుక, పలు కాలనీలలోను వినాయక మండపాల వద్ద వేలం పాట కార్యక్రమం ను నిర్వహించారు. రాముని దేవాలయం వెనుక ఉన్న వినాయక స్వామి మండపాల వద్ద లడ్డు ను రూ.5700లకు ఆలూరు చంద్రశేఖర్ రెడ్డి ,వెండి నుదిటి బిళ్లను రూ.15500లకు చింతా ప్రకాష్, కలశం శెట్టును రూ.13800లకు నంద్యాల రంగస్వామి,బొడ్డులో వెండి బిళ్లను రూ.8100లకు బాలం శ్రీనివాసులు వేలం పాటను పాడి దక్కించుకోన్నారు.వినాయక మండపాలను వద్ద వేలం పాటలో పాడి దక్కించు కోన్న భక్తులకు ఆయురారోగ్యాలతో ఉండాలని వినాయక మండపాల నిర్వహకులు దీవించారు.ఈ కార్యక్రమంలో వినాయక మండపాల నిర్వాహకులు,భక్తులు పాల్గొన్నారు.

# పండుగ ఆనందం క్షణకాలం... ప్రాణం మాత్రం అమూల్యం!

- ఎస్ ఎస్ సి టి, చైర్మన్ కలుగోడు మనోజ్ కుమార్

**రాయదుర్గం, సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్ :**

పండుగ ఆనందం క్షణకాలం ప్రాణం మాత్రం అమూల్యం కావున నిమజ్జనంలో పలు జాగ్రత్తలు పాటించి వినాయకుని నిమజ్జనం చేయాలని స్వధర్మ సేవా చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ కలుగోడు మనోజ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో కొలిచి, ఆనందోత్సాహాలతో నిమజ్జనం చేసే వేళ ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా, బాధ్యతగా వ్యవహరించాలని వినాయక నిమజ్జనం సందర్భంగా చెరువులు, కుంటలు, కాలువలు, నదులు తదితర నీటి ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు చేరే అవకాశం ఉన్నందున ముందస్తు భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

లోతు తెలియని నీటిలోకి దిగడం అత్యంత ప్రమాదకరమని, నిమజ్జనం కోసం ఎట్టి పరిస్థితుల్లోనూ నీటిలోకి వెళ్లకూడదని తెలిపారు. అధికారులు, పోలీసులు, రక్షణ సిబ్బంది సూచించిన సురక్షిత ప్రాంతాల్లోనే నిమజ్జనం నిర్వహించాలని కోరారు."నీటి లోతు తెలియదు... ప్రవాహం కనిపించదు.ఒక్క అడుగు ముందుకు వేస్తే ప్రమాదం వెనుకే ఉంటుంది."అంటూ ప్రజలను అప్రమత్తం చేశారు.మండపాల బాధ్యతలు తీసుకున్నవారిదే ప్రత్యేక బాధ్యత వినాయక మండపాల బాధ్యతలు తీసుకున్న గౌరవ పెద్దలు, నిర్వాహకులు యువత నిమజ్జనం ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు ప్రత్యేక బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాన్ని ముందుగానే పరిశీలించడం, పిల్లలు మరియు ఈత రాని వారిని నీటికి దూరంగా ఉంచడం, జనసందోహాన్ని,నియంత్రించడం. ప్రమాదకర ప్రాంతాల్లోకి ఎవరూ వెళ్లకుండా పర్యవేక్షించడం వంటి ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు. చిన్నారులపై పెద్దలదే బాధ్యత . నిమజ్జన ప్రాంతాలకు వచ్చే చిన్నారులు,విద్యార్థులు ఈత రాని వారు నీటికి దగ్గరగా వెళ్లకుండా తల్లి దండ్రులు, పెద్దలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ నీటి ప్రాంతాల వద్ద ఒంటరిగా వదిలిపెట్టకూడదన్నారు. సెల్ఫీ కోసం సాహసం వద్దు. సెల్ఫీలు, ఫోటోలు, వీడియోల కోసం నీటి అంచులకు వెళ్లడం, ప్రమాదకర ప్రదేశాల్లో నిలబడటం వంటి చర్యలకు దూరంగా ఉండాలని కోరారు."ఒక్క సెల్ఫీ కోసం వేసే అడుగు ఒక కుటుంబం జీవితంలో శాశ్వత కన్నీటిని మిగల్చకూడదు."

అని హెచ్చరించారు.

సహాయం తీసుకోవాలని సూచించారు. భక్తి ఉండాలి.




బాధ్యత కూడా ఉండాలి. వినాయక నిమజ్జనం భక్తికి ప్రతీక మాత్రమే కాకుండా సామాజిక బాధ్యతను చాటే సందర్భంగా కూడా ఉండాలని స్వధర్మ సేవా చారిటబుల్ ట్రస్ట్ పేర్కొంది."వినాయకుడికి వీడ్కోలు పలుకుద్దాం వీధుల్లో ఆనందాన్ని నింపుదాం..."చెరువుల వద్ద జాగ్రత్తగా నిలుద్దాం...ప్రతి ఒక్కరూ క్షేమంగా ఇంటికి చేరేలా చూద్దాం."అంటూ ప్రజలకు సందేశం ఇచ్చారు. పండుగ ఆనందాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సురక్షితంగా ఆస్వాదించాలని, ప్రాణ భద్రతకు ఎల్లప్పుడూ మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

# వేమన సన్నిధిలో గణపతి హోమం..



**నాలుగవ రోజు కొనసాగిన పూజల హోమంలో పాల్గొన్న భక్తులు ..**

**గాండ్లపెంట, సెప్టెంబర్ , 17,అనంత జనశక్తి న్యూస్..**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని కటారుపల్లి వేమన ఆలయ సన్నిధిలో గురువారం పురోహితులు గణపతి హోమం నిర్వహించారు. ఆలయ పీఠాధిపతి నంద వేమారెడ్డి ఏర్పాటుచేసిన వినాయక ప్రతిమ వద్ద పురోహితులు ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పురోహితులు వేదమంత్రాల నడుమ గణపతి హోమం నిర్వహించారు. ఇక్కడి ఆలయ పీఠాధిపతి నంద వేమారెడ్డి ఏర్పాటుచేసిన బలరాముడి రూపం కలిగిన వినాయక ప్రతిమను ప్రత్యేక పూలతో అలంకరించారు. ఇక్కడ జరుగుతున్న గణపతి హోమాన్ని తిలకించడానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ముఖ్యంగా ఇక్కడ జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాలను తిలకించడానికి కదిరి పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. అనంతరం భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఇక్కడికి వచ్చిన భక్తులకు వేమన పీఠాధిపతి అన్న వేమారెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- రోడ్డు ప్రమాదాలు జరగక ముందే అప్రమత్తం కావాలి
- డ్రంక్ అండ్ డ్రైవ్ పకడ్బందీగా అమలు చేయాలి
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం, సెప్టెంబర్ 17:అనంత జనశక్తి న్యూస్**

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు రోడ్డు భద్రతా కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఎస్పీ జగదీష్ తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ....ఒక ప్రమాదాన్ని నివారిస్తే ఒక తరాన్ని కాపాడిన వాళ్ళమవుతామని అభిప్రాయపడ్డారు. ప్రాణం ఎంతో విలువైనదని, రోడ్డు ప్రమాదాల మూలంగా ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు లేకుండా జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదాల బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, కల్వర్టులు, అండర్ పాస్‌ల వద్ద రేడియం స్టిక్కర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు, రవాణా శాఖ పక్కా ప్రణాళికతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ రహదారులపై అవసరం మేరకు వేగ నిరోధకాల సూచిక బోర్డ్ లు ఏర్పాటు చేయాలన్నారు.



మద్యం సేవించి, హెల్మెట్ లేకుండా, సీట్ బెల్ట్ లేకుండా వాహనాలను నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అత్యధిక శాతం ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోవడం జరుగుతోందన్నారు.జనాభాతో పాటు వాహనాల వినియోగం కూడా పెరుగుతున్న నేపథ్యంలో రవాణా శాఖ, అనుబంధ శాఖల అధికారులు రహదారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి వాహన ప్రమాదాలను అరికట్టే దిశగా పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని పెయిడ్ పార్కింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.

మార్కింగ్ ఇచ్చిన ప్రాంతాల్లోనే వాహనాలను పార్కింగ్ చేయాలన్నారు. నగరంలో ఖాళీ స్థలాలలో చెత్తకుప్పలు లేకుండా చర్యలు చేపట్టాలని డిపిఓ కు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆర్.అండ్.బి ఈఈ, డిఎంహెచ్ఓ, ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్, ట్రాఫిక్ సిఐ, డిసిహెచ్ఎస్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బాధితుడిని పరామర్శించిన బొంబాయి



**యాడికి, సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రంలోని హాస్పిటల్ కాలనీ నందు గల వార్డ్ మెంబర్ గజ్జి బాల పెద్దయ్య తండ్రి గజ్జి రాముడు ను గురువారం వైకాపా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ బొంబాయి రమేష్‌నాయుడు, ఎంపిటిసి , బొంబాయి బ్రదర్ వెంకట నాయుడు లు పరామర్శించారు. గత కొన్ని రోజుల నుండి అనారోగ్య సమస్య తో ఉండగా గజ్జి రాముడు స్వగృహం నకు చేరుకొన్న విషయం తెలుసుకోని స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబెర్ బొంబాయి రమేష్ నాయుడు పరామర్శించారు. రాముడు ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకోన్నారు. ఈ కార్యక్రమంలో బొంబాయి తనయుడు ఉపేంద్ర నాయుడు, గజ్జి రాముడు, గజ్జి బాలు, గుర్రాల కంబగిరి, గుర్రాల శివయ్య, కొండ రామచంద్ర, కొండ పెద్దన్న, బాల నారాయణ, శీనా తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం పూర్తై ఉంటే ఎల్‌నినో సమయంలో సైతం కరువుండేది కాదు

- గత ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును ప్రశ్నార్థకం చేసింది.
- చంద్రబాబు పోలవరం పూర్తవుతుందనే భరోసా, నమ్మకాన్ని కల్పించారు.
- నవంబర్ నాటికి కుడి, ఎడమ కాలువల అనుసంధాన పనులు పూర్తి.
- పోలవరం ప్రాజెక్ట్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి నిమ్మల రామానాయుడు.

**ఏలూరు సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**



పోలవరం ప్రాజెక్ట్ పనులను జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాజెక్టులో కీలకమైన ఈసిఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ పనులను పరిశీలించి, పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ, ఈసిఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణంలో గ్యాప్1 పనులు 49 శాతం, గ్యాప్2 పనులు 43 శాతం పూర్తయ్యాయని తెలిపారు. కుడి ప్రధాన కాలువ అనుసంధాన పనులను ఈ నెలాఖరుకు, ఎడమ ప్రధాన కాలువ అనుసంధాన పనులను నవంబర్ నాటికి పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. సీఎం చంద్రబాబు నాయుడు నిర్దేశించిన లక్ష్యం మేరకు ఈసిఆర్ఎఫ్ డ్యామ్ పనులను 2027 మార్చి నాటికి పూర్తి చేయడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రూ.536 కోట్లతో చేపట్టిన కుడి, ఎడమ గట్ల అనుసంధాన పనులు కొనసాగుతున్నాయని చెప్పారు.కూటమి ప్రభుత్వం ముందుగా ఇచ్చిన హామీ మేరకు హంద్రీ-నీవా, వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ వంటి కీలక ప్రాజెక్టులను పూర్తి చేసి నీటిని విడుదల చేసి దశాబ్దాల కలలను సాకారం చేసిందని మంత్రి తెలిపారు. రానున్న మూడేళ్లలో రూ.35 వేల కోట్లు ఖర్చు చేసి 36 ప్రాజెక్టులను పూర్తి చేయాలనే లక్ష్యాన్ని సీఎం చంద్రబాబు నాయుడు నిర్దేశించారని చెప్పారు. వచ్చే మూడేళ్లు రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల ప్రారంభోత్సవాల పండుగలను తీసుకొస్తామని మంత్రి పేర్కొన్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారని, అందుకే ఆయనకు అపర భగీరథుడు, 'వాటర్ మ్యాన్'గా ప్రజల్లో గుర్తింపు వచ్చిందని మంత్రి నిమ్మల అన్నారు.

**పోలవరం పూర్తయితే రాష్ట్రానికి మరింత నీటి భద్రత**

పోలవరం ప్రాజెక్టు గతంలోనే పూర్తయి ఉంటే, ఎల్‌నినో వంటి క్లిష్ట పరిస్థితుల్లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 400 టీఎంసీల నీటిని వినియోగించుకుని, సాగు, తాగునీటి అవసరాలను మరింత సమర్థవంతంగా తీర్చుకునే అవకాశం ఉండేదని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పోలవరం ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితిని సృష్టించారని, నేడు సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పోలవరం పూర్తవుతుందనే భరోసా, నమ్మకాన్ని ప్రజల్లో కల్పించామని మంత్రి నిమ్మల పేర్కొన్నారు.

**ఆర్అండ్ఆర్ పనులపై ప్రత్యేక దృష్టి**

క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అధికారులు, కాంట్రాక్టు ఏజెన్సీల ప్రతినిధులతో మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు పనుల పురోగతితో పాటు ఆర్అండ్ఆర్ కాలనీల నిర్మాణం, నిర్వాసితుల పునరావాసం, పరిహారం చెల్లింపులపై సమగ్ర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, 2024 జూన్ నుంచి ఇప్పటి వరకు 10,491 ఎకరాల భూసేకరణ చేపట్టి, నిర్వాసితులకు రూ.2,250 కోట్ల పరిహారం అందించామని తెలిపారు. నిర్వాసితుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. గత ఐదేళ్ల పాలనలో ఒక్క ఎకరం భూమి కూడా సేకరించలేదని, నిర్వాసితులకు ఒక్క రూపాయి పరిహారం కూడా అందించలేదని మంత్రి విమర్శించారు. కేంద్రం నుంచి వచ్చిన రూ.3,850 కోట్ల రీయింబర్స్‌మెంట్ నిధులను సైతం పోలవరం ప్రాజెక్టు లేదా నిర్వాసితుల కోసం ఖర్చు చేయకుండా దారి మళ్లించారని ఆరోపించారు.పోలవరం స్పిల్‌వే బ్యూటిఫికేషన్‌కు సంబంధించిన డీపీఆర్‌పై ఇప్పటి వరకు ఎలాంటి అంచనాలు రూపొందించకపోవడంపై ఏజెన్సీ ప్రతినిధులపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ అభిషేక్ గౌడ, చింతూరు ఐటీడీఏ పీఓ శుభం నొక్వాల్, జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి, ఎస్ఈలు రామచంద్రరావు, ఏసుబాబు, వివిధ ఏజెన్సీల ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సిఐ శ్రీనివాసులు ను సన్మానించిన తెదేపా నేతలు

**యాడికి,సెప్టెంబర్ 17,అనంత జనశక్తి న్యూస్:**

మండల కేంద్రంలో ఉన్న పోలీస్ స్టేషన్ గురువారం సిఐ శ్రీనివాసులు ను తెదేపా నాయకులు సన్మానించారు. మండలంలో వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ఏ అవాంతరం లేకుండా ఘనంగా నిర్వహించినందుకు సిఐ శ్రీనివాసులు కు తెదేపా నాయకుడు రుద్రమ నాయుడు, నాయకులు శాలువ కప్పి , పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ సహచర పోలీసు సిబ్బంది, రెవిన్యూ అధికారులు, సచివాలయ అధికారులు, ప్రజలు అందరి సహకారంతో వినాయక చవితి ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించామని అందరికీ ధన్యవాదాలు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వెలిగండ్ల ఆది నారాయణ, టిడిపి తాలూకా తెలుగు యువత అధ్యక్షుడు తాంద్ర విక్రమ్, క్లస్టర్ ఇంచార్జ్ మాయ కుంట్ల నారాయణస్వామి, కోడూరు నీలకంఠ రెడ్డి, తెల్లాకుల వెంకటేష్, జనసేన మధు ,తదితరులు పాల్గొన్నారు.



# ప్రాంగణ నియామకాలకు స్పందన



**అనంతపురం సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**

జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఇండస్ట్రియల్ రిలేషన్స్ ప్లేస్ మెంట్ ఆద్వర్యంలో హైదరాబాద్ కు చెందిన సిఎంట్ కంపెనీ పూల్ డ్రైవ్ ను నిర్వహించారు. ఈ పూల్ డ్రైవ్ లో ఇంజినీరింగ్ కళాశాల, పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల, జే.ఎన్.టి.యు.ఎ. కలికిరి ఇంజినీరింగ్ కళాశాల ఈ అటానమస్ కళాశాలల నుండి 45 మంది విద్యార్థులు మొదటి రౌండ్ లో ఎంపిక అయినారు. తరువాత టెక్నికల్ హెచ్ఆర్ రౌండ్ నందు మొత్తం 08 మంది విధ్యార్థులను ఎంపిక చేశారని డైరెక్టర్ అఫ్ ఇండస్ట్రియల్ ప్లేస్ మెంట్ ఎస్. వసుంధర తెలిపారు. ఎంపికైన విధ్యార్థులకు కంపెనీ వారు వీరికి సంవత్సరానికి 4.2. లక్షలు గా ప్రకటించారు.

ఈ సందర్భంగా ఉపకులపతి హెచ్. సుదర్శన రావు , రిజిస్ట్రార్ ఆచార్యులు బి. దుర్గా ప్రసాద్, ఓఎస్డి ప్రొఫెసర్ ఎన్. దేవన్న , డైరెక్టర్ అఫ్ ఇండస్ట్రియల్ ప్లేస్ మెంట్ సీనియర్ ఆచార్యులు ఎస్. వసుంధర , కళాశాల ప్రిన్సిపాల్ పి. చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య బి. దిలీప్ కుమార్, కళాశాల ప్రాంగణ నియామకాల అధికారి ఆచార్య వి. బి. చిత్ర విద్యార్థులను అబినంధించారు.

# చేతివృత్తులకు ఆర్థిక భరోసా..



**- విశ్వకర్మ .. బిజెపి పట్టణ అధ్యక్షులు జింక చంద్రశేఖర్.**

**ధర్మవరం సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్:**

చేతివృత్తులకు ఆర్థిక భరోసా విశ్వకర్మ అని బిజెపి పట్టణ అధ్యక్షులు జింక చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ఆయన మాట్లాడుతూ...... చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి ఆర్థికంగా అండగా నిలిచేలా పథకాన్ని రూపొందించారని తెలిపారు. పీఎం విశ్వకర్మ పథకం ద్వారా సంప్రదాయ వృత్తులకు చెందిన వారికి నైపుణ్య శిక్షణ, ఆధునిక పనిముట్ల కోసం ప్రోత్సాహకం, మార్కెటింగ్ సహాయం, డిజిటల్ లావాదేవీలకు ప్రోత్సాహంతో పాటు రాయితీ వడ్డీతో రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు వారు తెలిపారు.ఈ పథకం కింద అర్హులైన కళాకారులకు రెండు విడతల్లో మొత్తం రూ.3 లక్షల వరకు రుణ సదుపాయం అందుబాటులో ఉందని తెలిపారు. చేతివృత్తిదారులు అధిక వడ్డీ రుణాలపై ఆధారపడకుండా సంస్థాగత రుణ సదుపాయాన్ని వినియోగించుకుని తమ వృత్తులను అభివృద్ధి చేసుకోవడానికి ఈ పథకం దోహదపడుతుందని ఆయన అన్నారు. సంప్రదాయ వృత్తులను పరిరక్షించడంతో పాటు వాటికి ఆధునిక మార్కెట్ అవకాశాలను కల్పించడమే పథకం ఉద్దేశమని పేర్కొన్నారు.
ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా దేశవ్యాప్తంగా ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయని జింక చంద్ర తెలిపారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# కుందుర్పిలో ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు



**- ప్రభుత్వ ఆసుపత్రిలో బ్రెడ్, జ్యూస్ పంపిణీ**

**కళ్యాణదుర్గం కుందుర్పి సెప్టెంబర్ 17 అనంత జనశక్తి న్యూస్**

భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం నియోజకవర్గ పరిధిలోని కుందుర్పి భారతీయ జనతా పార్టీ నాయకులు మరియు కార్యకర్తల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో జన్మదిన వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన రోగులకు, వారి బంధువులకు మరియు ప్రజలకు బ్రెడ్, జ్యూస్ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అహరహం దేశాభివృద్ధి, పేదల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. ఆయన సమర్థవంతమైన నాయకత్వంలో భారతదేశం ప్రపంచ వేదికపై అగ్రగామిగా నిలుస్తోందని, దేశ రక్షణ, ఆర్థిక వ్యవస్థ మరియు సాంకేతిక రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని పేర్కొన్నారు. సమాజంలోని చివరి వ్యక్తికి కూడా సంక్షేమ ఫలాలు అందాలనే లక్ష్యంతో అనేక సేవా పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రధాని మోడీ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, దేశానికి మరింత కాలం సేవ చేసే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆదినారాయణ హాజరుకాగా, అసెంబ్లీ కో-కన్వీనర్ కే. గంగాధర్ , సీనియర్ నాయకులు భాస్కర్ , బి. రవి , మండల ఉపాధ్యక్షుడు ఎల్. విజయ్ కుమార్ , మండల ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ , నాయకులు గోపాల్ , ఆసుపత్రి సిబ్బంది మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేయాలి

**- ఎంపీడీఓకు వైసీపీ నాయకులు వినతిపత్రం**

**కళ్యాణదుర్గం సెప్టెంబర్ 17అనంత జనశక్తి న్యూస్**



రాజకీయ పార్టీలకు అతీతంగా, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సామాజిక పింఛన్లు మంజూరు చేయాలని కళ్యాణదుర్గం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కళ్యాణదుర్గం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీఓకి వైసిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. రాజకీయ ప్రమేయం లేకుండా, కేవలం అర్హతను మాత్రమే ప్రామాణికంగా తీసుకుని పింఛన్ల పంపిణీ జరపాలి. సాంకేతిక కారణాలు, రాజకీయ ఒత్తిళ్లతో నిలిపివేసిన పింఛన్లను తక్షణమే పునరుద్ధరించాలి. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ వెంటనే పింఛన్లు మంజూరు చేయాలి. అర్హులైన పేదలకు న్యాయం జరగని పక్షంలో, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా లబ్ధిదారులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు మరియు ధర్నాలకు సిద్ధమవుతామని నాయకులు హెచ్చరించారు. పేదల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం రూరల్, బ్రహ్మసముద్రం మండలాల కన్వీనర్లు గోళ్ళ సూరి, పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి, కళ్యాణదుర్గం ఎంపీపీ ఆంజనేయులు, బ్రహ్మసముద్రం అబ్జర్వర్ బి గణేష్, ఎంపీటీసీ బలరాం, వికలాంగుల విభాగం అధ్యక్షులు కురుబ పాతలింగ, మండల ఉపాధ్యక్షులు మల్లాపురం మల్లి, యూత్ వింగ్ అధ్యక్షులు హులికల్లు మల్లి, సీనియర్ నాయకులు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత మస్తాన్ కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలి

**- అంబేద్కర్ సర్కిల్లో ఎంఆర్పిఎస్ నిరసన**

**ఆమడగూరు సెప్టెంబర్17( అనంత జనశక్తి న్యూస్ )**



అమడగూరు మండలంలోని పూలకుంటపల్లి గ్రామంలో విద్యుత్ షాక్ తో మృతి,చెందిన బాధిత మస్తాన్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మండల ఎమ్మార్పిఎస్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్లో బాధిత కుటుంబ సభ్యులు గ్రామస్తులతో కలిసి ధర్నా కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్ జిల్లా అధ్యక్షులు పలక ఆంజనేయులు జిల్లా దళిత సంఘాల అధ్యక్షులు మూలి ఎల్లంరాజు, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్, మనిటరింగ్ కమిటీ సభ్యులు కత్తి ఆనంద్, మండల ఎమ్మార్పిఎస్ అధ్యక్షులు గంగులప్ప, లు మాట్లాడుతూ ఆందోళన కారు లు బాధిత కుటుంబానికి న్యాయం చేసే వరకు ఆందోళన విరమించే ప్రసక్తి లేదని బిస్మించి, కూర్చోవడంతో ట్రాఫిక్ పూర్తిగా అంతరాయం ఏర్పడింది చివరికి తాసిల్దార్ మారుతి ప్రకాష్, సీఐ శ్రీనివాసులు, మరోసారి ఆందోళన కారులతో చర్చించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామని వారు హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు ఈ సందర్భంగా బాధ్యత కుటుంబ సభ్యులు ఎమ్మార్పిఎస్ నాయకులు మాట్లాడుతూ విద్యుత్ షాక్ తో మృతి చెందిన మస్తాన్ కుటుంబ సభ్యులకు 25 లక్షలు ఎక్స్ గ్రే,షియా ప్రభుత్వం,చెల్లించాలని అలాగే ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని 10 ఎకరాల,ప్రభుత్వం భూమి,మంజూరు చేయాలని మండల కేంద్రంలో 5 సెంట్లు ఇంటి స్థలం కేటాయించాలని చిన్నారులకు చదువు పూర్తి అయ్యే వరకు ప్రభుత్వమే ఉచితంగా కార్పొరేట్ పాఠశాలలో చదివించేందుకు ప్రభుత్వం చేయూత అందించాలని వారు డిమాండ్ చేశారు ఇందుకు స్పందించిన అధికారులు మస్తాన్ మృతికి గల కారణాలను వెలికి తీస్తామని బాధ్యులను వెంటనే అరెస్ట్ చేస్తామని ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సౌకర్యాలు, బాధిత,కుటుంబానికి అందేలా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు ఈ కార్యక్రమంలో మండల ఎమ్మార్పిఎస్ నాయకులు టైలర్ నరసింహులు, ఉత్తప్ప, సురేష్, దొడ్డప్ప, మండలంలోని, ఎమ్మార్పిఎస్ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# శ్రీ వినాయక లడ్డు 47,500కు దక్కించుకున్న మేరేపల్లి సూర్య ప్రకాష్ రెడ్డి అపర్ణ దంపతులు

**ఆమడగూరు సెప్టెంబర్17( అనంత జనశక్తి న్యూస్)**

మండల పరిధిలోని చీకురేవులపల్లి పంచాయతీ గంగిరెడ్డిపల్లి గ్రామంలో శ్రీ వినాయకుని నిమజ్జన కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు సీనియర్ పాత్రికేయులు సూర్య ప్రకాశ్ రెడ్డి అపర్ణ దంపతులు వినాయక లడ్డు వేలంపాటలో 47,500 కు లడ్డును తగ్గించుకొని గ్రామస్తులు నుండి ప్రశంసలు అందుకున్నారు అదేవిధంగా చీకరేవులపల్లి గ్రామంలో వినాయక నిమజ్జలములో భాగంగా మేరేపల్లి రాజేష్‌రెడ్డి 36,500 కు శ్రీ వినాయకుని లడ్డును తగ్గించుకున్నారు రెండు గ్రామాలలో ఒకే కుటుంబానికి చెందిన సూర్య ప్రకాష్‌రెడ్డి రాజేష్‌కుమార్ రెడ్డి లడ్డు వేలంపాటలో పాడి తగ్గించుకున్నందుకు మండలవాసులు సంతోషం వ్యక్తం చేశారు రాబోవు రోజుల్లో వినాయకుని నిమజ్జనానికి తమ వంతు విరాళాలు అందిస్తూ గ్రామస్తులతో సహకరిస్తామని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి డేగాని మార్పు రెడ్డి కృష్ణారెడ్డి వెంకటరెడ్డి సుబ్బిరెడ్డి నారాయణ అంజనప్ప రమణ తదితర గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు



# దీర్ఘకాలిక సెలవులో కళ్యాణదుర్గం మున్సిపల్ కమిషనర్

**- అనారోగ్య కారణాలతో వెళ్లిన కమిషనర్ రామకృష్ణారెడ్డి**

**- ఎన్నికల వేళ బాధ్యతలు ఎవరికో.**

**కళ్యాణదుర్గం సెప్టెంబర్ 17 అనంత జనశక్తి న్యూస్**

స్థానిక పురపాలక సంఘం కమిషనర్ రామకృష్ణారెడ్డి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. అనారోగ్య కారణాలను చూపుతూ ఉన్నతాధికారులకు సమాచారం అందించి, ఈ నెల 14వ తేదీ నుంచి అక్టోబర్ 29 వరకు ఆయన సెలవు పెట్టినట్లు మున్సిపల్ వర్గాలు వెల్లడించాయి.పురపాలక ఎన్నికల కసరత్తు ముమ్మరమవుతున్న ప్రస్తుత తరుణంలో కమిషనర్ సెలవుపై వెళ్లడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఎన్నికల ముందస్తు ప్రక్రియ, పట్టణాభివృద్ధి నిధుల మంజూరు వంటి కీలకమైన పనులపై ఇది ప్రభావం చూపే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.కమిషనర్ సుదీర్ఘ కాలం పాటు అందుబాటులో లేకపోవడంతో పాలనా



# మంత్రి అడుగు పెడితే మహర్దశే!

**- ఫిదా అవుతున్న పేద మధ్యతరగతి విద్యార్థులు.**

**- థాంక్యూ నారాయణ సార్ అంటూ కృతజ్ఞతలు.**

**- కేపీసీ కళాశాలలో విద్యార్థులతో రెండు గంటల పాటు మంత్రి నారాయణ ముఖాముఖి.**

**- విద్యార్థుల కోరికలకు రెక్కలు.**

**- అక్కడికక్కడే సమస్యలకు పరిష్కారం.**

**నెల్లూరు సెప్టెంబర్ 17 అనంత జనశక్తి న్యూస్**



మంత్రి నారాయణ అడుగు పెడితే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్న నమ్మకం విద్యార్థుల్లో వ్యక్తమైంది. అడిగిన వెంటనే అక్కడికక్కడే పరిష్కరిచేయటంతో వాళ్ల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.
నెల్లూరు సిటీ స్టోన్‌హౌస్‌పేటలోని కేపీసీ కళాశాలలో నిర్వహించిన యువత భవితకు భరోసా కార్యక్రమంలో మంత్రి నారాయణ
పాల్గొని విద్యార్థులతో రెండు గంటల పాటు ముఖాముఖి నిర్వహించారు.
ఈ సందర్భంగా విద్యార్థుల నుంచి కళాశాలలోని సమస్యలు, మౌలిక వసతులపై మంత్రి నేరుగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కోరిన పలు సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపడంతో పాటు, అవసరమైన మరిన్ని సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**15 రోజుల్లో 40 కంప్యూటర్స్ తో ల్యాబ్**

కేపీసీ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ తెలిపారు. 15 రోజుల్లో 40 కంప్యూటర్లతో ల్యాబ్,14 డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేసి, డైనింగ్ హాల్‌ను కూడా అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.
ఎన్టీఆర్ సుజల ద్వారా విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామని, క్రీడల కోసం నెలరోజుల్లో స్పోర్ట్స్ కోర్టులు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. తరగతి గదులు, టాయిలెట్లను ఆధునీకరిస్తామని తెలిపారు.

**850 మంది విద్యార్థులకు ఉచిత సైకిళ్లు**

కేపీసీ, వీఆర్‌సీ కళాశాలల్లో ఇంటర్ చదువుతున్న సుమారు 850 మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు. పేద విద్యార్థుల విద్యకు అండగా ఉండాలనే ఉద్దేశంతో తన వంతు సహాయం చేస్తున్నానని తెలిపారు.పేద పిల్లలకు అండగా ఉండటానికి తాను చేయాల్సిందంతా చేస్తున్నానని . తన సన్నిహితుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు.కార్పొరేషన్ పరిధిలోని 23 ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

**విద్యార్థుల సమస్యలపై సమీక్ష**

అనంతరం కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. కళాశాలలో విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలపై ఆరా తీశారు. సమస్యలను దశల వారీగా పరిష్కరించి విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించాలని అధికారులను ఆదేశించారు.
విద్యార్థుల సమస్యలను ఓపికగా విని, అడిగిన వెంటనే సదుపాయాల కల్పనకు హామీలు ఇవ్వడంతో మంత్రి నారాయణ ఔదార్యంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.థాంక్యూ నారాయణ సార్ గారు అంటూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



# అసిఫ్ ఆధ్వర్యంలో అన్నదానం

**అనంతపురం, సెప్టెంబర్ 17 :**

**అనంత జనశక్తి న్యూస్**

**వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం నగర ఉపాధ్యక్షులు, 1వ డివిజన్ నాయకులు ఆలూరు మహమ్మద్ ఆసిఫ్ ఆధ్వర్యంలో నగరంలోని 1వ డివిజన్ పరిధిలోని ఎర్రనేల కొట్టాలలోని మున్సిపల్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో దాదాపు 250 మందికి పైగా భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మహ్మద్ ఆసిఫ్ మాట్లాడుతూ.. హిందూ ముస్లింలకు ఒక్కటేనని నిరూపించే మొహర్రం పండుగ ఒకటైతే.. వినాయక చవితి పండుగ మరొకటన్నారు. కుల మతాలకతీతంగా వినాయక చవితి పండుగను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. విఘ్నాలు తొలిగి ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆది గురువు వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.**

# పోలవరం ప్రాజెక్ట్ వద్ద ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు

**- ఆశీర్వాద దీపం' కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు**

**ఏలూరు సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**



ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా పోలవరం ప్రాజెక్ట్ వద్ద జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో పాటు పోలవరం ప్రాజెక్ట్ వద్ద పనిచేస్తున్న ఇంజనీర్లు, అధికారులు, సిబ్బందితో కలిసి 'ఆశీర్వాద దీపం' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం రాష్ట్రానికి, దేశానికి అత్యంత కీలకమైనదని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో, ప్రధాని నరేంద్ర మోదీ మరియు కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం ప్రాజెక్ట్ పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయని చెప్పారు.గత పాలకుల హయాంలో పోలవరం ప్రాజెక్ట్ పూర్తవుతుందో లేదో అనే ప్రశ్నార్థక పరిస్థితులు నెలకొన్నాయని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రాజెక్ట్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ అందిస్తున్న సహకారం, కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న నిధులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతర పర్యవేక్షణతో పోలవరం పనుల్లో వేగం పెరిగిందని మంత్రి అన్నారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి జాతికి అంకితం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పోలవరం ప్రాజెక్ట్ వద్ద జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. దేశాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ప్రధాని నరేంద్ర మోదీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని పోలవరం ప్రాజెక్ట్ వద్ద నిర్వహించిన 'ఆశీర్వాద దీపం' కార్యక్రమంలో ప్రార్థిస్తున్నామని మంత్రి తెలిపారు. ఆయన నాయకత్వంలో భారతదేశం మరింత శక్తివంతమైన, అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని ఆకాంక్షించారు.2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించాలనే ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచనలకు అనుగుణంగా దేశం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆకాంక్షించారు.

# కొన్ని విబేధాలు కనిపించినా.. వెంటనే సమిసిపోయాయి



(మొదటి పేజీ తరువాయి)

ఇదే అంశంపై గతంలోనూ లోకేష్ కూటమి మూడు పర్యాయాలు కలిసి పోటీ చేస్తామని పేర్కొన్నారు..

కూటమి పార్టీల అధినేతలుగా తమ మధ్య ఎలాంటి సందేహాలు లేవని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు.. ఏదైనా విషయంలో తనకు సందేహం వస్తే జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు నేరుగా ఫోన్ చేసి మాట్లాడతానని చెప్పారు. పార్టీల మధ్య చిన్నచిన్న సమస్యలు ఉన్నా కూర్చుని చర్చించుకుని పరిష్కరించుకుంటామని స్పష్టం చేశారు. "నో క్రాస్‌ఫైర్, నో మిస్‌ఫైర్, విడాకులు ఉండవు" అంటూ కూటమి కొనసాగింపుపై తన అభిప్రాయాన్ని లోకేష్ వ్యక్తం చేశారు. కూటమి భాగస్వాముల మధ్య సమన్వయం విషయంలో స్పష్టత ఉందని తెలిపారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించాలంటే కూటమి పార్టీలు మరో మూడు దఫాలు కలిసి పోటీ చేయాల్సిన అవసరం ఉందని లోకేష్ పేర్కొన్నారు. దీనిపై తమకు స్పష్టమైన అవగాహన ఉందని, కూటమి పార్టీల మధ్య కోఆర్డినేషన్ బాగుందని అన్నారు. నెల్లూరులో పార్టీ కార్యకర్తల సమావేశంలోనూ లోకేష్ కూటమి కొనసాగింపుపై మాట్లాడారు. ఇక, 2029 ఎన్నికల్లోనూ కూటమి ప్రభుత్వం కలిసి పోటీ చేస్తుందని స్పష్టం చేశారు.. ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని, ఎన్నికల్లో గెలిస్తేనే ప్రజలకు మరింత సేవ చేయగలమని సూచించారు.. రాష్ట్రంలో ఏ ఎన్నికలు జరిగినా ఎన్డీఏ జెండా ఎగరాలని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టీడీపీ నూటికి నూరు శాతం విజయం సాధించేలా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు మంత్రి నారా లోకేష్..

# నరేంద్ర మోడీ ప్రజాప్రయాణం అద్భుతం అద్వితీయం

**- ప్రజా జీవితంలో 25 ఏళ్లు కొనసాగడం ప్రపంచ స్థాయి రికార్డు**

**- మంగినపూడి సముద్రతీరంలో ఆశీర్వాద్ కా దియా కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర**

**మచిలీపట్నం సెప్టెంబర్ 17 అనంత జనశక్తి న్యూస్**



ఆధునిక భారతదేశ చరిత్రను ప్రపంచ స్థాయిలో నిలిపిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారిదేనని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నం మంగినపూడి సముద్ర తీరంలో ఏర్పాటు చేసిన సాగర తీర మహా గణపతి నవరాత్రి ఉత్సవాల ప్రాంగణంలో "సేవా సంకల్ప్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా ఆశీర్వాద్ కా దియా నిర్వహించారు.ఆర్ఎస్ఎస్ ప్రతినిధి మధుకర్ , బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీరామ్ , ప్రసాద్ , గజేంద్ర , బాలాజీ పలువురు బీజేపీ నాయకులతో కలిసి నరేంద్ర మోడీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆ విఘ్నాధిపతి ఆశీస్సులు ఎల్లప్పుడూ నరేంద్ర మోడీకి ఉండాలనే లక్ష్యంతో ఆ వినాయకుని సమక్షంలో పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. 25 సంవత్సరాల రాజకీయ ప్రస్థానంలో సుమారు 13 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా, 12 సంవత్సరాలు దేశ ప్రధానిగా కొనసాగడం ఒక చరిత్ర. గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేసి గుజరాత్ రాష్ట్రాన్ని అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలిపారు. ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచి ఇండియా నెంబర్ వన్ నినాదంతో పని చేసే ఈరోజు ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా మార్చారు.దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న బాబ్రీ మసీద్.. అయోధ్య రామ మందిర్ ఘటనకు పరిష్కారం చూపారు. ఆర్టికల్ 370 రద్దుచేసి కాశ్మీర్లో శాంతిని నెలకొల్పారు. కరోనా సమయంలో నరేంద్ర మోడీ చూపిన చొరవ అద్వితీయం. ఆ మహా గణపతి ఆశీర్వాదంతో నరేంద్ర మోడీ మరింతకాలం ప్రధానిగా కొనసాగాలని దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# కాకినాడ జిల్లాలో రోడ్డు ప్రమాదం

**30 మందికి తీవ్ర గాయాలు**

**పెళ్లి వేడుక ముగించుకుని వెళ్తుండగా ఘటన**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**

కాకినాడ జిల్లా తుని మండలం రాజుల కొత్తూరు సమీపంలోని జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం తృటిలో తప్పింది. తుని నుంచి ఉప్పాడకు పెళ్లి వేడుక ముగించుకుని సుమారు 30 మంది బంధువులతో వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును వెనుక నుంచి వేగంగా వచ్చిన ఒక లారీ ఢీకొట్టింది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

పెళ్లి బృందం ప్రయాణిస్తున్న బస్సు జాతీయ రహదారిపై వెళ్తుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. లారీ అకస్మాత్తుగా బస్సును ఢీకొనడంతో ఒక్కసారిగా ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే.. బస్సు డ్రైవర్ అత్యంత అప్రమత్తంగా వ్యవహరించి సమయస్ఫూర్తితో బస్సును అదుపులోకి తీసుకున్నారు. దీనివల్ల బస్సు బోల్తా పడకుండా నివారించబడటంతో, బస్సులో ప్రయాణిస్తున్న ముప్పై మంది పెళ్లి బృందానికి పెను ప్రమాదం తప్పింది.

అయినప్పటికీ, ఈ ఊహించని పరిణామంలో బస్సులో ఉన్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను వెంటనే మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వారికి వైద్యులు తక్షణ చికిత్స అందించారు. 30 మందిలో కొందరికి కేవలం స్వల్ప గాయాలు మాత్రమే కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఈ ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు వెంటనే రంగప్రవేశం చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. దెబ్బతిన్న వాహనాలను రోడ్డుపై నుంచి తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న తుని రూరల్ పోలీసులు లారీ డ్రైవర్ నిర్లక్ష్యంపై దర్యాప్తు ప్రారంభించారు. పెళ్లి వేడుక ఆనందంగా ముగించుకుని తిరిగి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరగడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. డ్రైవర్ చూపిన తెగువ వల్లే ప్రాణాపాయం తప్పిందని స్థానికులు కొనియాడారు. రాత్రి వేళల్లో జాతీయ రహదారులపై వాహనదారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, వేగ నియంత్రణ పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన దృష్టి

**- మంత్రి కందుల దుర్గేష్**

**రాజమహేంద్రవరం సెప్టెంబర్ 17**

**అనంత జనశక్తి న్యూస్**



క్షేత్రస్థాయిలో పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయాన్ని ఖాయం చేయడమే లక్ష్యంగా జనసేన పార్టీ సమన్వయ సమావేశం రాజమహేంద్రవరంలోని 'వీ కన్వెన్షన్ హాల్'లో గురువారం వైభవంగా జరిగింది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... రాష్ట్రంలో పంచాయతీలు, కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించడం ద్వారానే ఆర్థిక సంఘం నిధులు మంజూరవుతాయని, తద్వారా స్థానిక సంస్థల అభివృద్ధి ముమ్మరమవుతుందనే ఆలోచనతో సీఎం నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందని స్పష్టం చేశారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో జనసేన పార్టీ సంస్థాగతంగా ఎంతో బలంగా ఉందన్నారు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేనకు 23 వేల ఓట్లు దక్కాయని, '

ఓటర్లు స్వచ్ఛందంగా జనసేనకు ఓటు వేశారని, దాన్ని బట్టి పార్టీ బలం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. 2021 ఎన్నికల్లో వైకాపా ఎన్ని ప్రలోభాలు పెట్టినా జనసేన నేతలు వెనక్కి తగ్గలేదని, "మేము జనసేన జెండాను వదిలే ప్రసక్తే లేదు" అని తెగేసి చెప్పడం మన పార్టీ నాయకుల నిజాయితీకి, కట్టుబాటుకు నిదర్శనమని అభినందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక జనసేన మరింత బలోపేతమైందని, కూటమి ధర్మాన్ని పాటిస్తూనే అన్ని స్థానాల్లో విజయం సాధించేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. సీట్ల పంపకాలు, అభ్యర్థుల ఎంపికపై జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, సీఎం చంద్రబాబు నాయుడు సంయుక్తంగా చర్చించి నిర్ణయం తీసుకుంటారని, ఆ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని సూచించారు.రాజమహేంద్రవరం మేయర్ స్థానంతో పాటు రూరల్, సిటీ పరిధిలోని పలు వార్డుల్లో జనసేన విజయావకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు.జనసేన పార్టీ సిద్ధాంతాలను నమ్మి ఎవరైనా ముందుకు వస్తే వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించి, పార్టీని మరింత బలోపేతం చేయాలని దిశా నిర్దేశం చేశారు. ముందుగా కాకినాడ,

రాజమహేంద్రవరం జనసేన కోఆర్డినేటర్ చినబాబు క్షేత్రస్థాయిలో పార్టీకి పట్టున్న స్థానాలపై రూపొందించిన సమగ్ర నివేదికపై సుదీర్ఘంగా చర్చించారు. ఏది ఏమైనా రాబోయే స్థానిక పోరుకు జనసేన పార్టీ పూర్తి సంసిద్ధంగా ఉండాలని శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన నేతలు గంటా స్వరూప, టీవీ రామారావు, రావడ నాగులు,అత్తి సత్యనారాయణ, సపోర్ట్ టీమ్ ప్రతినిధి యడ్ల మహేష్, పెద్ద సంఖ్యలో వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

# రామ మందిర తీర్పుతో బాధపడ్డా

**- షారుఖ్, సల్మాన్‌లకు క్షమాపణలు**

**- స్వరా భాస్కర్ మరో వివాదం**

**- తీర్పు తర్వాత తన ముస్లిం స్నేహితులకు మెసేజ్ చేశానని వ్యాఖ్య ఒక హిందువుగా తాను క్షమాపణ చెప్పాలనుకున్న**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**

**వివాదాలు, హిందూ వ్యతిరేకతకు కేరాఫ్‌గా ఉన్న బాలీవుడ్ నటి స్వరా భాస్కర్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అయోధ్య రామమందిర నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నట్లు మాట్లాడిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 2019లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో తాను బాధపడ్డానని, తీర్పు వెలువడిన తర్వాత తన ముస్లిం స్నేహితులకు మెసేజ్‌లు చేసి క్షమాపణలు చెప్పినట్లు ఆమె వెల్లడించారు.**

**"రామ జన్మభూమి తీర్పు వచ్చినప్పుడు నేను చాలా బాధపడ్డాను. నాకు ఎంత కోపం వచ్చిందంటే, ఇది ఇలాంటి దేశమా అని ఆశ్చర్యపోయా. ఆ నిర్ణయం నాకు అన్యాయం అనిపించింది. నా ఫోన్ లో ఉన్న ప్రతీ ముస్లింకు మెసేజ్ చేశా. సల్మాన్ ఖాన్, షారూఖ్ ఖాశన్, అమీర్ ఖాన్, ఫహద్ అహ్మద్ ఇలా అందరికీ క్షమాపణలు చెప్పాను. ఒక హిందువుగా, నాకు తెలిసిన ముస్లింలందరికీ నేను క్షమాపణలు చెప్పాలనుకున్నా. సుప్రీంకోర్టు తీర్పుతో నేను సిగ్గుపడ్డాను. ఆ తీర్పుతో నేను ఏకీభవించను" అని స్వరా భాస్కర్ చెప్పింది.**

**స్వరా భాస్కర్ వ్యాఖ్యలు ఇంటర్నెట్‌లో వైరల్ అయిన వెంటనే ఆమెపై ట్రోలింగ్ మొదలైంది. చాలా మంది ఆ వ్యక్తికి చరిత్ర తెలియదా.? అని ప్రశ్నించారు. "జై శ్రీరామ్" అంటూ కామెంట్ చేశారు. పాడ్‌కాస్ట్‌లకు స్వరాను ఎందుకు పిలుస్తున్నారని మరికొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫహాద్‌తో ఆమె పెళ్లిని కూడా ప్రజలు ట్రోల్ చేశారు. 2019లో, వివాదాస్పదమైన 2.77 ఎకరాల భూమిని రామ మందిర నిర్మాణానికి ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును వ్యతిరేకిస్తున్న ఆమెపై కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టాలని మరికొందరు డిమాండ్ చేశారు.**

# మమ్మల్ని బలవంతం చేయకండి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**




మణిపూర్ రాష్ట్రంలోని సహాయ శిబిరాల్లో చోటుచేసుకుంటున్న అనుమానాస్పద మరణాలు, లైంగిక వేధింపుల ఆరోపణలపై అత్యున్నత న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. శిబిరాల్లో నివాసం ఉంటున్న శరణార్థుల భద్రత, ఆత్మగౌరవంపై తీవ్ర ప్రశ్నలు గుప్పించిన సుప్రీం కోర్టు.. మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. 25 అనుమానాస్పద మరణాలకు సంబంధించిన పోస్టుమార్టం నివేదికలతో పాటు మరణానికి గల కారణాలను వివరిస్తూ సమగ్ర నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది.

**రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీం తీవ్ర హెచ్చరిక**

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం 2023 మణిపూర్ జాతి ఘర్షణలకు సంబంధించిన లైంగిక హింస కేసుల విచారణపై దాఖలైన పిటిషన్లను గురువారం విచారించింది. జమ్మూ కశ్మీర్ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ గీతా మిత్తల్ కమిటీ సమర్పించిన నివేదికను ఉటంకిస్తూ.. ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. జులై 4వ తేదీన కమిటీ అడిగిన సమాచారాన్ని ఇప్పటి వరకు ఎందుకు ఇవ్వలేదని అడ్వకేట్ జనరల్‌ను ప్రశ్నించింది. "ఆదేశాలు జారీ చేసేలా కోర్టును బలవంతం చేయవద్దని మీ చీఫ్ సెక్రటరీకి చెప్పండి. తీసుకున్న చర్యలేమిటో వెంటనే వివరించండి" అని సర్వోన్నత న్యాయస్థానం కఠిన పదజాలంతో హెచ్చరించింది.

**640 మరణాలు.. కేవలం 20 పోస్టుమార్టాలేనా?**

కోర్టు ఆదేశాల్లో నమోదైన వివరాల ప్రకారం.. ఎనిమిది జిల్లాల్లోని సహాయ శిబిరాల్లో ఏకంగా 640 మరణాలు నమోదు అయ్యాయి. క్రిమినల్ కేసులు నమోదు అయినప్పటికీ కేవలం 20 కేసుల్లోనే పోస్టుమార్టం నిర్వహించడంపై ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. మిగిలిన మరణాలకు పోస్టుమార్టం ఎందుకు చేయలేదని, అలాగే మృతుల కుటుంబాలకు కేవలం రూ. 20,000 నుంచి రూ. 30,000 మాత్రమే పరిహారంగా ఎందుకు ఇచ్చారని నిలదీసింది. అన్ని అనుమానాస్పద మరణాలపై తక్షణమే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి సరిగ్గా విచారణ జరిగేలా చూడాలని 'మణిపూర్ లీగల్ సర్వీసెస్ అథారిటీ'ని ఆదేశించింది.

ఈ విచారణ సందర్భంగా అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కోర్టుకు కీలక విషయాలు తెలిపారు. ఎనిమిది జిల్లాల్లో 42 ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. మొత్తం 3,020 కేసులు విచారణలో ఉండగా.. 302 కేసుల్లో చార్జిషీట్లు, 1,583 కేసుల్లో క్లోజర్ రిపోర్టులు దాఖలు చేశామని పేర్కొన్నారు. మరో 1,135 కేసుల్లో విచారణ కొనసాగుతుండగా.. 33 కేసుల్లో ట్రయల్స్ ప్రారంభం అయ్యాయని చెప్పారు. అయితే గ్వాహాటిలోని ప్రత్యేక కోర్టు వారానికి రెండు రోజులు మాత్రమే కేసులను విచారిస్తోందని బాధితుల న్యాయవాది తెలపగా.. విచారణను వేగవంతం చేసేందుకు సీబీఐ కేసుల కోసం మరో రెండు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది.

# పెయింట్ వేసుకునే నువ్వు!

(మొదటి పేజీ తరువాయి)

ఆరు గ్యారంటీలు అమలు అయ్యాయని మభ్యపెట్టే దాంట్లో ఎంత నిజం ఉందో, రేవంత్ రెడ్డి నిన్న మాట్లాడిన మాటల్లో కూడా అంతే నిజముందని ఎద్దేవా చేశారు.

కేసీఆర్ ఇల్లు రెండు ఎకరాల్లో ఉండేది

కేసీఆర్ పుట్టినప్పుడే ఆయన ఇల్లు రెండు ఎకరాల్లో ఉండేది. కేసీఆర్ తండ్రికి వందల ఎకరాల భూమి ఉండేది. చింతమడకలో ఉన్న రెండెకరాల ఇంటిని కూడా ప్రభుత్వ పాఠశాలకు కేసీఆర్ రాసిచ్చారని గుర్తు చేశారు. గోడల మీద పెయింట్ వేసుకునే నీకు జూబ్లీహిల్స్‌లో ప్యాలెస్ ఉండొచ్చు కానీ.. కేసీఆర్‌కు వ్యవసాయం చేసుకోవడానికి భూమి ఉండొద్దా అని ప్రశ్నించారు. కేసీఆర్‌కు మొదటినుండే వందల ఎకరాలు ఉన్నాయి. కేసీఆర్ దొర అంటావా, లేక ఈ మధ్య సంపాదించు కున్నాడు అంటావా? ఏదో ఒకటి ఫిక్స్ అవ్వు రేవంత్ రెడ్డి అని సూచించారు. నేను అమెరికాలో ఆరున్నర సంవత్సరాలు ఉద్యోగం చేసి సంపాదించుకున్నాను. నువ్వు ఏమీ చేసి సంపాదించావు రేవంత్ రెడ్డి? అని నిలదీశారు.

నీకు బుద్ధి, జ్ఞానం ఉందా?

రేవంత్ రెడ్డి 7 ఏండ్లు డిగ్రీ చదివిండు అని ఎద్దేవా చేశారు. కొండల్ రావు అని కూకట్‌పల్లిలో ఒక పెద్దాయన ఉంటే ఆయన ఆస్తులు కూడా మా దాంట్లో రేవంత్ రెడ్డి వేసేశాడు. ఆయనకి మాకు చుట్టరికం కూడా లేదు.. కేవలం వెలమ కులం అంతే. కేసీఆర్ అక్కాచెల్లెలు, అన్నతమ్ముళ్ల సంతానం 300 మంది ఉంటారు. వాళ్ల ఆస్తులు కూడా మా ఖాతాలో కలిపెయ్.సంతోష్ రావుకి మాకు చుట్టరికం ఉంటే ఆయన ఆస్తులు కూడా కేసీఆర్ ఖాతాలో వేస్తావా? నీ అన్నతమ్ముళ్ల వాళ్ల పిల్లల ఆస్తులు నీ ఖాతాలో వేస్తే ఎలా ఉంటుంది? అని నిలదీశారు. నవీన్ రావుకి, కొండల్ రావుకి మాకు ఏం సంబంధం? నీకు బుద్ధి జ్ఞానం ఉందా అని ప్రశ్నించారు.

రాజిరెడ్డిని 14 రోజులు జైలులో పెట్టిండు.

కేటీఆర్‌కు అండగా ఉన్నడని చెప్పి అబ్బాడి అనిల్ రెడ్డికి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక సీఎం రేవంత్ రెడ్డి అరెస్ట్ చేసే ప్రయత్నం చేసిండని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. అబ్బాడి అనిల్ రెడ్డి అనే తమ్ముడు మా పార్టీలో పనిచేస్తడు. రెడ్లకులంలో పుట్టిండు.. మా పార్టే నేను కాదంటలేను. కానీ పేదవాడు ఆస్తిపాస్తులు పెద్దగా ఏం లేవు. అయితే ఇదెప్పుడు ఏండ్లుగా వాళ్లు సాగుచేసుకుంటున్న భూమిని రెండెకరాలు ఎప్పటి నుంచో మోఖాలో ఉన్నడని చెప్పి అధికారులు పంచనామా చేసి పట్టా ఇచ్చిర్రు. ఈ పిలగాడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉన్నడు.. బీఆర్ఎస్ పార్టీలో తిరుగుతున్నడు కేటీఆర్‌కు అండగా ఉన్నడని చెప్పి ఈయనను కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక అరెస్ట్ చేసే ప్రయత్నం చేసిండన్నారు.

అనిల్ రెడ్డి దొరకకపోతే ఈయన బాబాయి అబ్బాడి రాజిరెడ్డి.. ఆయనకు పాపం గుండె జబ్బుంది. ఆ రాజిరెడ్డి పేద కుటుంబం.. 30 గుంటలు పట్టా.. నా మీద కోపంతో ఆయనను తీసుకెళ్లి 14 రోజులు జైలులో పెట్టిండని కేటీఆర్ మండిపడ్డారు. ఎంత దిగజారుడు రాజకీయమంటే బొల్లి రామ్మోహన్ అని మా నాయకుడు ఒకాయన ఉన్నడు.. ఆయనేదో కబ్జా పెట్టిండని ముఖ్యమంత్రి ఆరోపణ చేస్తడు.. ఈ రామ్మోహన్‌కు నేను ఫోన్ చేసిన.. ఏందయ్యా ముఖ్యమంత్రి ఏం మాట్లాడుతున్నడంటే.. ఆయన స్పష్టంగా చెప్పిండు.. 2007లో అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వముంది.. డాక్యుమెంట్ నంబర్ 7289 2007లో డిసెంబర్ 12న ఈ రామ్మోహన్ అనే వ్యక్తి కొనుగోలు చేసి అప్పుడు రిజిస్టర్ చేసుకున్నడు. మా ప్రభుత్వం వచ్చినంక ఏం జరుగలేదు. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన భూమిని ఆక్రమిత భూమి, కబ్జా భూమి అని అంటున్నడు.. ముఖ్యమంత్రికి తెలివితక్కువోడు ఎవడో చెప్పినట్టున్నడన్నారు.

# మనం 2026లో ఉన్నాం.. 'బోనాల' వివాదంపై మరోసారి స్పందించిన నటి

బోనాల సమయంలో తాను ఎదుర్కొన్న విమర్శల గురించి నటి ఫరియా అబ్దుల్లా మరోసారి స్పందించారు. ఆమె తాజా చిత్రం 'సిగ్మా' విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఈ విషయం గురించి మాట్లాడారు. సోషల్ మీడియాలో ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయన్నారు.

"ఇటీవల సోషల్ మీడియాలో నాపై ఎన్నో విమర్శలు వచ్చాయి. అదే వేదికగా నేను కూడా ఆ వివాదంపై నా అభిప్రాయాన్ని తెలియజేశాను. అయితే, ఒక విషయం మాత్రం నన్ను వెంటాడింది. మనం 2026లో జీవిస్తున్నాం. కానీ, ఇంకా చాలామంది పాతకాలం వాళ్లలా ఆలోచిస్తున్నారు. ఆ సమయంలో కొందరి భావజాలం బాధించింది. నేనెప్పుడూ అభ్యుదయ భావాలతో ఆలోచిస్తాను. నా పద్ధతులు నచ్చిన వాళ్లు అనుసరిస్తారు. నచ్చని వాళ్లు విమర్శిస్తారు. ఎవరి అభిప్రాయాలు వాళ్లకు ఉంటాయి. అందరి ఆలోచనలను నేను గౌరవిస్తాను" అని చెప్పారు.

ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన బోనాల సందడిలో ఫరియా అబ్దుల్లా.. పోతురాజుతో కలిసి నృత్యం చేశారు. ఆమె ఈ పండగ చేసుకోవడంపై కొందరు మతం పేరుతో విమర్శించారు. వీటిని ఖండించిన ఫరియా సోషల్ మీడియా వేదికగా నాడు వీడియో విడుదల చేశారు. తాను అంతటా భగవంతుడిని చూస్తానని అన్నారు.

ఇక, సిగ్మా విషయానికొస్తే.. తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రముఖ కథానాయకుడు విజయ్ కుమారుడైన జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న చిత్రమిది.



సందీప్‌కిషన్ కథానాయకుడిగా నటించిన ఈ సినిమా అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# మనకు మనమే శత్రువులం: శోభితా ధూళిపాళ్ల

మనం ఎదుగుతుంటే పక్కవారు చూడలేరంటూ ఓ ఇన్‌ఫ్లూయెన్సర్ పెట్టిన పోస్ట్‌కు నటి శోభితా ధూళిపాళ్ల మద్దతు తెలిపారు. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే శోభితా.. తాజాగా ఒక పోస్ట్‌కు ఇచ్చిన రిప్లై వైరల్ అవుతోంది. 'మనకు మనమే శత్రువులం' అని తెలుగు వాళ్లను ఉద్దేశించి పెట్టిన వీడియోకు.. ఈ నటి 100 శాతం కరెక్ట్ అంటూ ఎమోజీతో రిప్లై పెట్టారు. ఈ సందర్భంగా తాను ఇండస్ట్రీకి రావాలనుకున్న రోజులను, అప్పుడు తనకు ఎదురైన అనుభవాలను శోభిత పంచుకున్నారు.

'16 ఏళ్ల వయసులోనే నా బ్యాగులు సర్దుకుని ముంబయికి వెళ్లిపోయా. నేను కచ్చితంగా ఈ రంగంలో రాణిస్తాననే నమ్మకం లేదు. అయినా.. ధైర్యంగా అడుగు ముందుకు వేశా. ఎందుకంటే మన సమాజంలో చాలా వరకూ కలలు కనేవారిని, ముఖ్యంగా కొత్తరంగంలోకి అడుగుపెట్టాలనుకునే వారిని ప్రోత్సహించరు. మనం కొత్తగా ఏదైనా పని మొదలు పెడితే.. అప్పటికే ఆ రంగంలో ఉన్నవాళ్లు మనకు మద్దతు ఇవ్వరు. ఈ విషయం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. ఇక, ఇలాంటి నూతన అడుగు వేసేది మహిళ అయితే.. ప్రతికూల పరిస్థితులు రెట్టింపు అవుతాయి" అని శోభిత తన రిప్లైలో రాసుకొచ్చారు.

అయితే.. ఇదంతా ఒకప్పటి పరిస్థితి అని శోభిత స్పష్టం చేశారు. "ఇది చాలా కాలం క్రితం జరిగింది. ఇప్పుడు పరిస్థితులు మారాయని ఆశిస్తున్నా. మన సమాజంలో అందరూ ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ ముందుకు సాగాలి. ఇతరులపై ఆధారపడకుండా మీ కోసం మీరు నిలబడేంత మానసిక బలాన్ని పెంపొందించుకోవాలి" అని సూచించారు. 2016లో ఓ హిందీ సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన



శోభితా.. గూఢచారి సినిమాలో సమీరాగా మెప్పించారు. మేజర్, పొన్నియన్ సెల్వన్‌లలో నటించారు. ఒకవైపు సినిమాలు చేస్తూనే వెబ్ సిరీస్‌లతో ఆకట్టుకుంటున్నారు.



# నిస్వార్థ ప్రేమకు 20ఏళ్ల వేడుక

ప్రముఖ నటులు జ్యోతిక, సూర్య తమ 20ఏళ్ల వివాహ వార్షికోత్సవాన్ని ఇటీవల ఘనంగా చేసుకున్నారు. ఈ జంట మరోసారి కుటుంబ సభ్యులు, సన్నిహిత మిత్రుల సమక్షంలో క్రైస్తవ మత పద్ధతిలో పెళ్లి చేసుకుని... తమ వివాహం నాటి ప్రమాణాలను పునరుద్ధరించుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఇన్‌స్టాలో పంచుకుంటూ ఈ జోడీ.. "ది సీక్వెల్- మా 20ఏళ్ల ప్రేమ, యుద్ధానికి గుర్తుగా ప్రమాణాలను పునరుద్ధరించుకునే వేడుక. ఇది పరిపూర్ణమైన వివాహాన్ని చేసుకునే వేడుక మాత్రమే కాదు.. త్యాగాలు, సర్దుబాట్లు, నిస్వార్థంగా ఒకరినొకరు ప్రేమించుకునేందుకు చేసుకునే వేడుక. ఒకరికోసం మరొకరు మారిన వ్యక్తిత్వాలకు ప్రతీకగా చేసుకునే వేడుక"అనే క్యాప్షన్‌ని జోడించారు. 2006 సెప్టెంబరు 11న సూర్య, జ్యోతికల వివాహం జరిగింది.

# 'సిగ్మా'.. నా పాత్రకు జాసన్ సంజయ్ డబ్బింగ్ చెప్పారు



కోలీవుడ్ అగ్రకథానాయకుడు, తమిళనాడు సీఎం విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న సినిమా 'సిగ్మా' . సందీప్ కిషన్ హీరోగా రూపొందిన ఈ మూవీ అక్టోబరు 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సందీప్ కిషన్ మాట్లాడారు. సిగ్మా మూవీలో తన పాత్రకు జాసన్ సంజయ్ డబ్బింగ్ చెప్పినట్లు వెల్లడించారు.

" నేను సాధారణంగా ఒకేసారి రెండు, మూడు చిత్రాలు చేయను. ఒకటి పూర్తయ్యాకే మరొకటి చేస్తాను. 'సిగ్మా' షూటింగ్ పూర్తి కాగానే మరో మూవీకి సంబంధించిన పనుల్లో బిజీ అయిపోయాను. దానివల్ల డబ్బింగ్ సమయానికి అందుబాటులో లేను. దీంతో ఫస్ట్ డ్రాఫ్ట్‌లో నా క్యారెక్టర్‌కు జాసన్ సంజయ్ డబ్బింగ్ చెప్పారు. కెమెరా ముందు నేను మాట్లాడే విధానం, నా వాయిస్ మాడ్యులేషన్ కాస్త భిన్నంగా ఉంటుంది. సంజయ్ నా గొంతును అద్భుతంగా దించేశారు. సినిమా విడుదలైన తర్వాత సంజయ్ డబ్బింగ్ చెప్పిన ఆ వెర్షన్‌ను కూడా ప్రేక్షకులతో పంచుకుందామని నేను ఆయనకి చెప్పా" అని సందీప్ కిషన్ తెలిపారు. ఇక, ఈ సినిమాలో ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటించగా.. రాజు సుందరం, సంపత్ రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. తమన్ సంగీతమందించారు.

# నటితో ఎంగేజ్‌మెంట్ క్యాన్సిల్.. ఇన్‌స్టా మొత్తం క్లీన్ చేసిన పృథ్వీషా







భారత యువ క్రికెటర్ పృథ్వీ షా మరోసారి వార్తల్లో నిలిచాడు. నటి ఆకృతి అగర్వాల్‌తో అతడి నిశ్చితార్థం రద్దయ్యింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ ఆకృతి ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టింది. మరోవైపు, ఆమె ఈ పోస్ట్ పెట్టిన కాసేపటికే పృథ్వీషా .. తన ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపు మొత్తం పోస్టులను తొలగించడం గమనార్హం. టాలీవుడ్ నటి ఆకృతి అగర్వాల్‌తో మార్చి 8న పృథ్వీ షా ఎంగేజ్‌మెంట్ జరిగింది. అందుకు సంబంధించిన ఫొటోలు వీరిద్దరూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అయితే, ఈ నిశ్చితార్థాన్ని రద్దు చేసుకుంటున్నట్లు తాజాగా ఆకృతి ప్రకటించింది. "భవిష్యత్తుకు సంబంధించి మా ఇద్దరి లక్ష్యాలు, పరిస్థితులు విభిన్నంగా ఉన్నాయి. మాకు ఒకరిమీద ఒకరికి ప్రేమ ఉన్నప్పటికీ.. మా దారులు వేరని, ఇక కలిసి ప్రయాణించలేమని అర్థమైంది. బాధ్యతలు, మా చుట్టూ ఉన్న పరిస్థితుల దృష్ట్యా మేం విడి విడిగా ముందుకెళ్లాలని నిర్ణయించుకున్నాం. ఈ సమయంలో మా గోప్యతను అందరూ గౌరవించాలని ఆకాంక్షిస్తున్నా. మా నిర్ణయం వెనుక ఎలాంటి ఊహాగానాలు, అసత్య ప్రచారాలు చేయొద్దని కోరుతున్నా" అని ఆకృతి అగర్వాల్ తన పోస్ట్‌లో రాసుకొచ్చింది.

ఈమె ప్రకటన వెలువడిన కాసేపటికే.. పృథ్వీ షా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులన్నీ అదృశ్యమయ్యాయి. ఒక్క 2016 నాటి పోస్ట్ మినహా అన్నింటినీ తొలగించాడు. "నిన్ను నువ్వు పరిచయం చేసుకోవాల్సిన అవసరం లేనంత వరకు పని చేయి" అనే అర్థంతో ఉన్న పోస్ట్ మాత్రమే ఉంచాడు. అయితే, నిశ్చితార్థం రద్దు గురించి మాత్రం పృథ్వీషా ఇంకా స్పందించలేదు.

ఈ ఏడాది జులైలో వీరి బ్రేకప్ గురించి వార్తలు వచ్చాయి. "నేను మోసపోయా. అతడితో కలిసి జీవితంలో ముందుకెళ్లాలని నిర్ణయించుకున్నాక ఇదంతా నమ్మలేకపోతున్నా. అతడి గురించి సామాజిక మాధ్యమాల్లో చూసిందంతా నిజమే. వదంతులన్నీ వాస్తవమే" అంటూ ఆ మధ్య ఆకృతి ఓ పోస్ట్ చేసింది. అందులో పృథ్వీషా పేరును ఆమె ప్రస్తావించనప్పటికీ.. వీరిద్దరి మధ్య బ్రేకప్ జరిగినట్లు ప్రచారం జరిగింది. అయితే, నాడు ఆ వార్తలను ఆకృతి ఖండించింది. తన స్నేహితులను ఉద్దేశించే ఆ పోస్ట్ చేశానని, కాబోయే భర్తతో తాను చాలా సంతోషంగా ఉన్నానని నాడు ఆమె చెప్పింది. ఇప్పుడు రెండు నెలలు తిరగకుండానే.. నిశ్చితార్థాన్ని రద్దు చేసుకుంటున్నట్లు ఆమె ప్రకటించడం గమనార్హం. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా పాపులర్ అయిన ఆకృతి.. ఈ ఏడాది విడుదలైన 'త్రిముఖ' సినిమాలో నటించింది.

# ఆసియా గేమ్స్.. చిన్న జట్టుపై అతికష్టంగా గెలిచిన పాక్





ఆసియా క్రీడలను వర్షం ఇబ్బంది పెడుతోంది. ఉదయం జరిగిన క్రికెట్ మ్యాచ్ రద్దవ్వగా.. ఇక రెండో మ్యాచ్‌ను ఓవర్లకు కుదించి ఆడించాల్సిన పరిస్థితి నెలకొంది. చైనా - బంగ్లా మ్యాచ్ టాస్ కూడా పడకుండానే రద్దైంది. దీంతో మెరుగైన ర్యాంకింగ్ కారణంగా బంగ్లా సెమీస్‌లోకి అడుగు పెట్టింది. ఐసీసీ ర్యాంకుల్లో బంగ్లాది 10వ స్థానం. చైనాది 36వ ప్లేస్. దీంతో బంగ్లా నేరుగా సెమీస్‌కు చేరుకుంది. శుక్రవారం భారత్ - జపాన్ విజేతతో బంగ్లా సెమీఫైనల్‌లో తలపడనుంది. మరో క్వార్టర్స్‌లో పాక్ అతికష్టంగా విజయం సాధించింది.

**ఓటమి అంచు వరకూ..**

ఇక రెండో మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌తో పాకిస్థాన్ తలపడింది. ఈ మ్యాచ్‌కూ వర్షం అంతరాయం కలిగించింది. ఔట్‌ఫీల్డ్ చిత్తడిగా మారడంతో మ్యాచ్‌ను 11 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన థాయ్‌లాండ్ 4 వికెట్ల నష్టానికి 91 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో పాక్ ఇబ్బంది పడింది. ఆసియా కప్‌లో పరాభవంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న పాక్‌కు.. మరోసారి అలాంటి పరిస్థితి తప్పదా? అన్నట్లుగా మారింది. అయితే, మరో రెండు బంతులు మాత్రమే మిగిలి ఉండగా అతి కష్టం మీద విజయం సాధించి ఊపిరి పీల్చుకుంది. చివరికి 10.4 ఓవర్లలో 7 వికెట్లను కోల్పోయి 92 పరుగులు చేసి గెలిచింది. శుక్రవారం మలేషియా - శ్రీలంక మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టుతో పాకిస్థాన్ సెమీస్‌లో తలపడనుంది.

# నేను రోబోను కాను

తన కెరీర్ గురించి బయటి వాళ్లు ఎవరేమన్నా పట్టించుకోనని టీమ్ఇండియా బ్యాటర్ సంజు శాంసన్ అన్నాడు. "కొన్నిసార్లు వైఫై ఆన్ చేస్తా. మాజీ ఆటగాళ్ల వ్యాఖ్యలు చదువుతా. ఎవరి అభిప్రాయాలు వాళ్లు చెబుతారు. అది మామూలే. వాళ్లు నా గురించి సానుకూల వ్యాఖ్యలు చేయొచ్చు లేదా వ్యతిరేక వ్యాఖ్యలు చేయొచ్చు. నేను పరిణతి సాధించా. ఆ వ్యాఖ్యలు చూసి ఎలా వ్యవహరించాలో నాకు తెలుసు" అని శాంసన్ అన్నాడు. "కొన్నిసార్లు బాధనిపిస్తుంది. నేను రోబోను కాదు. ఆ వ్యాఖ్యలు కచ్చితంగా నాపై ప్రభావం చూపిస్తాయి. కానీ నాకు నేను సర్దిచెప్పకొంటా" అని చెప్పాడు. బయటివాళ్ల మాటలను పట్టించుకుంటే తాను సరిగా బ్యాటింగ్ చేయలేనని శాంసన్ అన్నాడు. తన అంతర్జాతీయ కెరీర్ బాగుందని, ప్రపంచకప్ తనకు ఎంతో ఉపయోగపడిందని అతడు చెప్పాడు. ఓపెనింగ్ స్థానానికి వైభవ్ నుంచి శాంసన్‌కు గట్టి పోటీ ఉన్న సంగతి తెలిసిందే. దీనిపై శాంసన్ స్పందించాడు. "భారత జట్టును నడిపించడం అంత తేలిక కాదు. 15 ఏళ్ల కుర్రాడు ఐపీఎల్‌లో 700-800 పరుగులు చేశాడు. నేను అంతకుముందు ప్రపంచకప్‌లో బాగా ఆడాను. దాని తర్వాత వైభవ్ గొప్పగా ఆడాడు. ఏదో రకంగా అతడు జట్టులోకి రావాల్సిందే" అని చెప్పాడు.

# గంగూలీ బయోపిక్ షూటింగ్.. ఇంగ్లాండ్ క్లబ్‌కు రూ.6 లక్షలు జరిమానా!

ఇంగ్లాండ్‌లోని ఓ కౌంటీ క్లబ్‌కు పడిన జరిమానాకు పరోక్షంగా భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ బయోపిక్ షూటింగ్ కారణమైంది. దాదాపు రూ. 6 లక్షల జరిమానాతోపాటు 27 పాయింట్ల కోత పడింది. గత ఆగస్ట్‌లో కౌంటీ ఛాంపియన్‌షిప్ మ్యాచ్ సందర్భంగా పిచ్ నాణ్యత దారుణంగా ఉందని తాజాగా రిపోర్ట్ వచ్చింది. లీసెస్టర్‌షైర్ - గ్లామోర్గాన్ జట్ల మధ్య డివిజన్ 1 మ్యాచ్ జరిగింది. గ్లామోర్గాన్‌పై లీసెస్టర్‌షైర్ 42 పరుగుల తేడాతో విజయం సాధించింది. కానీ, పిచ్ అత్యంత దారుణంగా ఉందని







కౌంటీ క్రమశిక్షణ ప్యానెల్ 'పూర్' రేటింగ్‌ను ఇచ్చింది. అయితే, పిచ్‌ను సరిగ్గా సిద్ధం చేయలేకపోవడానికి పలు కారణాలు ఉన్నాయని గ్రౌండ్స్‌మన్ కాల్లమ్ లూయిన్ తెలిపారు. తొలుత షెడ్యూల్‌లో లేని బాలీవుడ్ సినిమా చిత్రీకరణ కూడా ఒక అంశమని వెల్లడించారు.

"ఆ మ్యాచ్‌కు పది వారాల ముందు రెండు టీ20లు జరిగాయి. దీంతో డివిజన్ 1 మ్యాచ్ కోసం ఈ పిచ్‌నే వాడాం. ఆ సమయంలో వాతావరణం కూడా చాలా ఇబ్బంది పెట్టింది. దాదాపు 35 డిగ్రీల ఎండ ఉంది. అనుకోకుండా బాలీవుడ్‌కు చెందిన ఓ సినిమా చిత్రీకరణ కూడా ఈ మ్యాచ్‌కు నాలుగు రోజుల ముందే ఇక్కడ జరిగింది. దీంతో పిచ్‌మీద పని చేసేందుకు నన్ను అనుమతించలేదు. కనీసం కవర్ చేయడానికీ అవకాశం లేకుండా పోయింది" అని లూయిన్ తెలిపారు. గ్రౌండ్‌మన్ చెప్పిన సినిమా గంగూలీ బయోపిక్ అని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. కమిటీ నిర్ణయంపై అప్పీలు చేసుకొనేందుకు లీసెస్టర్‌షైర్‌కు 10 రోజుల సమయం ఉంది. తప్పకుండా దీనిపై రివ్యూ చేయమని కోరతామని క్లబ్ వెల్లడించింది.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314